PJSC 119B 170

కొండుభట్టీయము

బిలణీయము

(నాటకసంపుటి)

15

17

ముద్రణాధికారులపై

విశాలాంధ్ర ప్రచురణాలయం,

బకింగ్‌హాంపేట : విజయవాడ.

ప్రచురణ నెం. 72.

ప్రథమ ముద్రణ
జూన్ '54.

వెల : 1—8—0.

77345

స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్,
విజయవాడ-2.

అవతారిక

★

నాటకరచన కావ్యకళకు శిఖరంవంటిది. అట్టి నాటకరచనపట్ల ప్రత్యేక విశిష్ట సిద్ధాంతములుగల మహాకవి గురజాడ. ఇట్టి సిద్ధాంతములు కన్యాశుల్కపీఠికలోను, డైరీలలోను, లేఖలలోను బోలెడు : "కవితా న్యాయం నిన్న మొన్నటిలాగ యీనాడు లేదు. మానవజీవితాన్ని నేను చిత్రించి కళతో ఆపన్మపూరిత మే చేస్తానన్నకో. కవిత్వాకళకు నేను లొంగి వుండవలసినవాడనే ఐనా, నాకు మానవసమాజంపట్ల మహత్తరబాధ్యత అనేది వొకటి వున్నది" అని శ్రీ వంగోలు సుబ్రహ్మణ్యంగారికి వ్రాసిన లేఖలోని వాక్యాలూ, "ఇక నాటక యితివృత్తంగురించి: ప్రపంచ ప్రసిద్ధికెక్కిన ప్రాచీన శృంగారగాథల నుంచి యితివృత్తాలను సేకరించుకుని రచయితలు యెందుకు నాటకాలను రచిస్తారో నా కాశ్చర్యంగావుంది. జీవితంలో ఎంత వైవిధ్యముంది! ఎంత తీవ్ర గమనంవుంది! నేటి జీవితం పుష్కలమైన, అనంతమైన గాథలతో నిండివుంది. అయితే దీనిని రచయితలు దర్శించరు. ఇది గొప్పగోపమని భావించి నిత్య జీవితంనుంచి వొకవస్తువును తీసుకుని దానిని చిత్తరువువలె తీర్చిదిద్ద ప్రయత్నించాను. ప్రజలు మాటలాడుకునే తీయతీయని భాషే దీనికి తగివుంటుందికదా అని దానినే కళ్ళకద్దుకున్నాను" అని విజయనగరం రాజాసాహేబ్‌కు వ్రాసిన లేఖలోని పంక్తులూ గమనించినట్లయితే, మహాకవి నాటకరచనా ప్రయోజనం కొంతవరకు విదితమవుతుంది.

ఆంధ్రప్రజలు కళ్ళకద్దుకుంటున్న, గురజాడ రచించిన నాటకములు మూడు : కన్యాశుల్కము, కొండుభట్టీయము, బిల్హణీయము. ఇందులో చివరి రెండు నాటకములను, అముద్రితభాగములను చేర్చి, ఒక సంపుటిగా అచ్చొత్తించి ఆంధ్ర సాహిత్యాభిమానులకూ, ప్రజలకూ అందిస్తున్నాము. ఇవి అసంపూర్ణ రచనలు. సామాజిక యితివృత్తమును స్వీకరించి మలచిన నాటకము కొండుభట్టీయము. బిల్హణీయము ప్రాచీన శృంగార కథాసంబంధి.

ఇవికాక మరికొన్ని నాటకములను వెలయించవలెనని మహాకవి ఉద్యమించి కథా ప్రణాళికలను సంసిద్ధపరచుకొన్నట్లు వారి డైరీలు మనకు

తేటపరుస్తున్నవి. సాంఘికములే కాక, కొన్ని చారిత్రక నాటకములను కూడా రచియించవలెనని ఆయన సంకల్పం. కాని ఆ సంకల్పం నెరవేరలేదు.

కొండుభట్టీయము రచనాకాలం 1906. రాజాసాహేబ్‌నకు వ్రాసిన మహాకవి లేఖలో: "1906 వేసవిలో నేనింకొక వచన నాటకాన్ని ఊటీలో వుండగా రచించాను. కాని వ్రాతప్రతి కనిపించడంలేదు" అనివుంది. ఈ లేఖ వ్రాసిన తేదీ: 26 సెప్టెంబరు 1908. అయితే దీనిని తిరిగి రచించి 24 మే 1909 నాటికే పూర్తిచేసినట్లు, అదే తేదీన శ్రీ వంగోలు సుబ్రహ్మణ్యుల గారికి, అప్పారాయకవి వ్రాసిన ఉత్తరం దాఖలా యిస్తున్నది: "మరొక నాటకం వ్రాతామని కథా ప్రణాళిక సిద్ధంచేసుకున్నాను. వ్రాతప్రతిలోవున్న విషాదాంత నాటకం నీకు తెలుసున్నదే కదా. అయితే యిది అచ్చొత్తించే మార్గం? అక్కడే వుందయ్యా వున్న చిక్కల్లాను!"

ఈ విషాదాంత నాటకమును నాటి విజయనగర కళాశాలా ప్రిన్సిపాలు టి. శే. కిళాంబి రామానుజాచార్యులవారు గవర్నమెంటు ఆర్కియలాజికలు డిపార్టుమెంటుకు సూపరెంటెండెంటుగా వుండిన వెంకయ్యగారు, విజయనగర ఆస్థాన వైయాకరణులు మండ లక్ష్మీకామశాస్త్రిగారు మరికొందరు పండితులు చదివి ఆనందించిరట.

"అచ్చొత్తించే మార్గం" ఎలాగునో చూసి "ఆ వున్న చిక్కును" దాటి మహాకవి, దీనిని పుస్తకరూపాన ప్రచురించడానికి, మదరాసు కైలులో వెడుతుండగా మార్గమధ్యలో ఆయనసంచిగవెట్టెను దొంగలుఎత్తుకుపోయారు! పెట్టెతోపాటు 'కొండుభట్టీయము' వ్రాతప్రతి కూడా మటుమాయమైంది! అంతటితో విసుగుచెందక తిరిగి దీనిని వ్రాయసమకట్టి 1910 వ నాటికి సుమారు మూడు అంకములు పూర్తిచేశారు. 1909 లో కన్యాశుల్కము రెండవసారి ముద్రించాలని, దానిని మార్చి వ్రాసినపుడు, ఆ నాటకానికీ దీనికీ పోలికలు కనిపించడ మలావుండగా, ఇందుగల చమత్కారములు కొన్ని, అందు చోటు చేసుకున్నవి.

1906 లో తాము రచించి మహాకవి పోగొట్టుకుంటిమనుకున్న వ్రాతప్రతి రికార్డులను గాలించగా, వారి కుమార్తె శ్రీ రామదాసు పంతులుగారికి దొరికెనది. కాని ఆ వ్రాతప్రతి పూర్తిగ లభింపలేదు. దానినీ, 1910 వ నాటి కొత్తప్రతినీ సంప్రదించి సమన్వయించి యిదే రూపమున వారు 1939 లో

ముద్రింపించారు. పాతప్రతిలో మంజువాణి కొత్తప్రతిలో కనకవల్లిగా మారడమే కాక, కథావృత్తాంతమున అనేక వింతవింత మార్పులలు పొడగట్టినవట. 1906 వ నాటి ప్రతినీ, దీనినీ తైపారువేసి, ఆవింతలేమో, సొగసులేమో పరిశీలించుదామన, యిపుడు ఆ పాతప్రతి లభియించుటలేదు. ఇందు సంకలితము కాబడిన అముద్రితభాగములలో, పాత్రల వివరణ మరికొంత స్పష్టముగా విదితమవుతున్నది. ఈ నాటకమున వచ్చు 'సాహేబు' నిజముగా సాహేబుకాడనీ, కొండుభట్టును సంస్కరించుటకు వచ్చిన మారువేషధారి అనీ, అదే తలంపుతో కథ నడిపాడనీ కొందరు పెద్దలు చెప్పడంకద్దు. దీనిని రుజువుపరచు గట్టి ఉపపత్తులను చూపించలేము కాని, ఊహించుటకు అవకాశం కలదు. ఇందు ముద్రితమైన అముద్రిత భాగములలో కనిపించే శంకరశాస్త్రి రామమూర్తితో సంభాషించేటప్పుడు, మరికొన్ని తావులందు, కొండుభట్టును సంస్కరించుటకు తాను యత్నిస్తున్నట్లు రూఢిఅవుతున్నది. ఇంతేకాక, శంకరశాస్త్రి నటుడు; అతని కొక నాటకపు జట్టుకూడా వున్నది. అయితే శంకరశాస్త్రి, సాహేబు రూపము ధరించినట్లు అచ్చుప్రతినిబట్టి స్పష్టీకరింపజాలము. సంఘసంస్కరణకోసం, శంకరశాస్త్రికి బదులు, గిరీశము ప్రవేశించినట్లు ముద్రితభాగం రుజువుచేస్తున్నది. గిరీశము నడిపిన కథ మరివొక ప్రుంతను పయనించినది.

అసలుప్రతి పోయినందువల్ల, 1906 వ నాటి ప్రతీ, 1910 వ సంవత్సరపు ప్రతీ వేరువేరుగా ముద్రితము కానందున, యిప్పుడీరూపాన అచ్చొత్తించిన భాగములనుబట్టి యిట్టి విషయాలను తేల్చడం కష్టం. నాటకమున సమన్వయభావము చదువరులకు స్పష్టముగా కుదరకపోవడం సహజం; అయినను కొన్ని ముఖ్యనిర్ణయములను కావించుటకు అవకాశమున్నది.

"ప్రాతప్రతిలోవున్న విషాదాంతనాటకం నీకు తెలుసున్నదేకదా" అనే మహాకవి లేఖలోని మాటను పురస్కరించుకొని యీనాటకము ఎలాగున విషాదాంతముగ పర్యవసించినదో పూజ్యశ్రీ సుబ్రహ్మణ్యముగారిని తెలుపవేడితిని. కాని యిది నలభైఐదేళ్ళనాటిమాట! ఆ కథాశేషము వారికి యెటుల స్ఫురింపకిరాగలదు!

కొండుభట్టీయము, బిల్హణీయములలోని పాత్రలు మహాకవి యదార్థ ప్రపంచంనుండి పరిగ్రహించినట్టివి. నాటి మనుజుల ప్రవృత్తులు, పోకడలు

యీపాత్రలలో మూర్తీభవించాయి. జాతిలక్షణాలను ద్యోతకంచేసే పాత్ర రచనాపద్ధతిలో కేవలమూ ఒకేమానవునిలోని లక్షణములు వున్నవిన్నట్టూ చిత్రీకరింపబడవనే సూత్రం నిజం కనుక, యింమ అభివర్ణితపాత్రలన్నీ అచ్చముగా ఆయా మనుషులేనని నిర్ధారింపలేము. కాని మహాకవి తమ మిత్రులను, చిరపరిచితులను, యీపాత్రలను రచించేటప్పుడు తమచూపులలో లిఖియించుకున్నారు. బిల్హణీయములోని విదూషకపాత్ర, నాటి విజయనగర ఆస్థానపు నాటకజట్టు బుచ్చిశాస్త్రి అపోసియేషనులో సభ్యులుగావుండిన శ్రీ కర్రా పాపయ్యశాస్త్రిగారు. ఈయన సంస్కృతనాటకాలలో 'విదూషక' పాత్రను అభినయించేవారు. అదేవిధంగా నాడు దివానుగావుండిన అనంతరావుపంతులు, వైయాకరణులు శ్రీ మండ లక్ష్మీనారాయణ, ఉభయభాషాపండితులు శ్రీ ముడుంబి నరసింహాచార్యులవారూ బిల్హణీయమునందలి పాత్రలలో ప్రతిబింబించారు. వీరందరును మహాకవికి ఆప్తమిత్రులు. ఇదేవిధంగా కొందుభట్టీయములోని పాత్రలు. ఇవికాక యింకా అనేక పరిశీలనలను యింమ చేర్చినట్లు వారి డైరీలను చదివినప్పుడు పాఠకులకు చక్కగా తేటపడుతుంది.

బిల్హణీయము రచనాకాలం: 1910 వ సంవత్సరం. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో వొక అంకము ప్రకటింపబడింది. రెండవ అంకము 1911 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ప్రచురితం. 24 మే 1909 న శ్రీ సుబ్రహ్మణ్యంగారికి మహాకవి వ్రాసిన లేఖలో "మరొక నాటకం వ్రాతామని కథా ప్రణాళికను సిద్ధంచేసుకున్నాన"ని వుంది. అది బిల్హణీయ నాటక కథా ప్రణాళికయే కావచ్చును. "ప్రాచీన శృంగారగాథలనుంచి యితివృత్తాలను స్వీకరించుకుని రచయితలు యెందుకు నాటకాలను రచిస్తారో నాకాశ్చర్యంగావుంది" అనిన మహాకవి ప్రాచీన శృంగారకథ బిల్హణీయమును యెందుకు నాటకంగా రచించారనే ప్రశ్న ఉత్పన్నంకావడం న్యాయం. ఇందుకు రెండు కారణాలు కనిపిస్తున్నవి. శృంగార రసప్రధానమైన కల్పనలకు వ్యావహారికభాష అనువ్యామని చెప్పే నాటి పండితమిత్రుల వాదనమును పూర్వపక్షం చేయడం; రెండవది మిత్రుల కోరిక: "నా యెత్తిపొడుపు మీదనే 'బిల్హణీయము' ప్రారంభించిరి. కన్యాశుల్కమునకు గిరీశమువంటి నాయకుని పెట్టి సంఘ సంస్కరణోద్యమమును వేశాకోళములోనికిదించి యుపక్రతికి మారు అపక్రతియే చేసిరని నేనొకమారు తెలిసియో తెలియకయో సాహసించి యొకసభలో విజయనగరములో నంటిని. ఆ రోజుతో ఆయనకు

నాయందభిమాన మంకురించి రానురాను పుత్రప్రేమవంటి వాత్సల్యముగా పరిణమించినది. ఆ తరువాత కొన్నిరోజులకే ఆయన నాచేత కూడా ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికకు 'నన్నెచోడుని' గురించి వ్యాసము వ్రాయిస్తూ 'మీవంటి "పరిశుద్ధవాదులకు" అంగీకారముగా వుండేటట్లు శృంగార ప్రాధాన్యముగల యితివృత్తమును నాటకమునుచేసి వ్యావహారికభాషను వ్రాస్తాను' అని సంకల్పించి బిల్హణీయము యెత్తుబడి చేసినారు" ఈ వాక్యములు జీ. శే. డాక్టర్ బుర్రా శేషగిరిరావు పంతులుగారివి. అయితే కన్యాశుల్కం నాటకమును గురించి శేషగిరిరావు పంతులుగారు కావించిన విమర్శనమును. మహాకవి 'అవున'ని ఆమోదించినట్లు కనబడదు. ఇందుకుగల అనేక ప్రమాణాలలో కొన్ని మాత్రమే ఉదహరించిన చాలును; "షేక్స్పియరుతో మొదలెట్టగామంటే నాలుగవ హెన్రీ, ఐదవ హెన్రీ, మెర్రీవైవ్స్ ను అనే నాటకాలలో వచ్చే డాల్ షీర్ షీటు, సైన్ హాట్లెస్, డేమెక్విక్లీ; ఇవన్నీ కూడ సర్ జాన్ ఫాల్ స్టాఫ్ తో ఒక కూటమిగా యేర్పడి యెంతో ఆసక్తిని కలిగింపచేస్తాయి ... ... షోకిల్లా అయిన ఫాల్ స్టాఫ్ షేక్స్పియరీయను హాస్యానికై మహాప్రవంతివలె ప్రాతినిధ్యం వహిస్తున్నాడు ... ... కవితా కళకు నేను లొంగివుండవలసిన వాడినే ఐనా, నాకు మానవసమాజం పట్ల మహత్తర బాధ్యత అనేది ఒకటి వున్నది. కనుకనే పాఠకులు నన్నొక ప్రశ్న అడగవచ్చును. ఒక దోషాన్ని, దుర్మతను, అవినీతిని ఆకర్షవంతం చేశానా? చేయలేదనే భావిస్తున్నాను ... ... మానవజీవితంతో నేను చెలగాటం ఆడ్డం లేనేలేదని యీ నాటకం చదివితే నీకు తెలుస్తుంది. ఎట్టి తృణీకార భావమూ లేకుండా, మానవ జీవితాన్ని గంభీరమైనదానినిగా భావించి ఈ నాటకంలో దానిని యితివృత్తంగా స్వీకరించాను ... ... వాస్తవికరచన అనేదానిని కళలలో ఎంత ఆదర్శపూరితం చేసినప్పటికీ మానవుని నైతిక ప్రమాణాలను అది స్పృశించక తప్పదు. అతని నైతికదృష్టికీ, భావాలకూ కష్టం కలుగకమానదు" ఇవి మహాకవి, శ్రీ సుబ్రహ్మణ్యంగారికి వ్రాసిన లేఖలోని అనేక పంక్తులలో కొన్నిమాత్రమే.

కాని మహాకవి యెత్తుబడిచేసిన బిల్హణీయమును గ్రామ్యగ్రాంధిక సంరంభములో పత్రికావాదములలో పడి, కడతేరా వ్రాయక వదలిపెట్టిరి. ఇదే కారణాన కన్యాశుల్కము ట్రిలోజీగా వ్రాయాలనే వారి తలంపు రెండు రంగాలవరకూ సాగి నిలిచిపోయింది.

బిల్హణీయము ప్రాచీన సంస్కృతకావ్యము. ఇందులో కథ తక్కువ. వర్ణనలు ఎక్కువ. క్లుప్తంగా కథ యిది : మదనాభిరాముడు పాంచాల దేశపురాజు. అతని పట్టణం లక్ష్మీమందిరమనే పేరుగలది. భార్య పేరు మందారమాల. కూతురు యామినీపూర్ణతిలక. ఆమె మిగుల అందకత్తె. కుమార్తెకు కావ్యాభినివేశమును కల్పింప తండ్రి ఆశయం. ఇందుకు తగినవాడు బిల్హణుడేనని నగరులోని పండితులు రాజుకు చెబుతారు. బిల్హణుడు, కవి; రూపవంతుడు. అతనివద్ద తన కూతురును చదివిస్తే బిల్హణుడి 'చూపుటుర్ల' చిక్కుకుంటుందని రాజునకు భీతి జనించింది. కాని అతడే పని తగిన విద్యాగురువు. ఇందుకు మంత్రి వొక ఉపాయం పన్ని రాజుకు ఉపదేశించాడు. అది యిది : బిల్హణుడు కుష్ఠురోగిని చూడనొల్లడు. తాను అంధునిమోము తిలకించనని యామినీదేవి శపథంపట్టిందికదా. బిల్హణుడు అంధుడని రాజపుత్రికకూ, రాజపుత్రిక కుష్ఠుదని బిల్హణునికీ చెప్పి యిరువురి మధ్య వొక తెర అమర్చి విద్యాభ్యాసం జరిగించాలని మంత్రి ఆలోచన. రాజు సరే నన్నాడు. కాని కొంతకాలానికి యామినీ బిల్హణులకు యీ రహస్యం తెలిసిపోయింది. ఉదయిస్తున్న చంద్రబింబాన్ని చూసి దాన్ని వర్ణిస్తోన్న బిల్హణుడు యామినికి కనబడిపోయాడు. అంధుడైతే ఎలా చంద్రుని వర్ణించగలడని మధ్యనున్న తెర తొలగించి ఆమె తొంగి చూసింది. యామినీ బిల్హణులకు ప్రేమ కుదిరింది. అంతఃపుర ద్రోహానికి తలపెట్టినందుకుగాను, బిల్హణుని పీక ఉత్తరించమని రాజు ఆజ్ఞ. వధ్యస్థానానికి తీసుకుపోబడిన బిల్హణుడు చెక్కుచెదరక చిరునవ్వునవ్వగా, ఆశ్చర్యంతో రాజోద్యోగి అందుకు కారణ మేమిటని అడిగాడు. యామినీదేవి సదా స్మృతియందుండుటవలన తనకు వెరపన్నది కలగడంలేదని బిల్హణుడి సమాధానం. తనకూ, యామినీపూర్ణతిలకకూ గల ప్రేమను బిల్హణుడు కొన్ని శ్లోకములలో వర్ణించాడు. వారిరువురి ప్రేమగాథను విని రాజోద్యోగి జాలిపడి, బిల్హణుని ప్రసన్నుని చేయవలసినదిగా రాజును ప్రార్థించాడు. రాజు కనికరించాడు. యామినీ బిల్హణులకు వివాహమయింది.

సంస్కృత బిల్హణీయమునకు తెలుగు అనువాదాలు వున్నవికాని, అందు సింగనార్యుని ఆంధ్ర 'బిల్హణీయమే' ప్రాచుర్యము వహించినది. ఇది మూలమునకు యథాతథ ఆంధ్రానువాదమూ కాదు; అట్లని కాకనూపోదు.

మహాకవి గురజాడ నాటకీయముచేసిన 'బిల్హణీయము'నకూ, సంస్కృత మూలానికీ పోలికలు లేవనే చెప్పవచ్చును. సింగనార్యుని ఆంధ్రానువాదంలో గల మార్పులతో యీ బిల్హణీయ నాటకానికి ప్రసక్తియేలేదు. మూలమున బిల్హణుడు కాని. ఇట మహామేధావి. అందు కథనడచిన దారివేరు. ఇందు మహాకవి త్రొక్కిన త్రోవవేరు. కాగా ఇది సర్వస్వతంత్రరచన. అట్టి తార తమ్య పరిశీలన చేయుటకు యీసంపుటిలో అముద్రితభాగాలను పొందుపరచి నాము.

మహాకవి రచనలు కొన్ని పుస్తకరూపమున ముద్రించి వారి కుమార్తె శ్రీ రామదాసు పంతులుగారు 'వాగను శాసనులు' శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారికి పంపినపుడు, వారు 8, అక్టోబరు 1929 లో వ్రాసిన లేఖలోని వాక్యాలను స్మరిస్తూ మహాకవి రచనల నన్నిటిని కొన్ని సంపుటాలుగ ఆంధ్ర సోదరులకు సమర్పింపగలుగుతున్నందుకు ఆనందిస్తున్నాము.

వాగనుశాసనులు గిడుగు రామమూర్తి పంతులుగారి లేఖలోని వాక్యములు : "పుస్తకము చూసి చాలా సంతోషించాను; కళ్ళకు అద్దు కొన్నాను; ముద్దపెట్టుకొన్నాను. మీ నాన్నను చూసినట్లు అయినది."

అట్టి మహాకవి రచనలు ఇందు రెండు!

— అవసరాల సూర్యారావు.



కొండుభట్టీయము

ప్రధాన పాత్రలు

★

కొండుభట్లు	:	అగ్రహారీకుడు
రామూర్తి	:	కొండుభట్లు కుమారుడు
వెంకన్న	:	కొండుభట్లు అన్నకుమారుడు
గిరీశం	:	రామూర్తికి మాష్టరు
అక్కాభత్తుడు	:	వెంకన్నకు చేదోడు వాదోడుగా వుండేవ్యక్తి
ప్రతిక్రమరావు	:	తుమ్మలపాలెం మొఖాసాదారు
దివాన్‌బహద్దర్ రాజారాం	:	ఇంద్రపట్టణం బ్రహ్మసమాజ కార్యదర్శి
కేశవరాయుడు	:	హెడ్‌మాష్టరు
రంగనాయకులుశెట్టి	:	కొండుభట్లు స్నేహితుడు
మంజువాణి	:	రామసాని పెంచిన వేశ్య
రత్నాంగి	:	మంజువాణి ఆశ్రితురాలు
పార్వతి	:	కొండుభట్లు మేనకోడలు; వితంతువు

★

కొండుభట్టీయము

ప్రథమాంకము

ప్రథమరంగము

[మంజువాణి యిల్లు : మంజువాణి తల దుప్పుకుంటూ కుర్చీపైని కూర్చుంటును. కొండుభట్లు ప్రవేశించును]

మంజువాణి : దండం, శాస్త్రుల్లుగారికి; వెంకీ! శాస్త్రులుగార్ని కూర్చోబెట్టి పీట వెయ్యే.

కొండుభట్లు : సకలైశ్వర్యసిద్ధిరస్తు, పంతులవారు పాదాక్రాంతాభవంతు.....ఆ తలవెండ్రుకలు సాక్షాత్తూ చమరీ వాలాల్లాగ శోభిల్లుచున్నాయి. విన్నావా, మంజువాణీ!

మంజువాణి : యింకా యేవి యెలా వున్నాయి?

కొండుభట్లు : యెవిన్ని వర్ణించడానికి సెఖ్యం కాకుండా వున్నాయి.....ముఖం చంద్రబింబంలావున్నది. కళ్లు కలవ రేకుల్లా వున్నాయి. గళం శంఖంలావున్నది. బాహువులు లతల్లావున్నాయి. మరెవచ్చీ...

మంజువాణి : మరెవచ్చీ, అక్కడ ఆగండి.

కొండుభట్లు : మంజువాణీ! అధికం యేల? నీ సౌందర్యం రంభా, ఊర్వశీ, మేనకా, తిలోత్తమాదుల్ను ధిక్కరించి వెక్కిరించియున్నది.

మంజువాణి : మా పంతులుగారి వెధవ అప్పుగారిసాటి యేమా త్రమయ్నా వస్తుందా?

కొండుభట్లు : హాస్యానికైనా అనకూడని మాటలున్నాయి.
(పొడుం పీల్చును)

మంజువాణి : చెయ్యగాలేంది, చెప్పడమా తప్పొచ్చింది !

కొండుభట్లు : దేవతలు, బ్రాహ్మలుచేసే పనులు తప్పు పట్ట కూడదు. స్వర్గంలో వాళ్లు దేవుళ్లయితే భూలోకంలో మేం దేవుళ్లం; అంచేతనే మమ్మల్ని భూసురులంటారు. చదువు కున్నదానివి నీకు తెలియందేమున్నది.

మంజువాణి : వెధవల్ని తరింపజేసే భూసురోత్తములకు నమస్కారము. (నిలుచుని నుదుట చేతులు మొగిడ్చి నమస్కారము చేయును)

(భీమారావు పంతులు ప్రవేశించును)

భీమారావుపంతులు : యేమి టీనాటకం ?

మంజువాణి : ముక్కోటి దేవతలు స్వర్గంలోవుంటే భూమ్మీద దేవతలు బ్రాహ్మలని కొండిభొజ్లుగారు శలవిచ్చారు. అందుచేత వేశ్యయింటికి అనుగ్రహించి వేంచేసిన భూసురోత్తముల్ని కొలుస్తున్నాను.

భీమారావుపంతులు : నీవు యెంత యెకసెక్కంచేసినా మేం దేవతలమే. అందుకు రవ్వంతయినా సందేహములేదు.

మంజువాణి : భూలోకంలో కృష్ణావతారంలాంటి రసికులు మీరు. కృష్ణావతారం కుదిరింది; కాని శాస్త్రులుగారు యే దేవుడి అవతారమో పోల్చలేకుండావున్నాను.

భీమారావుపంతులు : పట్టణం వెళ్ళినప్పుడు పరంగీ స్త్రీల సహవాసం చేశానని చేప్పేరుగనుక శాస్త్రుల్లుగారు సాక్షాత్తు నారదావతారం.

మంజువాణి : అన్నా; మరచిపోయినాను. ఎంత బుద్ధితక్కువ మనిషిని! దూరంగా నిలుచొండి. ప్రాయిచ్చిత్తం చేసుకుం టేనేగాని దగ్గిరకు రానియ్యను.

భీమా : శాస్త్రుల్లుగారు! ఏమిటండి ప్రాయశ్చితం? నఖ క్షతమా, దంతక్షతమా?

కొండు : అది యెంత అదృష్టవంతులకుగాని సంప్రాప్తమవు తుంది. ముక్కుతిమ్మన్న యేమన్నాడూ:

చ. ననుభవదీయదాసుని మనంబున నెయ్యపుఁగిన్కబూని తా చినయది నాకుమన్ననయ చెల్వగు నీపదపల్లవంబు మ త్తను పులకాగ్రకంటక వితానముదాఁకిన నొచ్చునంచు నే ననియెద నల్కమానవుగదా యిఁకనైన నరాళకుంతలా!

స్వేతముఖులు గనుక బ్రాహ్మడికి రజితదానం చేస్తే ప్రత్యా వాయం పోతుంది. మా కుర్రవాడు మెట్రిక్లేషన్ పరీక్షకు కట్టాలి. ఈ బీదబ్రాహ్మడికి దానంయిస్తే సమయానికి మహోపనికివస్తుంది.

మంజు : నిత్యసువాసినికి సువర్ణదానం చెయ్యమని లేదా?

భీమారావు : (మెల్లగా) దీని తస్సాగొయ్యా బంగారపుసరుకు మళ్లీ తెమ్మంటుంది కాబోలు! తొందరపని వుంది; యిప్పుడే మళ్లీ వస్తాను. (నిష్క్రమించును)

కొండు : మంజువాణి! బహుపుణ్యాత్మురాలివి; యేమైనా సాయం చేస్తేనేగాని కుర్రవాడు పరీక్షకువెళ్లే సాధనం కనబడదు.

మంజు : పంతులుగారి అప్పని అడగరాదా?

కొండు : యెవర్నీ అడక్కుండా యేమయింది ! నైదీకపాళ్లని
పుట్టించినప్పుడే బ్రహ్మ రాసిపడేశాడు ; "ముప్పైత్తు
కొండర్రా" అని !

మంజు : యేదీ, యిందాకటి పద్యం చదవండీ !

కొండు : (రాగవరసను చదువును)

చ. నను భవదీయదాసుని మనంబున.....
.....అరాళ కుంతలా !

(అలా రాగవరసని చదువుతూవుండగా వెనకనైపువచ్చి మంజువాణి
శాస్తులు వీపుమీద తన్నును)

ఓ స్నిగ్ధమన్మథశిఖా..... (అని తగ్గి) ఆహా! మల్లి పువ్వులగుత్తా,
పట్టుకుచ్చా, మలయమారుతమా వీపుతాకినది !

మంజు : సానిదాని కాలు !

కొండు : కాదు; కాదు; మన్మథుని వాడివాలు !

మంజు : ప్రాసకుదిరింది కాని, శాస్తులుగారు ! యీ తాపు
మదనశాస్త్రంలో క్రియకింద పరిగణన అవుతుందా ?
భూసురోత్తముల తన్నిన పాపంక్రింద పరిగణనమవుతుందా?

కొండు : పదిరూపాయిలాలు పారేస్తే పుణ్యంకింద పరిణామం
అవుతుంది.

మంజు : పాటుపడక పైసారాదు.

కొండు : బ్రాహ్మడికల్లా సాపాటు వక్కలు పెద్దపాటు యేర్పా
టుచేసి బ్రహ్మ పడేశాడు.

మంజు : అయితే పెందరాళే వెళ్లి ఆపాటు పడండి.

కొండు : మంజువాణీ! యెంత చదువుకున్నా మావంటివాళ్ళను నీకు వక్కమాటకు సదుత్తరం చెప్పగలమా; బాపనాళ్ళని కనికరించి ఒకడబ్బు సొమ్ము ఇవ్వాలిగాని.

మంజు : వేశ్యల ద్రవ్యం పాపిష్టిది. బేరం తెచ్చి రుసుం పుచ్చుకుంటే ప్రత్యవాయంవుండదు.

కొండు : ఈవ్యూళ్లో నానాటికి రసికత సన్నగిల్లుతూన్నది. "అంధునకు గొరయ వెన్నెల" అన్నట్టు ఈవ్యూళ్లో మూళ్ళకు నీ రూపలావణ్య విలాస విశేషములు అగ్రాహ్యములు. తోవంటపోయే పొన్నూరువాళ్లను కాచి పట్టుకోవాలి.

మంజు : ఈ కంసాలాడు యింటి యెదుట దుకాణం పెట్టుకుని యిక్కడికి వచ్చేవాళ్లనల్లా వాళకం కట్టుతూవుంటాడు. వాడిని తెత్తే.....

(తెర)

ద్వితీయరంగము

(కొండుభట్టు యిల్లు; వీధిసావిడి; రామూర్తి, వెంకన్న ప్రవేశించుచు)

వెంకన్న : రాముడు! పరీక్షుంటే యేమిటిరా?

రామూర్తి : పరీక్ష అంటె యెగ్జామినేషన్.

వెంక : (పొడుం పీల్చును) యజ్ఞం నాకు తెలుసును. మేషం అంటే మేక. మేకపోతుని వేస్తారా ఏమిసిరా?

రామూర్తి : ఫూలిష్! యజ్ఞంకాదు, మేషంకాదు. శాస్త్రీస్తో ప్రశ్నలు అడుగుతారు.

వెంక : నీకు శాస్త్రమువచ్చును? తర్కమా, వ్యాకరణమా?

రామూర్తి : నథిం గాఫ్ ది కైండ్! జాగర్ఫీ వకటి.

వెంక : అనగా?

రామూర్తి : భూగోళశాస్త్రం.

వెంక : దానిలో యేమిటుందిరా?

రామూర్తి : వెలగపండువలె గుండ్రంగావుండే భూమిమీద యేయే నదులు, సముద్రాలు, కొండలు వగయిరాలు యెక్కడ వున్నాయో చెప్పుతుంది.

వెంక : భూమి గుండ్రంగా వుంది? అబద్ధం! అబద్ధం! నలు చదరంగా వుంది; దాన్ని అష్టదిగ్గజాలూ మోస్తున్నాయి.

రామూర్తి : నాన్ సెన్సు! "కపిట్థాకార భూగోళం" అని మనవాళ్ళకూడా అన్నారు. ఏనుగులుమాట పాతమాట. అవి అన్నీ వెళ్ళిపోయినాయి.

వెంక : గుండ్రంగావుంటే యెవరు మోస్తున్నారు?

రామూర్తి : ఎవ్వరూ మొయ్యలేదు. ఆకర్షణశక్తివల్ల భూగోళం అంతరాళంలో నిలిచియున్నది.

వెంక : అలాచెప్పు. అదో కొత్తశక్తిపేరు చెప్పావు. ఏదో వక దేవతలేస్టి యేదీ వుండదు. అయితే యీ వెధవలు పశ్చిమ సముద్రం చూశారా?

రామూర్తి: ఓ! దాన్లోకి ఓజి, యెనిసి, లీనా అనుమూడు నదులు ప్రవహించును.

వెంక: అబద్ధం, శుద్ధ అబద్ధం. హిమవత్పర్వతానికి వుత్తరం యవడితరం చూడ్డం? మనుష్యులు వెళ్లి తే చచ్చిపోర్రా! ఇదా దొంగముండాశాస్త్రం. ఇంకా యే శాస్త్రం చదువు కున్నావు?

రామూర్తి: హిస్టరీ.

వెంక: విస్తరా?

రామూర్తి: చెరిత్ర.

వెంక: అనగా?

రామూర్తి: తెలియనివాడితో యేమిచెప్పను. వేదాలు యెప్పుడురాశారో, రామాయణం, భారతం యెప్పుడు పుట్టేయో, అవి యెంతనిజం, యెంత అబద్ధమో.....

వెంక: వేదాలు రాశారు? రామాయణం అబద్ధమా?

రామూర్తి: ఆ! కావలసినంత. రాముడు దేముడు కాడు. మహారాజు. రావణాసురిడికి ఒక్కడే బుర్ర; విన్నావా!

వెంక: ఈ పాపపు మాటలు వినకూడదు.

(చెవులు మూసుకుని పారిపోవును. ప్రవేశం: గిరీశం)

గిరీశం: అజ్ఞానం! ఈ అజ్ఞానం పోతేగాని మనదేశం బాగు పడదు.

రామూర్తి: మా వెంకడికి మెదడులేదు.

గిరీశం : మీ తండ్రి తెలివివున్న మూర్ఖుడు. భోగంవాళ్లని యింటికివెళ్లి ఆశ్రయిస్తాడు. నీపకువు తీసివేస్తున్నాడు. సమయముచూసి చివాట్లు పెట్టాలి.

రామూర్తి : అతనికి తోచినట్టూ అతను చేస్తాడు, మనకి తోచినట్టు మనం చేదాం.

గిరీశం : డామిట్ ! ప్రాణమయ్నా యిచ్చెయ్యాలిగాని రిఫారం విషయమై నదురూ బెదురూ వుండకూడదు. లేకుంటే మనదేశం బాగుపడేదెట్లు ? మనకి బంగాళీవాళ్లలాగ పరువు ప్రతిష్ట వచ్చేదెట్లు ?

రామూర్తి : అయితే సమయంచూసి చివాట్లు పెట్టమంటారా?

గిరీశం : ఇంకా ఆలోచిస్తావా ? అదుగో మీ తండ్రి వస్తూన్నట్టుంది, నన్నెరగనట్టు నటించు. రహస్యం భేదించకుండా నటించాలి.

రామూర్తి : యెందుకేమిటండి?

గిరీశం : మీతండ్రి అసాధ్యుడు. నిన్నుగురించి యెంతో విచారిస్తున్నాను.

రామూర్తి : ఆయనతో పరిచయము చేశారా యేమిటి?

గిరీశం : చేశాను. నీకు చూస్తానన్నపిల్ల ముక్కుపచ్చలారని పసిపిల్ల. రిఫార్మక్ అనేవాడు అలాంటిపిల్లని పెళ్లాడితే సొసైటీ లుక్స్ డౌన్ అపాన్ హిం. సంఘం అతన్ని నిరసనగా చూస్తుంది.

రామూర్తి : అంచేతనే నేను సిగ్గుతో చచ్చిపోతున్నాను. తెగించి దేశాలంట పోదునా అనిపిస్తూంది.

గిరీశం : నాన్నో యన్నదూ చెప్పకపోతివే !

రామ్మూర్తి : యేమని చెప్పను? సిగ్గుచేత చెప్పలేదు!

గిరీశం : ఒకరి లోపాలికి మనం సిగ్గుపడనేలా? చేతనయినంత వరకు మన్నిద్దాం. మన్నించకపోతే కసికరిద్దాం. సిగ్గుతోనూ, కోపంతోను పనిలేదు.

రామ్మూర్తి : నామీద్దయచేత మీరుఅలా అంటారు. లోకంలో తలయెత్తుకు యెలా తిరగను ?

(తెర)

తృతీయరంగము

(అక్కాభత్తుడి యింటి వీధిఅరుగు : వెంకన్న, అక్కాభత్తుడు ప్రవేశించును)

వెంకన్న : ఏనుగులు దొబ్బేశాయండోయి.

అక్కా : ఎవరి యేనుగులు? విజయనగరంవారివా? బొబ్బిలివారివా?

వెంక : కాదండి, దిగ్గజాలు.

అక్కా : ఎక్కడికి వెళ్ళిపోయినాయి?

వెంక : భూమి వెలగపండులా గుండ్రంగావుందిష. అంచేత యేనుగులమోత అక్కరలేదుష.

అక్కా : భూమి వెలగపండయితే, యేనుగులు వెలగపండును తినేస్తాయి కాబోలు?

వెంక : మా రాముడు చెప్పాడు.

అక్కా : ఇంకా యేమిచెప్పాడు ?

వెంక : వేదా లెవళ్లో రాశారుట, రాములువారు మనిషట, దేముడు కాడట.

అక్కా : మీకు కొండిభొట్లు ఇంగ్లీషు చదువు చెప్పించాడు కాడని నాకు కించగావుండేది. ఇంగ్లీషు చదువుకి యిదే ఫలితమయితే మరి విచారంలేదు. తురకలు మెడకి కత్తిమొనచేర్చి గొడ్డుమాంసం తినిపించేవాళు. ఈ ఇంగ్లీషు వాళ్ళు చదువులుపెట్టి మనవేళ్ళతో మన కళ్ళే పొడుస్తున్నారు. అదిగో మీ బాబు వస్తున్నాడు; పారిపో.

(యిద్దరు నిష్క్రమింతురు)

చతుర్థరంగము

(కంసాలి దుకాణం : అక్కాభర్తుడు, కొండుభట్లు ప్రవేశించును.)

కొండుభట్లు : అక్కాభర్తుడుగారు! దయలేదుకదా?

అక్కాభర్తుడు : బ్రాహ్మణోత్తములు తమదయ మాకుండవలె గాని మాదయ యేమి చెరితార్థం?

కొండు : విశ్వకర్మలనగా సాధారణులండీ! పురుష సూక్తంలో యేమిచెప్పాడో విన్నారా? "విశ్వకర్మణ స్సమవర్తతాధి, తస్యత్వష్టా విదధ ద్రూప మేతి, తత్పురుషస్య విశ్వ మాజాన మగ్రే..." "పురుషుణ్ణి" అనగా ఆపరమాత్ముడ్నే త్వష్ట అనే కంసాలి చేశాడుట.

అక్కా: అలాఅయితే బ్రాహ్మలకన్న కంసాల్లు యెక్కువే గదా?

కొండు: సందేహమేమిటండి. అందుచేతనే కంసాల్లు బ్రాహ్మలకి దండం పెట్టరు. వక్క హక్కుమాత్రం బ్రాహ్మణులకు వుండుకున్నది. కంసాల్లికిగాని యితర వర్ణాలకిగాని లేదు.

అక్కా: అది యెషువంటిదండి?

కొండు: గొప్ప చెప్పుకోవలసినది కాదు. అది యేమిటంటె "ప్రతిగ్రహం"; తెనిగిస్తే ముష్టి యెత్తుకోవడ మన్నమాట.

అక్కా: గడియకపోతే అది అందరికీవున్న హక్కే.

కొండు: గడిచినా బ్రాహ్మడికి తప్పదు. నూరుకోట్లు రాజ్యాలే శ్రీమంతుడికి తప్పిందికాదు.

అక్కా: అవి యెలాగేమిటి?

కొండు. చిత్తగించారా! అహల్యాబాయి అని హోల్కారు మహారాజులుంగారి భార్య వుండేవారు. ఆవిడికి కొట్లుతో ధనం వుండేది. ఆ మహారాణే బహుదొడ్డ పుణ్యకార్యాలు చేశారు. కాశీలో ఒక ఘట్టం కట్టించారు. సత్తరవు వేశారు. చిత్తగించారా! ఒకనాడు శ్రీమంతులవారికి ద్రవ్యం కావలసివచ్చి అహల్యాబాయిగార్ని దోచుదామని దండెత్తి వెళ్ళే సరికి, ఆమాట తెలిసి అహల్యాబాయిగారు యేంచేశారంటె ధనమంతా కుప్పపోసి స్నానంచేసి పట్టువస్త్రాలు ధరించి తులసిదళం జారీ చేతోపట్టుకుని శ్రీమంతులు రాగానే "మహారాజా, దోచడానికి యేమి అవసరం వున్నది, మీరు బ్రాహ్మణ మహారాజులు. ఈ తులసి దళం, రెండు నీళ్ళ

చుక్కలగోటి నాయావత్తు ధనం పరిగ్రహించవలసినది. ఇంత పాత్రతయిన దానం యెలా లభిస్తుంది" అని ఆ మహారాణి అన్నారుట!

అక్కా : సరేకాని అపాత్రదానంవల్ల దోషంలేదా?

కొండు : ఈ కలియుగంలో పాత్రాపాత్ర లెంచడానికి అవకాశమేది. అంతా పాపభూయిష్టమై యున్నది. "బ్రాహ్మణబీజాయితేనమః" అన్నాడు. గనక బ్రాహ్మణ బీజానికి పుట్టితే చాలును.

అక్కా : అదైనా నిత్సయముకద్దా?

కొండు : లోకంఅంతా నమ్మకముతోవుంది. నమ్మకంలేకుంటే అడుగుతీసి అడుగు పెట్టడానికి వీలులేదు. నమ్మి యెన్నో వెండి బంగారాలు లోకులు తమకిస్తున్నారుకారూ? అసాక్షికం, లేదంటే ఏమిటిచెయ్యడం. "నమ్మి చెడినవారు లేరు, నమ్మక చెడిపోతే పోయేరు" అన్నాడు.

అక్కా : శాస్త్రాలుచెడి తంబళిపదాల్లోకి వచ్చారూ?

కొండు : భారతంలో యేమన్నాడు, "లోకజ్ఞున్" అన్నాడు. అంచేత లోకంలో వేదం మొదలుకుని తంబళిపదాలవరకూ యావత్తు హంశములు తెలిస్తేగాని పండితుడు కానేరడు. ఇదిగో శాస్త్రంలోముక్క మనవిచేసుకుంటాను. కంసాలి అనగా కంసారి. "రలయోరభేదః" అన్నాడు. గనుక కంసాలి శబ్దార్థం సాక్షాత్తు శ్రీకృష్ణమూర్తివారని సిద్ధాంతం.

అక్కా : నేను కృష్ణమూర్తిని అయితే, సత్యభామని యెక్కడయ్నా ఆలోచించారా, లేదా!

కొండు : అదే నేను మనివిచెయ్యాలనుకుంటున్నాను. సత్య భామకోసం యెక్కడకైనా వెళ్ళాలా, యేమిటి ? తమ యింటి యెదుటనే క్రొచి పేచియున్నది. మంజువాణి బంగారు బంత్రి. దాని రూపురేఖవిలాసా లెషువంటివనగా ...

అక్కా : అవంత్రా నిజమేకాని "మిక్కిలి రొక్కములియ్యాక చిక్కదురా, వారకాంత సిగ్గము సుమత్తీ" అన్నాడు. నేను డబ్బెక్కడ తేను !

కొండు : (శ్రీ పిన్నుమూర్తివారియందు సత్యభామకు వలెనే ఈ మంజువాణికిన్ని మీాయందు మనస్సు లగ్నమయి వున్నది.

అక్కా : అది చెప్పిందా ? మీాకు పోల్చారా ?

కొండు : అది చెప్పనూ చెప్పింది. అయితే మాటల్లో మర్మము వుండవచ్చును కాని, కామశాస్త్రంలో చెప్పిన హావభావ చేష్టల్ని పట్టి పండిత ముండాకొడుకుని ఆపాటి పోల్చలేనా ?
"స్తంభశ్చ, ప్రళయ రోమాంచ, శ్చేదో వైవర్ణ్య వేపదుశ్చ"

అక్కా : ఒకొక్కటే సెలవియ్యండి.

కొండు : తమర్ని స్మరించేటప్పటికి, "స్తంభః" స్తంభించిపోవడం.

అక్కా : అగ్ని స్తంభమా, జల స్తంభమా ?

కొండు : స్తంభమనగా, నిశ్చేష్టగా నిలిచిపోవడము.
ప్రళయః ... ఇంద్రియవ్యాపారాలు అణగడం.
రోమాంచ,...వెండ్రుకలు పులకరించడం.
స్వేదం ... చెమట పొయ్యడం.
వైవర్ణ్యం ... తెల్లపోవడము
వేపదుః ... వణకడం.

ఇవి అన్నియు ప్రేమాతిశయ ద్యోతకాలు.

అక్కా : నా వ్యాఖ్యానం వింటారా...దొంగపనిచేసి పట్టుపడి బొంకలేకపోతే తెల్లపోవడం. ఒక సరసుడు వుండగా మరో సరసుడువస్తే స్తంభం, అనగా ఒక్కణ్ణి స్తంభం నెనకాల దాచడం.సీతాకాలంలో సరసుల్లేకుండా వంటరిగాపడుకుంటే, వేపదుం, రోమాంచ; అడిగినప్పుడు సరసుడు డబ్బు యివ్వకపోతే ప్రళయం, ఇవి హావభావ చేష్టలు.

కొండు : బంగారం గీటు గియ్యనిదీ నాణెం చెయ్యరుగదా ? పండు రుచిచూడందీ తారీపు చెయ్యరు కద. స్త్రీని అనుభవించి యెంచాలి. సుఖాలు అనుభవవేద్యాలుగాని వర్ణింపవీలైనవికావు.

అక్కా : సత్యభామని నేను తగులుకుంటే, ఇంట్లో యిల్లాల్ని యెవరికి వప్పచెప్పను.

కొండు : తమ యిల్లాలు సాక్షాత్తూ రుక్మిణీదేవిలాగు కీర్తి ప్రతిష్టలు సంపాదించివున్నారు. జ్ఞాపకం తెచ్చారు. వారి నోములుకి నా పౌరోహిత్యం మానివేశాను కదా.

అక్కా : మీరు కాలం అంతా లాక్యంలో నెళ్ళబుచ్చుతున్నారు. చిన్ననాడు చదువుకున్న ముక్కలు జ్ఞాపకంవున్నాయో లేవో ?

కొండు : దాని ముండామోసిపోయెను. నిలుచున్నపట్లాన యజ్ఞాదిక్రతువులు చేయించమంటే చేయించివేస్తానుకదా ! నోములు నాచేతకాదూ ?

అక్కా : తమరే సెలవిచ్చాకదా, కంసాల్లు బ్రాహ్మలకంటె అధికులని! అంచేతనే వీరసభాచార్యులు మా యిళ్ళల్లో పౌరోహిత్యం చేస్తున్నాడు.

కొండు : తమకి యిదో మెహనత్తుకాదుకాని మంజువాణి దగ్గరనుంచి చిన్నపని తీసుకువచ్చాను. చిత్తగించారా (పంచకొంగునకట్టి బొడ్డుదగ్గిర ముడిచిన బంగారపు కమర్‌పతా మొల తాడుతీసి) యిది చెరిపి బంగారం గోవాతాడుచేయించమన్నది.

అక్కా- : (పరిశీలించి ఆత్మగతంగా) ఆహా! యిది మాతండ్రి సంతులు తల్లికి తయారుచేస్నిది. ఇంత పనివాడితనం వున్న యీ పాలెలు చితకగొట్టుటకు చేతులు యెలావస్తాయి? ఇది పంతులు యింటివద్ద పోయినదని కలవిలపడి వ్యారు కున్నారు. కానియ్యా! ఇది పంతులు భార్యాకు యిచ్చి వేస్తాను. (ప్రకాశం) యెంతట్లో కావాలి?

కొండు : ఎంతవేగం వీలైతే అంతవేగం కావాలి.

అక్కా : సరే! (మొలతాడు పెట్టెలోపెట్టి తాళంవేసి) మీ కుర్ర వాడు వచ్చినట్టుంది, చదువెలాగుంది?

కొండు : ఈసరికి బాగావుంది. ఇప్పుడు మెట్రికిలేషను పరిక్షకు కడతాడు. ఇరవై రూపాయీలు కావాలి. తమవంటివారి సహాయం వుంటేగాని గట్టుదాటదు.

అక్కా : (ఇరవయి రూపాయీలు పెట్టెలోనుంచి తీసియిచ్చి) గుప్త దానం మంచిది. యెవరితో చెప్పకండి.

కొండు : (అక్కా- భర్తుడి చెవిలో) చూశారూ మంజువాణి, డబ్బు లక్ష్యంగాని, డబ్బుజాగ్రత్తగాని వున్న మనిషికాదు. బంగారం కరగడంలో కొంచంకొంచం చెయ్యి తడిచేసుకోనచ్చును. మావాడి వివాహం యొకటి తటస్థించింది. డబ్బుకి వ్యాపక పడుతున్నాను.

అక్కా : అలాగేకానియ్యండి. తూనిక మీరు శలవిచ్చినట్లు అందాదుగా చూసుకుందాం. ఈ సరకు యిలాగేవుంచి నాదగ్గిర బంగారంపెట్టి జమిలిగోవాతాడు తయారుచేస్తాను. కాని! మీకుర్రవాడు, భూమి గుండ్రంగా వుండునని, రామాయణం అబద్ధమని అంటాడుట. వెధవముండలకి పెళ్ళి చెయ్యమంటాడుట. మీరు విన్నారా ?

కొండు : అది అంతా యింగ్లీషువాళ్ళ మాటలు. అలాఅంటే గాని పరీక్షలు పేసు చెయ్యరు.

అక్కా : మీకొడుక్కి యింగ్లీషు చెప్పించి, మీ అన్న కొడుక్కి యెందుకు చెప్పించారుకారు ?

కొండు : ఒకడికి చెప్పించడమే కృత్యాద్యవస్తగావుంది. యిద్దరికి చెప్పించడం నాతరమా ?

అక్కా : వెంకన్నకే యింగ్లీషు చెప్పించి రామ్మూర్తికే కావ్యాలు యెందుకు చెప్పించారుకాను ?

కొండు : అక్కా భక్తుడుగాను ! అన్నీ యక్ష ప్రశ్నలడుగుతారు. మనమా చేసేవాళ్ళం ? జాతకంలో యోగం వుండాలిగాని !

అక్కా : యోగం యెలావుంటే వుండనియ్యండి కాని వెధవముండనెవర్తినీ పెళ్ళాడకుండా వివాహం ముంచుచెయ్యండి.

(తెర)

పంచమరంగము

[కొండుభట్లు యింటి పెరట్లో పెంకిటిసాల. పొయిమీద నీళ్ళ కాగు. పొయ్యిలో నిప్పులేదు. నీరుకాయపంచ అంగవస్త్రం ధరించి, కొండుభట్లు నీళ్ళకాగులోకి తన జుత్తు వదుల్తాడు. గావంచాతో తడి జుత్తు తుడుచుకుంటూ వుంటాడు]

కొండుభట్లు : తలనెంట్రుకలకి శీకోస్నాలు తెలియకుండాచేసిన భగవంతుడి ప్రజ్ఞఏమని పొగడనూ! లేకపోతే సీతకాలంలో తెల్లవారగట్లే చన్నీళ్ళలో ములగడానికి మనిషా మానా ?

(విభూది బురిక గూట్లోంచితీసి బాలరామాయణం చదువుతూ నుదిటికీ, జబ్బలకీ, గుండెకీ రాసుకుంటాడు)

కూజంతం.....రామ రామేతి...మధురం మధు రాక్షరం ఆసుహ్యా కవితాశా ఆతి...ఖాం ।వందేవా...ల్మీకి కోకిలం. యఃపిబన్ సతతం రామ....

చప్పుడౌతూంది. లేచాడు గాబోలు (గట్టిగా) చరి తామృత సాగరం । అత్యస్తస్తం మునిం వందే ప్రాచేతస మకల్మషం । గోష్పదీకృత వారాసిం మశకీకృతరాక్షసం.

(రామ్మూర్తి ప్రవేశించును)

అబ్బీ మేష్టరు ల్లేచాడ్రా ?

రామ్మూర్తి : మేష్టరుగారు యేటికి స్నానాని కెళ్లారు.

కొండు : యీచల్లో యేట్లో యలా స్నానం చాస్తాడ్రా. ఉద్దండ పిండంలా వున్నాడు.

రామ్మూర్తి : మీకంటె యెవరైనా నయం.

కొండు : తండ్రిం తప్పట్టకూడదు; తెలిసిందా. మాతృదేవోభవ, పితృదేవోభవ అని వేదం ఘోషిస్తూంది.

రామూర్తి : రాత్రి యెక్కడి కెళ్ళావు?

కొండు : పెద్దల్ని పిన్నలు ప్రశ్నలడకూడదు. యాభై యేళ్లు దాటి. తుదకి నీకా నేను సమాధానంచెప్పడం! నా బతుకు అంతకొచ్చిందీ !

అంజనానందనం దేవం జానకీ శోకనాశనం ।
కపీశ మక్షహంతారం వందే లంకాభయంకరం ।

రామూర్తి : ఆ శ్లోకాలు కట్టిబెట్టి నేంజెప్పేమాటలు వినండి.

"ప్రాప్తే షోడశవర్షాణి పుత్రంమిత్రవ దాచరేత్"

అన్నాడు.

కొండు : (చిన్నరాగిజారీ చేతపట్టుకొని నిలిచి) నాశాస్త్రం ముక్కలు నామీదికే విసురుతున్నావ్ ! ఆ చెప్పే మాటేదో చెప్పు. ఇటుపైని నువ్ తండ్రివీ నేను కొడుకునీనీ !

రామూర్తి : మీరు రాత్రి రామసాని పంచనో, పంతులుగారి పంచనో తిని పరుంటారని మా గురువుగారితో అమ్మ చెప్పేసరికి నావొళ్లు నీరు విడిచిపోయింది. మీరు సాందాని కొంపకి వెళ్లడనైనా మానెయ్యాలి; నేను మీ యింట్లో అడుగు పెట్టడనైనా మానాలి.

కొండు : (నిర్ఘాంతపోయి) యేమంటున్నావ్ ?

రామూర్తి : మీప్రవర్తన బాగుందికాదు.

కొండు : మతిపోయి మాట్లాడుతున్నానా యేమిటి? బ్రాందీ తాగలేదుకద ?

రామూర్తి : అదొక్కటే తరువాయుండిపోయింది. మీరు సానియింటికి వెళ్లడం నాకు యిష్టంలేదు.

కొండు : గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందని ... నీ యిష్టం యెవరికొచ్చావాలి. ముడేమిపుసంత ! యేదొమ్మరి గుడిసెలూ దూరకపోతే, యే అకార్యాకర్ణాలు చెయ్యకపోతే నీకు బోలిడేసి డబ్బుపోసి చదువెలా చెప్పిస్తున్నానను కొన్నావు ?

రామూర్తి : సానికొంపలు తిరిగి తెచ్చే డబ్బుపెట్టి నాకు చదువు చెప్పించకర్లేదు !

కొండు : అయితే మున్సబీదాకా చదువుకోఫ్రూ ? నీ యధాన్న యిదివరకల్లా బోస్నిడబ్బంతా బూడిదలోపోసిన పన్నీరే ? ఇదివరకు తిన్నదిమాత్రం దుస్తడబ్బు కాదాయేమిటి ? అది ముందు వెళ్ళగక్కి తరవా తీర్శీరంగనీతులు చెప్పూ.

రామూర్తి : మీరు మన యింటిపనువు తీసేస్తున్నారు.

కొండు : ఓరీ ! నీ పరువుకు తండ్రినయినానుకాను, రాముడు దేవుడుకాడని, వెధవముండల్ని పెళ్ళిచేసుకొమ్మనే కిరస్తానపువెధవలకు సానింటికెవెళ్ళితే తప్పొచ్చిందీ ? నీ పెళ్ళికూడా సమీపించింది. కిరస్తానంలో కలిసిపోవా లనుంటే యీలోగానే కలిసిపో ! నీ మేనమామ కూతురు కొంపెందుకు తీస్తావు !

రామూర్తి : నేను కిరస్తానంలో యెంతమాత్రం కలియను.

కొండు : ఈ తండ్రిమీద తిరుగుబాటంతా యేమిటి ?

రామూర్తి : నేను బ్రహ్మసమాజంలో కలిశాను.

కొండు : బ్రహ్మసమాజం యేమిటి? విష్ణుమతం, శివమతం అని సృష్ట్యాదినుంచి విన్నాంగాని బ్రహ్మకి పూజెక్క డేడిసింది? పోనియ్యి యే సమాజమైనా యెవణ్ణో మన దేవుణ్ణే పట్టుకుని కిరస్తానంలో కలియకుండావుంటే చాలు.

రామూర్తి : కిరస్తానమతం అసత్యమతం. దాన్లో బుద్ధిమంతు డెవడూ కలియడు.

కొండు : అదిగో! ఆమాత్రం మంచిమాటన్నావంటే నాకు పరమానందం. (కాగలించుకుని) మున్నబీ పరీక్షకోసం తెల్ల వాళ్ళ చదువు చదువుగాని, స్వేతముఖులు కల్పించి మన మతం చెడగొట్టాలని వ్రాసిన సంగతులు ఒకటయ్యా నమ్మవద్దు. ఇవిగో యిరవై రూపాయిలు తెచ్చాను. ఇవి కట్టి మెటికలేషను పరీక్షకు వెళ్ళు.


రామూర్తి : (రూపాయిలు పుచ్చుకుని) సానింటికి వెళ్ళడం మానేస్తే బాగుండును.

కొండు : మరో పరమార్థంమాట మనస్సులో వుంచుకోవాలి. విన్నావా? జాజిమొక్కకి పేడ వగైరా అసుద్ధపదార్థములు వేస్తే మొక్క పెరిగి పరిమళభరితములగు పుష్పాలు పూస్తుంది. చెట్టుకి పేడవేశామని పుష్పాల కేమయినా అపవిత్రత వచ్చిందా? అవి దేవుడి నెత్తిమీదపెడతాం. అట్లవలెనే యే మాయోపాయంచేతనైనా ద్రవ్యం సంపా దించి పెద్ద అవస్థలోనికి వచ్చింతరువాత వుచితంగా ధర్మంచేస్తే పాపాలన్నీ దహించుకు పోతాయి. నీపెళ్ళి అయిన తరువాత శివపంచాక్షరీ మంత్రం వుపదేశం చేస్తాను.

దాంతో విద్యా, ఐశ్వర్యము, ముక్తి కూడా లభిస్తాయి;
పాపాలు యెగిరిపోతాయి.

రామూర్తి : [ఆత్మగతంగా] కాష్టవాదంవల్ల కార్యంలేదు;
ఎంతయ్నా పెద్దవాడు. తండ్రిగదా! [ప్రకాశం] అలాగే!

(తెర)


ACC NO. 77345

కొండుభట్టీయము

ద్వితీయాంకము

ప్రథమరంగము

[కొండుభట్లు యింటి అసుగునూద చాపపసుచుకొని వెంకన్న కూర్చుని చుట్ట చేతితో పట్టుకొనును]

వెంకన్న : రాముడు చుట్ట మా ఠీవిగా కాలుస్తాడు. ముక్కులోంచి పొగ తెప్పిస్తాడు. ఆ విద్య పట్టుపడిందికాదు. (అగ్గిపుల్ల వెలిగించి చుట్ట ముట్టించుచుండగా తలుపు తియ్యబడును. చటుక్కున చుట్ట, అగ్గిపుల్ల పారవేసి తటాలున మునుగొత్తి పడుకొనును.)

పార్వతి : (ప్రవేశించి గుమ్మమువద్ద నిలువబడి : మెల్లగా) "వెంకడూ! వెంకడూ!" (వెంకన్న ఘూరుపలకక నిద్రించినట్టు నటించును. పార్వతమ్మ అరికాలు గోకి తిగిగి నిమ్మళముగా, "వెంకడూ! వెంకడూ!" అని పిలుచును.)

వెంక : (కాలు ముడుచుకొని) నిద్రపోతున్నానే.

పార్వతి : దొంగనిద్రపోతున్నావు! నువ్వు చుట్టకాల్చడం సొంపు చూడలేదనుకున్నావా యేమిటి?

వెంక : చూశావూ?

పార్వతి : చూశాను.

వెంక : బాబుతో చెబుతానంచావా యేమిషి? కాల్చడం మానేస్తాన్లే.

పార్వతి : నే చెప్పినమాట వింటే చెప్పనుగదా, చుట్టలు కొండానికి రూపాయిలుకూడా యిస్తాను.

వెంక : చుట్టలశిఖాగోశెనుగాని, పదిరూపాయిలంటూ యిచ్చా వంటే పొడుం దుకాణం పెట్టుకుంచాను.

పార్వతి : చెప్పినట్టు వింటే, పదికాదు, యిరనైరూపాయీలు యిస్తాను ..... యిప్పుడే యిమ్మంటావా యేమిటి?

వెంక : ఇచ్చావంటె నీకన్న పుణ్యాత్మురాలుందా?

పార్వతి . అయితే లోపలికి రా ..... (అని గదిలోనికి వెళ్లును)

వెంకన్న : (పావిడిలోనికి వచ్చి నిలుచుని పొడుంపీల్చి) పార్వతి బహు దొడ్డమనిషి.....బాబుకంటె నయం. నేను పొడుంకొట్టు పెట్టానంటె వర్షులు కొట్టుమీద వక్క దమ్మిడీ పొడుం చెలదు.

పార్వతి : (ఒకచేతితో విస్తరంటలో అట్లున్నా, రెండవచేతితో రూపాయి లున్నా పట్టుకువచ్చి అట్లు కిందపుంచి) అట్లుతిను.

వెంకన్న : కాళ్లూ చేతులు కడుక్కుని తడిగావంచా కట్టుకుని తించాను.

పార్వతి : (తనలో) వెట్టివెధవ. (పైకి) మీ బాబు కాళ్లుకడుక్కోకుండీ వీధిలోంచి వొచ్చిన బట్టతో తింటాడుగాని, నీకు అంతకన్న ఆచారం బలువయిపోయిందీ? తిన్నగా తిను.

వెంకన్న : కాళ్లూచేతులు కడుక్కోవద్దంచావా యేమిషి.

పార్వతి : కాళ్లు కడుక్కుంటె చప్పుడవుతుంది.

వెంకన్న : చప్పుడవుతే యేమిషి?

పార్వతి : (తనలో) మొద్దువెధవ! (పైకి) అంతా లేస్తాకు.

వెంకన్న : (గట్టిగా) ఓ! హో! దొంగతనంగా తెచ్చావు?

పార్వతి : నిమ్మళంగా మాట్లాడు. చెప్పినట్టు వినకపోతే రూపాయి లివ్వను.

వేంకన్న : అనాచారంగా తింటె యిస్తానంచావా ? (తినును)

పార్వతి : పదిరూపాయిలు యిస్తే యేంచేస్తావు ?

వెంకన్న : పొగాకుకొని పొడుంకొట్టు పెడతాను. నేను పొడుం కొట్టు పెట్టానంటే మరి, వాడి కొట్టు పడిపోతుంది.

పార్వతి : గట్టిగా మాట్లాడకు.

వెంకన్న : నా పొడుం యెంతబాగావుంటుందనుకున్నావేమిషి ! చిన్నపట్టు పీల్చిచూడు (అని యెడమ చేతితో మొలనున్న పొడుం కాయను చూపించును)

పార్వతి : (ముక్కుమీద వేలుంచి)ఆడవాళ్లు పొడుం పీలుస్తారుట్రా? (పొడుంకాయ మొలలోంచితీసి రూపాయలు మొలలో ముడుచును. అలా చేయుటలో తన శరీరము వెంకన్న పార్శ్వమునకు తగిలించును.)

వెంకన్న : (తనలో) యిదేమిపోయి ! మీదపడుతున్నాది !

పార్వతి : (అట్టుముక్క తాను కొరికి వెంకన్న నోటికందించును.)

వెంకన్న : యిదేమిటి ? యెంగిలి తినమంచావా యేమిషి ?

పార్వతి : నేచెప్పినట్టూ వింటానన్నావే (అని నోటిలో కుక్కును.)

వెంకన్న : (అయిష్టముతో మింగుతూ) యెంగిలి తినడానికే పది రూపాయిలు యిచ్చానంపావు !

పార్వతి : యింకా వుంది.

వెంకన్న : యేమిటుంది ?

పార్వతి : యిదిగో (అని కాగలించుకొనును.)

వెంకన్న : నెఢవముండా ! (అని విదిల్చివేయును. పార్వతి నేలబడును. వెంకన్న పైకి పారిపోయి అరుగుమోద ముసుగుపెట్టుకుని పడుకొనును.) [తనలో] చచ్చానురోయి ! యిదేమి టీరంకుముండకి యీ కాలం...రామ ! రామ !

పార్వతి : (చీపురుకట్ట తెచ్చి) గాడిదకొడకా ! (అని కొట్టును.)

[తెర]

ద్వితీయరంగము

[అక్కాబత్తుడి యిల్లు]

వెంకన్న : అక్కాబత్తుడూ - అక్కాబత్తుడూ (అని తలుపు కొట్టును.)

అక్కా : యెవరది ?

వెంకన్న : వెంకన్న.

అక్కా : (తలుపుతీసి పైకివచ్చి) యేమిటి వెంకన్న ?

వెంకన్న : కొంపములిగింది !

అక్కా : ములగడానికి నీకు కొంపవుంటేనా ? మీ చినబాబు గారి కొంప ములిగినట్టాయిన, శుభవార్త చెప్పు.

వెంకన్న : కొంపములిగింది.

అక్కా : యెందు కాతొందర ? నింపాదిగా చెప్పు... దొంగ లొచ్చారా ? యిల్లంటుకుందా ? యేదయ్యా సంతోషమే!

వెంకన్న : చెప్పనా ?

అక్కా : (అరుగుమీద కూచుని) చెప్పు.

వెంకన్న : నేను చెప్పను.

అక్కా : చెప్పకపోతే యింట్లోకిపోయి వెచ్చగా పరుంటాను.
(లేచి తలుపువైపు పోవును)

వెంకన్న : (అక్కాబత్తుడి దుప్పటి పట్టుకులాగి) నేను చెప్పతాను.
చెప్పతాను.

అక్కా : (తిరిగి కూర్చుని) అయితే చెప్పండి !

వెంకన్న : యెవరితో చెప్పకుగద ?

అక్కా : యేమి టామహారహస్యం !

వెంకన్న : చెప్పకుగద ? యిదిగో ! పార్వతి రాత్రి పడుకుంటే
మెల్లిగా లేపి మయిలబట్టతో అట్లు తినమంది.

అక్కా : యిదా రహస్యం; మైలబట్టతో యెందుకు తిన్నావు?

వెంకన్న : (తల గోక్కుంటూ) పొడుంకొట్టు పెట్టుకోవడానికి
పదిరూపాయిలు యిస్తానంది.

అక్కా : మరేమి ! నీ రొట్టి నేతిలోపడ్డది.

వెంక : నెయ్యిలేదు; వొట్టి రొట్టిలే పెట్టింది.

అక్కా : 'యిదేనా కొంప ములగడం ?

వెంక : తను కొరికిన యెంగిలి రొట్టిముక్క తినమన్నది.

అక్కా : (నవ్వి) తిన్నావ ?

వెంక : తిన్నాను.

అక్కా : (నవ్వు పట్టలేక మిక్కిలిగా నవ్వుతూ) రూపాయి లిచ్చిందా?

వెంక : యిచ్చింది...యిచ్చీ ... యిచ్చీ ...

అక్కా : యిచ్చి యేంచేసింది ?

వెంక : మీాదపడి కాగలించుకుంది. " వెధవముండా ! " అని తోసేసి అరుగుమీాద నచ్చిపడుకున్నాను. ఆయింతాచీపురు గట్ట పట్టుకువచ్చి వీపు పెట్టగొట్టింది. దాంతో మీాదగ్గరకు పారిపోవచ్చినాను.

అక్కా : (నవ్వు పట్టలేక దొర్లును)

వెంక : యెందుకు నవ్వుతారేమిషి ?

అక్కా : నవ్వక యేడవమన్నావయేమిటి ?

వెంక : నేనుకూడా నవ్వనా ?

అక్కా : అడిగి నవ్వుతారా యేమిటి ? నవ్వు !

వెంక : (నవ్వును)

అక్కా : అయితే యిప్పుడు యేంచేస్తావు ?

వెంక : యేంచెయ్యమంటారు ?

అక్కా : తిన్నగావెళ్లి అరుగుమీాద పడుకో !

వెంక : చీపురుకట్ట ముతకది.

అక్కా : నిష్కారణం దెబ్బలుతిండం యెందుకు? పార్వతి చెప్పి నట్టుచెయ్యి !

వెంక : వెధవతో సంగమం చెయ్యమంటావయ్యా ?

అక్కా : నీ పింతండ్రికంకై నువ్వు గొప్పవాడివా యేమిటి ? ఆయన యెన్నో పాడు దేవాలయాలు ప్రతిష్ట చేశాడు.

వెంక : మాతండ్రి మహాయోగ్యుడు. అయ్యపేరు చెడగొట్టుతానా ?

అక్కా: హాస్యానికన్నాను. బహుధర్మంగా ప్రవర్తించావు. నిన్నుచూచి మీ చినబాబు బుద్ధి తెచ్చుకోవాలి. నీవు వేలలో యెన్నికైన మనిషివి. గాని రేపటినుంచీ యెలా కాలక్షేపం చేస్తావు?

వెంక: మహోకరం.

అక్కా: నేస్తం! నేను వుండగా నీకాఅవస్థ రానిస్తానా. ఆ పదిరూపాయిలు యేంచేస్తావు?

వెంక: పార్వతికి పంపించేస్తాను.

అక్కా: నేను యంతమదుపుపడితే అంత మదుపు పెట్టుతాను. పొడుం కొట్టుపెట్టి, నీ కాలక్షేపము పోగా మనకి లాభం కూడా వస్తుంది.

[తెర]

తృతీయరంగము

[రామూర్తి; చేతులు తాడుతో కట్టబడి పార్వతమ్మ ప్రవేసించును.]

రామూర్తి: యిదేమిటి పార్వతి?

పార్వతి: (కంట నీరొలుకుతూ వూరుకుండును)

రాము: (దగ్గిరచేరి కూర్చుని) యే దుర్మార్గులు కట్టారు నీ చేతులు?

పార్వతి: (మాట్లాడదు)

రామ: (వెంట్రుకలు సవరించి ముద్దపెట్టుకొని చేతులు కట్టుకొనిపిల్చి)
యెవరు నీకీ అవస్థకి కారణభూతులు?

పార్వతి: వెంకడు!

రామ: వెధవని యెముకలు విరగదంతాను.

[తెర]

చతుర్థరంగము

[పొడుం దుకాణం]

వెంకన్న: (పొడుంచేస్తూ ప్రవేశించును).

రామూర్తి: యెందుకురా వెంకా చేతులు కట్టావు?

వెంక: యెప్పుడొచ్చావు రాముడూ? పరీక్షప్యాసయిందిరా?

రామ: దున్నపోతా! అడిగినమాటకు జవాబు చెప్పవేమి?

వెంక: (పొడుంకర్ర పడవేసి నిర్ఘాంతపోయి చూచును) యెందుకురా రాముడూ యీ కోపం?

రామ: పార్వతిచేతులు కట్టినందుకు యిదిగో పూనితీసి వో లెంపకాయ (కొట్టును.)

వెంక: (బుగ్గ తడుముకుంటూ) యెవర్రా కట్టారు పార్వతిచేతులు!

రామ: నువ్వు కట్టావని చెప్పింది!

వెంక: నేను కట్టానని చెప్పిందా వెధవముండ!

రామ: వెధవముండని దాన్ని తూల్నాడితే మరో లెంపకాయ తీస్తాను.

వెంక : వెధవముండకాకుంటే పునిస్త్రీముండనమంచావురా ! యీ మాటు లెంపకాయ తీస్తే ఆ మండ విరిచేస్తాను. విన్నావ.....ఒకదెబ్బకి మా రాముడివికదా అని వూరుకున్నాను.

రామ : (పస్తాయించి) అయితే నువ్వు కట్టకపోతే దాని చేతు లావకు కట్టాకు ?

వెంక : అదేమో నా కేం తెల్సును. నెలరోజులాయి నేను యింటికే వెళ్ళలేదు.

రామ : (కూర్చుని ఆశ్చర్యముతో) యెంచేతరా? అబద్ధమాడిందా?

అబద్ధమాడివుండదు..... నే వినడం తప్పు కావచ్చును. ...యెంచేతరా నెలరోజులాయి ఇంటికి వెళ్ళలేదు ?

వెంక : యెంచేతనంటే...చెప్పకుమా ! పొడుంకొట్టు పెట్టుకున్నాను.

రామ : మానాన్న గెంటేశాడా యేమిటి ?

వెంక : మీనాన్న నెలరోజులాయి వూళ్లోలేడు.

రామ : నీమానాన్న నువ్వు బతకాలని బుద్ధిపుట్టిందా యేమిటి?

వెంక : అవున్రా ! పొడుం మాబాగా తయారుచేస్తాను. మీతట్టు పొడుం యిలా వుంటుందిరా ? ఒక పట్టుపీల్చు !

రామ : (పీల్చి) మామజాగా వుందిరా. యేంవేస్తా వేమిటి.

వెంక : యేంవేస్తానా ? మకోబా పిక్కవేస్తాను....ఘుమఘుమ లాడుతుంది. ఓపెద్ద పొట్లాం పుచ్చుకో....నీకు యెప్పుడు కావలిస్తే అప్పు డోపొట్లాం యిస్తానా.

రామ : వెంకన్నా ! నువ్వు మంచివాడివిరా.

వెంక : నేను మంచివాణ్ణిరా ?

రామ : అవును.

వెంక : మరి నన్నెందుకు కొట్టావు ?

రామ : బుద్ధి తక్కువచేత !

వెంక : మరెప్పుడూ కొట్టవుగద ?

రామ : కొట్టను !

వెంక : రాముడు ! నువ్వు మునసబు పనిచేస్తూవుంటే నేను వచ్చి, "వొరే రాముడూ !" అని పిలుస్తాను. కోప్పడవు గద ?

రామ : కోప్పడను....యింటికి వెళ్లిపోయిరా !

వెంక : అమ్మా...నేను రానా.

రామ : యిన్నాళ్ళు అన్నదమ్ములా వుండి....యిప్పుడు వేరుం టావురా ?

వెంక : చీపురుగట్ట.....(అని వీపు తడుముకొనును).

రామ : నీ కేంప్రాలుబ్బం. చీపురుగట్టతో స్వయం యిల్లు తుడుచు కోవడం....వంట చేసుకోవడం; నా కేం మనస్కరించలేదు.

వెంక : వొరే రాముడూ! వంట ఓ ఎంత సొగసుగా చేస్తానూ!... చినబాబు దేశాంతరం వెళ్లితే నేనేగద వండుతాను. యీ రాత్రి వుల్లిపాయల పులుసుచేస్తాను, వస్తావూ ?

రామ : యెందుకు శ్రమపడతావు. నా మాట విని యింటికి వెళ్లిపోయిరా.

వెంక : యెంత డబ్బాస్తూందంటావంకె.... రెయిలు వచ్చినప్పుడల్లా అక్కాబత్తుడు పొట్లాలు పంపిస్తాడు. ఒక రూపాయి పొట్లాలు చెల్లుతాయి. నా పొడుం వూరు వూళ్లకి వాళ్లు కొనుక్కుపోతారు. వర్షులు కొట్టు యెత్తేశాడు. ఒక రహస్యం విన్నావా?

రామ : రహస్యం యేమిట్రో!

వెంక : పొడుం షడక్షరని ఒక మహామంత్రం వుంది. కంసాలి గురువు వీరనాభాచార్యులు దగ్గిర ఉపదేశమయి పునశ్చరణ చేశాను.....శిద్ధియింది.

రామ : నాకుచెపుతావురా ఆ మంత్రం?

వెంక : చెప్పుతే తల పేలిపోతుందిషు.....గురువుచెప్పొద్దా.

రామ : మంత్రా లబద్ధం. శ్రమపడి పునశ్చరణ చెయ్యకు.

వెంక : అదొక్కటేనా నీదగ్గర దౌర్భాగ్యపుగుణం..... తెల్లవాడి మాట నమ్మేసి మన గ్రంథాలన్నీ అబద్ధం అంచావు..... నాకు దాఖలాయిస్తేనే. స్వప్నంలో మంత్ర దేవత నానాభర్ణ భూషితురాలవుకుంచునూన్నా బంగారపు పొడుం కర్రతో పీపుమీద వేసింది. దాంతో తెలివొచ్చింది. మరి ఆవేళ నిద్రపోలేదు. నిద్రపోతే ఫలం పోతుందిషు.

రామ : ఫూర్ ఫూల్!

పంచమ రంగము

[అక్కాబత్తుడు, వెంకన్న ప్రవేశించును]

అక్కాబత్తుడు: యేమిటి కబుర్లు?

వెంకన్న: మా రాముడు పరీక్ష పాసుఅయినాడు. యీవేళే పట్నంనుంచి వచ్చి వో లెంపకాయ తీశాడు.

అక్కా: యెందుకేమిటి?

వెంక: పార్వతిచేతులు యవడో కట్టాడుష.

అక్కా: యెవడో కట్టలేదు. వీధిగడపదగ్గిర నిలుచుని తోవంట పోయేవాళ్ళని చూస్తూవుంటే, మీ మేనత్తతో ఖాయిదా పెట్టమని నే చెప్పాను. అంచేత చేతులు కట్టింది.

వెంక: మా మేనత్త కడితే రాముడు నన్నెందుకు కొట్టేడు?

అక్కా: నీ సత్యకాలముచూసి. రామమూర్తికి గూబ కదలేశావుకావూ?

వెంక: రాముణ్ణి కొడతానా! వాడికి మునసబీ అయితే "వోరే రాముడూ" అని పిలుస్తాను. వాడికి పెళ్ళిచేస్తాను.

అక్కా: నువ్వే చేస్తావూ?

వెంక: (పొడుం పీల్చి) ఆ! నేనే మా చిన్నాన్న వచ్చి నన్ను కాగలించుకు యెత్తి యింటికే తీసుకుపోయినాడు. యివాళ నుంచి మా యింట్లోనే భోజనం. ష్టాంపుసంతకముచేసి వెయ్యిరూపాయిలూ తెచ్చి మా మామకిచ్చాను.

అక్కా: యంత బుద్ధితక్కువపని చేశావు. నాతో చెప్పుండీ యెందుకు సంతకం చేశావు.

వెంక : రాముడికి పెళ్ళిచెయ్యానొద్దంచారా యేమిషి ?

అక్కా : యంతపనిచేశావు ! (ఆత్మగతం) దీనికేమిటి ప్రతీకారం? (ప్రకాశముగా) రెయిలుకి వేళయింది, పొట్లాలు పంపించు.

[తెర]

షష్ఠమరంగము

(రెయిలుస్టేషను. రెయిలు వచ్చును. ఫస్టుక్లాసు బండీలో, జరీటోపీ కన్‌కాఫ్ ఫాయిదామా మొదలయిన పోషక్ వేసుకుని త్రివిక్రమారావు పంతులు కిటికీలోనుంచి తొంగిచూచి "అగ్లీఖాన్ ! అగ్లీఖాన్ !" అని నౌఖర్ను పిలుచును. కొండుభట్టు ప్రవేశించును.)

కొండు : యే తాలూకా వారు వీరు ! యే తాలూకా రాజా వారు వీరు ! (అని దగ్గిరనున్నవార్ని అడుగును)

దగ్గిర వున్నవాడు : మాకు తెలియదు.

కొండు : (త్రివిక్రమరావు పంతులుగారి దగ్గిరకు వెళ్లి) ప్రభువువారు జాజినగరం జమీందారువా రనుకుంటాను.

త్రివిక్రమరావు : అలాగే నన్నుచూసి అంతా అనుకుంటారు. మేము తుమ్మలపాలెం మొఖాసాదార్లం. మాకు భూముల వల్ల పదిపదహారువేల్దాకావస్తాయి.

కొండు : "నావిష్ణుః పృథ్వీపతిః" అన్నాడు. భూస్వాములు కాకపోతే రాజ పర్చస్సు యెలావస్తుంది. తమ నాయన గార్ని మాబాగా యెరుగుదు. నాయందు వారికి చాలా దయ. పిల్లజమీందార్లున్న, అఖండఅన్నప్రదాతలున్న

ప్రభువువారు యిక్కడ దిగుతారా? పైకి విజయంచేస్తారా? యిక్కడ దిగేటట్టయితే మాయిల్లు చాలా విశాలంగా వుంటుంది. యేవిధమయిన యిబ్బందిన్నీ వుండదు. యీ గ్రామం గొప్పక్షేత్రం! పాండవ ప్రతిష్ట; కోదండరామ స్వామివారు స్వయం వ్యక్తం.

త్రివిక్రమ: మేము విలాసార్థం దేశం చూడామని విజయం చేస్తున్నాం. మీ గ్రామంలో చోద్యాలేమయ్నా వుంటే రెండు పూటలుగడుపు అభిప్రాయం కద్దు.

కొండు: చోద్యం అంటే పాతకోటకద్దు; సీతగుడ్డంకద్దు; స్వామి వారి ఉద్యానవనముకద్దు; అందులో మంటపము దేవ నిర్మాణం. దేవాలయం నౌఖరీచేసేవారు యాభయిళ్లు భోగం వాళ్లు వున్నారు. మంచివిద్యావంతులు, రూపవంతులున్నా!

త్రివిక్రమ: అయితే యిక్కడ దిగుతాం.

కొండు: యేమక్రా ఓయి కళాసులూ!

త్రివిక్రమ: సాయిబు వున్నాడు. మీరు శ్రమపడకండి!

కొండు: పరాయిలపనా యేమిటి? తమపనికి నా కభ్యంతరం లేదు!

అల్లీఖాను: (ప్రవేశించి) సీనో పైకో చలోజీ

కొండు: నేను సామాను అందిస్తాను. నువ్వు బహార్‌కో.

అల్లీ: నాకి బాత్ నకోజీ. నీకి సామాన్ మత్ పకడ్‌ో

కొండు: అమ్మకి తక్లీఫ్‌నహీ (అని అటూయిటూ సామాను తీస్తూ సీసా గళాసులును తన్నినేసును)

అల్లీ: అరె బచూంత్ కామ్‌కియా.

కొండు : అపరాధం. అపరాధం.

త్రివిక్రమ : అవిమనవికావండి ! యెవడ్తోదొర వొదిలి వెళ్ళి పోయినాము, (అని వూరుకొమ్మని సాయిబుతో సైగ చేయును)

కొండు : నేను పరాయివాణ్ణికాను ! శాస్త్రేయుణ్ణేని, వామా చారతత్పరుణ్ణిన్ని. నాదగ్గర ప్రభువాకు అరమర వుంచవద్దు. రండి ! ప్రభువాకు దయచేయండి ! సామాను వెనుకనుండి తీసుకువస్తాము.

(టిక్కెట్టు కలక్టరు ప్రవేశించి కొండుభట్లు చెయ్యి పట్టుకులాగి)

టిక్కెట్టు కలెక్టరు : ఫస్టుక్లాసు బండిలోంచి దిగుతూవుండగా నేను కళ్లార చూశాను.

కొండు : అది యెవర్ని చూసి నేననుకున్నావో ! వొంటిమీద చెయి వెయ్యకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. నీమీద డామేజీదావా తెస్తాను. (కొండుభట్లు త్రివిక్రమరావుగారివేపు తిరిగి) చిత్తగించరా ప్రభువ్వారు. ఈ మూగ్గుడికి యింగ్లీషున నాలుగు చివాట్లు రానియ్యండి. శ్రోత్రియుణ్ణైన బ్రాహ్మణి అమాంతంగా ముట్టుగుంటారు ! తల పగిలిపోతుంది.

టిక్కెట్టుక : యీ కబుర్లెందుకు పదండి స్టేషనుమేష్టరుదగ్గిరకి.

కొండు : పద, నాకేం భయమనుకున్నావ యేమిటి ? (త్రివిక్రమ రావు పంతులుతో) యిప్పుడే వస్తాను. తాము వొక్కనిమిషం ప్రభువువాకు కుర్చీమీద కూచోండి.

(రంగనాయకులుశెట్టి తొందరగా ప్రవేశించి కొండుభట్లు చెవిలో యేమో చెప్పును. కొండుభట్లు ఆందోళనపడును. యిద్దరూ ప్రత్యేకము మాట్లాడడముకు ఒక ప్రక్కకు వెళ్ళిపోవును.)

టికెట్టుక : యెక్కడికి వెళ్ళతావు. స్టేషన్ మేస్టరుదగ్గిరకిరా!

శెట్టి : ఏమిటీ అల్లరి?

కొండు : నేను ఫష్టుక్లాసులో కూచున్నానని ప్రాణం పుచ్చుగుంటున్నాడు.

శెట్టి : యెళ్ళు! బాపనోళ్లమీదే నీ ప్రతాపమంతాను. యింద! సుట్టముక్కలకి (అని ఒక అణా చేతిలో పెట్టును.)

కొండు : కొంపములిగింది! హఠాత్తుగా చచ్చింది ముండ! యింత వేగంచస్తుందని నేనెరగను. లేకుంటే వ్యారుదాటుదునా? అయితే మంజువాణిని యవరయినా ఆదుకున్నార? ఆమెకు యెవరు భరాసా యిస్తాన్నారు..... నువ్వా వెళ్ళావు కావు.

శెట్టి : అంతారత్నాంగే... మరెవరు? నేను వెళితే కట్టి పట్టుకు వెంటతరుముతుంది.

కొండు : అయితే మనకేం చెయిజిక్కదు కాబోలు.

శెట్టి : సిక్కకేం! మీరు బేగెళ్లి సుళువుచెయ్యండి.

కొండు : యేం సుళువు చెయ్యడం? బుద్ధిమాల్లి వెధవని, నాలుగురాళ్ళకి ఆశపడి రామసానికి అంత జబ్బుగా వున్నప్పుడు వూరు విడిచివెళ్ళేను.

శెట్టి : బుద్ధితక్కువకు లెంపలాయించుకొని బేగెళ్ళి కథ యెలా వుందో కనిపెట్టండి.

కొండు : సరేగాని ప్రొద్దుపోతూంది. నువ్వు ముందువెళ్ళి పెరటిగుమ్మం దగ్గిరవుండు. నేనిప్పుడే ఆ బోడిపంతులుని బసకు దిగబెట్టివచ్చి కలుసుకుంటాను ... (త్రివిక్రమరావు

వద్దకు వెళ్ళి) ప్రభువువారు దయచెయ్యాలి. ... ...
యేదిరా గుఱ్ఱబ్బండీ. తీసుకురా జట్కా! ప్రభువ్వారి
హోదాకి తగినదికాదుకాని, కుచేలుడింటికి శ్రీకృష్ణ
మూర్తివారు విజయంజేసినట్టు అనుగ్రహించాలి! .....
సాయిబూ! మాబసకి పోనియ్యి! యీ సామాను పట్టించు
కుని నెమ్మదిగ్గతోకూడా నేను వస్తాను.

వెంకటస్వామి : నా గాజుసామానుకు వేరేబండీ కావాలి.

కొండు : ఈ బండీ నీకు.

అచ్చన్న : నా లాంతకుకి కొవ్వొత్తులకీ వేరేబండీ కావాలి.

కొండు : ఈ బండీ నీకు.

అస్లీఖాను : పంతులుగారి హుక్కాకీ, లేహం డబ్బాకీ వేరే
బండీ కావాలి.

కొండు : ఈ బండీ నీకు.

అస్లీఖాను : పంతులుగారి పోషక్‌కు వేరీబండీ కావాలి.

కొండు : ఈ బండీ నీకు.

బుచ్చన్న : వంటసామానుకి ఒకబండి కావాలి.

పాపన్న : ప్రత్యేకం నా కొకబండి మామూలు.

కొండు : మరిలేవు; పొండి!

పాపన్న : స్నేహితుణ్ణి, ఆశ్రితుణ్ణి.

కొండు : మరిలేవు బళ్ళు; ఒక్కొక్కళ్ళకే వోబండీ యెక్కి
వాళ్ళు వుడాయించారు.

బుచ్చన్న : అయితే యివాళ పంతులుగారు పస్తు పడుకోవాలి.

కొండు : నడిచి వెళ్ళిపోదాం; మరి బళ్ళు దొరకవు.

బుచ్చన్న : సామానెవడు మోస్తాడు?

కొండు : కూలివాడు వొహడూ కనపడ్డూ; మనమే మోసుకు పోవాలి.

పాపన్న : మనం తిమ్మనం ... ఆ పప్పుడకదు! నేను వొక్క వస్తువయ్నా పట్టుకోను.

బుచ్చన్న : దొబ్బిత్రిని, భంగు తాగి పంతులుతో మజా ఉడాయించడానికి నువ్వూను అరవచాకిరీ చెయ్యడానికి నేనూనా!

పాపన్న : బ్రహ్మదేవుడు నీకలారాశాడు;నాకిలారాశాడు;కావలిస్తే బ్రహ్మదేవుడ్తోనో వెళ్లిషిర్ యావ్ చేసుకో. శాస్త్రుల్లుగాను! యీవూళ్ళో డబ్బుకథ యేమయ్నా వున్నదా యేమిటి? లేకుంటే పంతులు పడడు!

కొండు : యీదేవాలయం నాళ్లుల్లలో మంజువాణి సాక్షాత్తు రంభావతారం, వుంది.

పాప : యెవరయ్నా వుంచుకున్నారా?

కొండు : నరహరిరావని వొక పంతులు వుంచుకున్నాడు.

పాప : అయితే మా పంతులుకి అవకాశం యెలాగ?

కొండు : నేను కొంచము వైద్యముకూడా చేస్తాను. పంతులుకి పైత్యాధికం పోవడానికి అప్పటప్పట విరోచనసాధనం చేస్తాను. దాంతో మూడునాలుగు రోజులు మంజువాణికి ఆటవిడుపు కలుగుతూ వుంటుంది.

బుచ్చన్న : నువ్వు పాతరసామాను పట్టుకుంటే నే దినస్సు పట్టుకుంటాను.

కొండు: నా ప్రారబ్ధంకాలితే నా స్వగ్రామంలో మూటలు మొయ్యమంటావు.

బుచ్చన్న: అంత పౌరషముంటే, నెదికి కూలాణ్ణి యవడ్న యాన్నా తీసుకురా.

(తెర)

సప్తమరంగము

[మంజువాణి పెరటియింట్లో గది. గదిలో ఒకవైపు పెద్ద పాత పందిర మంచము, ఒక మూలకు ఒక పాతబోనుపెట్టె, గోడవైపు రెండు పెద్ద జాడీలు, గోడలకు బల్లలపీటలు, వాటిపైనబొమ్మలు, పాతపఠాలు, పందిరమంచం క్రింద యిత్తడి సామానులు. చింపిరితల, కొంచము మాసిన బట్టతో రత్నాంగి, దువ్విన జుత్తు, తగుమాత్రం అలంకారం, కావిరంగుచీరెతో మంజువాణి, ఒక జాడీకి యీ ప్రక్క నొకరు ఆ ప్రక్క నొకరు నిలిచి వుందురు. రత్నాంగి చేతిలో ఒక వెలుగుతూవున్న కొవ్వొత్తి; జాడీవద్దర ఒక మెంక్కలపీటపైని బంగారపు సరుకులు. మరి ఒక పీటమీద వెండిసామాను. ఒకవేపు బట్టల మూట.]

రత్నాంగి: (కొవ్వొత్తి వెలుతుర్ని జాడీ నాలుగుమూలలా చూసి, తల యెత్తి) యింతే! మరిలేదు! యేవనుకున్నావు? యిరనై ముప్పైవేలకు డేకురుతుంది. యింత గణించిందని యవరూ యెన్నడూ అనుకోలేదు. బతికి నిన్ను బాధపెడితే పెట్టింది కాని, చచ్చి నీకు కనకాభిషేకం చేసింది. లోకంకోస వయినా కంటతడి పెట్టావుకావు!

మంజువాణి: చచ్చిందని సంతోషించుతూ కంటనీరు పెట్టడం యెలాగ?

రత్నాం: నవ్వులు, కన్నీళ్ళు భోగందానికి తలిచేటప్పటికి రావద్దా?

మంజు: నేను భోగందాన్నా?

రత్నాం: నాలుగేళ్లు సానరికంచేసి, యింకా సంసార్నే అనుకుంటున్నావా?

మంజు: నమ్మికసామిద్రోహముచేసి నన్ను అమ్మి కొండుభట్లూ డబ్బిచ్చికొని రామసానీ, నాలుగేళ్లు యీచెరలోపెట్టారు... దేవుడు యిన్నాళ్ళకి చెర వొదిల్చాడు ! యీ డబ్బు నాకు యివ్వాలని ఆపిశాచం యచ్చిందా యేమిటి? యీడబ్బు నాకు దేవుడుయిచ్చాడు. నన్ను బెట్టి అది యెంత ఆర్జించింది? యిక స్వేచ్ఛగా బతుకుతాను.

రత్నాం: అనగా?

మంజు: వొకరిబాధ లేకుండాను!

రత్నాం: యెవరి బాధ?

మంజు: రామసాని బాధ వొదిలిపోయింది! యిక పంతులు బాధ!

రత్నాం: (జాడీలో సరుకులు వుంచడం మాని నిల్చి) నామాట కొంచం వింటావా?

మంజు: నీకంటె నామంచి కోరినవారెవరున్నారు!

రత్నాం: అట్టి నమ్మకంవుంటే పదిరోజులకాలం పాతతోవనే జరగనియ్.

మంజు: అయితే నీయిష్టం.

రత్నాం: అలిసివున్నావు. వెళి పడుకొని నిద్దర తెచ్చుకో.

మంజు: అలాగే! గాని నిద్దరరావడం యెలాగ? యీమంచం మీద యింకా పడుకుండేమో అని బితుకువేస్తూంది... దెయ్యాలైండేమో?

రత్నాం: చచ్చిన ఉత్తరక్షణం వెట్టికుక్కయి పుట్టివుంటుంది... మనుషుల్ని పీక్కుతినే పిసినిగొట్లకు అదేగతి - ఆంజనేయ దండకం చదువుకుంటూ పడుకో (మంజువాణిని కాగలించుకుని, జుత్తు సవరించి ముద్దుపెట్టుకుని) వెళ్ళు;పడుకో.

మంజు: నీ కీర్తి జాగరవేఁనా?

రత్నాం: లేకుంటే ప్రమాదం వుంది. డబ్బు పాపిష్టిది! యెవరికే దుర్వ్యాహాలు వున్నవో?

మంజు: వొక్కతెవే వుండడానికి భయంవేయదా?

రత్నా: బతికివున్నప్పుడు భయపడండానికి చచ్చింతరవాత, భయపడుతానా? (మంజువాణి వైకివెళ్ళును. రత్నాంగి తలుపుతీసి లాంతరు వెలిగించి తిరిగిచూచును. మూలనున్న పెద్ద జాడీగోంచి కొండు భట్లు లేచును. రత్నాంగి గుండెరుళ్లుమని కొవ్వొత్తి జారవిడుచును. కొండుభట్లు వూపుకొమ్మని చేత్తో సంజ్ఞచేసును. రత్నాంగి కొవ్వొత్తి తిరిగి తీసుకుని కొండుభట్లు దగ్గరకు వెళ్ళును.)

కొండు: మంచియెత్తు యెత్తావు! నీఅంత బుద్ధిమంతురాలు లోకంలో లేదు!

రత్నాం: మీకంటేనా?

కొండు : అంచేతనే మన వుభయులం యిక్కడ కలిశాం.

రత్నాం : యిన్నాళ్లూ యిటుకనపడితే అటు మొహంచెప్పేవారే!

కొండు : ఆ రాక్షసిముండ రామసానికి నీపేరు చెబితే యిష్టం లేకపోయేది. మరి దాన్ని ఆశ్రయించుకు బతక్కతీరేది కాదు. అంచేత నీకు యెడయెడంగా తిరిగేవాణ్ణి. గాని నీ చతురతా, ని విద్యా, నీ ధర్మబుద్ధీ, చదువుకున్నవాణ్ణి, నేను కానలేదనుకున్నావా? ..... తెల్లవారేసరికి యీ సరుకులన్నీ కరగడానికి తగిన సాధన సామగ్రి సిద్ధంగావుంది. మొంతులు యేర్పర్చేయి. నన్నుమాత్రం కలుపుకున్నావంటే పోలీసు, గీలీసు నిన్ను ముట్టలేరు. మంజువాణి డబ్బువిలువ యెరగదు. మనం యెంత వుడాయించినా పోల్చలేము. (రత్నాంగి భుజంమీద చెయివేసి) కొంచం ఆసరా ఇయ్యి. పైకి రావడం దండ ఘడియపడుతుంది. కాళ్ళకి కొంచెం మేహావాత నొప్పులు. (రత్నాంగి కొండుభొట్లు చెయివిదిల్చి సరుకులు జాడీలో పడవేయ నారంభించును.)

కొండు : సరుకులు జాడీలో పడవేస్తున్నావేమి?

రత్నాం : జాడీతోకూడా పట్టుకుపోవడానికి!

కొండు : జాడీ యెలా మోసుకెళ్ళడం?

రత్నాం : జాడీ మొయ్యడానికి మనుషులున్నారు.

కొండు : యెందుకూ వృథాశ్రమ! నలుగురికీ తెలియడం! నా మాట విని యీ గావంచాగుడ్డలో కట్టు (గావంచా చుట్టచుట్టి రత్నాంగిపై విసురును.) నీకు యీ విద్యలో ప్రావీణ్యత తక్కువగా వున్నట్టు కనపడుతుంది.

రత్నాం: బంగారం యెవరు కరిగిస్తారు?

కొండు: యిదిగో మన.....

రత్నాం: మన...యెవరు?

కొండు: యెవరయితేనేం? పేర్లడక్కూ!

రత్నాం: నమ్మినట్టా? నమ్మనట్టా?

కొండు: కావలిస్తే నువ్వూకూడా దగ్గిరవుండుకాని.

రత్నాం: అయితే పేరు చెప్పరా?

కొండు: యేదీ! గ్రంథంలో దిగింతరువాత అసలు అవతారాలే దిగుతాయి! పేర్లతో యేంపని?

రత్నాం: అయితే పేరు చెప్పరా?

కొండు: నీ పుణ్యం వుంటుంది. కొంచం ఆసరా ఇయ్యి. పైకివొచ్చి అన్నిసంగతులు చెబుతాను. వీటి తస్సా గొయ్యా బొద్దింకలు చెడకరుస్తున్నాయి.

రత్నాం: బొద్దింకలు కరవ్వు. కొంచంతాళండి; యీ జాడి పెట్టించి మళ్ళావస్తాను. (తలుపుదగ్గరికివెళ్ళి గడియలు తీయ నారంభించును.)

కొండు: అంతా నువ్వే అవుపోసనం పడతావు? కొంచం బ్రాహ్మడికి పారెయ్యకపోతే శ్రేయస్సుకాదు. ఆ ధనంలో మూడోవంతు నా మంత్రాంగంవల్ల రామసాని సంపాదించింది.

(రత్నాంగి తెలుపుకొంచం తీసును. కొండుభట్లు జాడీలోకి తలతీసును.)

రత్నాం: ఆ తగాయిదా యేదో మంజువాణికో తీస్కుకొండి! పిలుస్తాను.

కొండు : (బుగ్గపైకెత్తి) అమాంతంగా చంపేస్తావా యేమిటి ?

రత్నం : అయితే పేరుచెప్పండి.

కొండు : చెప్పకపోతే యేం చేస్తావు ?

రత్నాం : మంజువాణ్ణి పిలుస్తాను.

కొండు : నువ్వు కాకనేకాదంటే చెబుతానుకాని, కోరి లభించిన ధనం కాళ్లని తన్నుకు పోవడమే ?

రత్నాం : పేరు ? పేరు ?

కొండు : అయితే విను (పొడుంపీల్చి) అక్కాభర్తుడు !

రత్నాం : కంసాలాడి శ్రీరంగనీతులన్నీ వొట్టివేనా !

కొండు : మరేవిటనుకున్నావు ! లోకమంతా అంతే. నీలాంటి ధనవొల్లని వెర్రికుట్టె ఎక్కడో వుంటాడు; నా మాట విను.

రత్నాం : ముందు నామాట వింటే...ఆ తరువాత నీ మాట ఆలోచిస్తాను.

కొండు : నీచిత్తం, నువ్వేమి చెబితే అది చేస్తాను.

రత్నాం : యీ గదిలోకి యెలావొచ్చావో చెప్పు !

కొండు : యేకవచనం ప్రయోగిస్తున్నా వేమిటి ?...యిట్టు ప్రశ్నలు అడుగుతున్నావు. నావంటి మంత్రవేత్తకి తలుపులు గోడలూ ఒక అడ్డా ?

రత్నాం : అయితే ఆ మంత్రంవల్లే పైకిదాటు. యీ జాడీ పైనపెట్టించి పైనుండి తాళం వేస్తాను.

కొండు : గదిలో ప్రవేసించడానికి యేం బ్రహ్మవిద్యకావాలి ? మూడుతాళంపెట్టి తీశాను.

రత్నాం: ఏ మనిషి నీకుసాయం చేసింది?

కొండు: నాకొకరి సాయంకూడా కావాలా?

రత్నాం: పేరు?

కొండు: చెప్పకపోతే?

రత్నాం: పట్టిఅప్పచెపతాం!

కొండు: పట్టి అప్పచెప్పితే ప్రాణత్యాగం చేస్తాను. బ్రహ్మ హత్య నిన్ను చుట్టి, చుట్టి శేషువులా చుట్టుకుంటుంది.

రత్నాం: అయితే చెప్పినమాటకి జవాబు చెప్పండి.

కొండు: పేరు కేంవుంది (పొడుంపీల్చి) అంకి!

రత్నాం: అబద్ధం!

కొండు: అయితే...పెడి!

రత్నాం: అబద్ధం!

కొండు: యెరిగి నన్నెందు కడుగుతావ్రూ?

రత్నాం: బ్రాహ్మడికుండే నీతి నీకు లేకపోయినా, దొంగకివుండ వలసిన నీతైనా నీకు వున్నందుకు అలగుతున్నాను.

కొండు: అయితే బ్రాహ్మణుని దయదల్చి ప్రాణాల్తో వొదిలి వేస్తారాయేమిటి? నువ్వు ధర్మాత్మురాలివి! యీ పుణ్యం కట్టుకుంటే, స్వర్గం యెదురుగా వస్తుంది! కొంచం ఆసరా ఇయ్యి. జాడీలోంచి పైకివచ్చి యీ దొంగముండా బొద్దెం కలబాధ వొదులుచ్చుకుంటాను.

రత్నాం: శిఖా, యజ్ఞోపవీతం యిక్కడ సమర్పించి మరీ పైకి రావాలి.

కొండు : అదేవిఁటది?

రత్నాం: అలా నిలుచుండండి, చెబుతాను! (దగ్గిరకు వెళ్ళి)ముందు, జంఝూ, దర్భముడి వ్రంగరం యిలా ఇచ్చెయ్యి.

కొండు : (జంఝం తీసియిచ్చి,) యిదుగో జంఝం పోస దాఖలు చేసుకో! బ్రాహ్మశన్న వాడికి ప్రాణసమానమైన ధనం యిదే! అది నీపాలుచేశాను. అంతటికో వొదిలివేయి.

రత్నాం : వ్రంగర యిలా ఇయ్యి;

కొండు: నువ్వు నీతిమంతురాలవని పేరుపడ్డావు. బ్రాహ్మణద్రవ్యం అపహరిస్తావా? "అవిషం విషమిత్యాహుర్ బ్రహ్మస్వం విష ముచ్యతే" అని వెయ్యినోళ్ళతో శాస్త్రకారుడు చెప్పాడు. చదువుకున్న బ్రాహ్మణ్ణి కొంచం చెయి తడిచేస్తా వేమోఅని ఆశపడితే అసలుకే మోసం తెస్తున్నావేమిటి?

రత్నాం : అధిక ప్రసంగం ఆలస్యానికి హేతువ! మన మాటలు విని ఎవరయ్నావొస్తే గుట్టు బ్టబయిలవుతుంది...వ్రంగరం!

కొండు : కానియ్యి! నా వేలువ్రంగరం నీ మృదువైన వేలు అలంకరిస్తే కృతార్థత చెందుతుంది. (వ్రంగరం అందిచ్చును.)

రత్నాం : ఆ మాట బాగుంది! (వ్రంగరం వేలునుంచుకుని) యిక శిఖ వ్రండిపోయింది. (తలవంచి ఒక నిమిషం కదలకుండా వ్రండి మొలలోంచి కత్తెరతీసి చూపించును.)

కొండు : (జుత్తు చేతపట్టుకుని) సిగకే తాళంపట్టావ్రా? అది మాత్రం వొదిలేయ్. నీకు దాసుణ్ణై తిరుగుతాను. యెన్న డైనా నీ మాట గదువ్రదాటితే అప్పుడే యీమర్యాద చేదువ్రగాని.

రత్నాం: "శుభస్య శీఘ్రం" అన్నాడు.

కొండు: కేశఖండన వృత్తవానికి చెప్పినట్టు చెప్పుతున్నావు. యీ మాత్రం గడపవా? ముందు నీకు యెంతో పనికి వసానుసుమా!

రత్నాం: అలాఅయితే కొస కొంచం కత్తిరించి వొదిలేస్తాను; అది మాత్రం తప్పదు!

కొండు: అయితే కానియి!

రత్నా: (జుట్టు కత్తిరించును.)

కొండి: కొసేమిటి! మొయ్యా కత్తిరించేశావు.

రత్నాం: వెంట్రుకలకేవిటి! తరిగినకొద్దీ పెరుగుతాయి. బలువు తగ్గింది.

కొండు: యీ అవమానంతో నలుగుర్లో యెలా తలెత్తి తిరగడం? దాని సిగ్గోసిన సిగపోతేపోయింది. కొంచం ఆసరా యిచ్చి పైకి లేవదియ్యి. కాళ్ళు కొంకర్లు పోయినాయి.

రత్నాం: మొదట యెలా దిగావు?

కొండు: తలుపుతాళం రాగానే శరీరానికి యెక్కల్లేని లాఘవం వొచ్చి హనుమాన్లులా యెగిరి లోపలికి జారాను; గాని వొళ్ళు కొట్టుకుపోయింది!

రత్నాం: రాలేకపోతే అలాగేవుండు.

కొండు: యేం యిలాంటి కారిన్యం వహించావు? (అంచులు చేతబట్టి ఊబకప్రయత్నంచగా జాడీ పగిలి కొండుభట్లు పెంకులమధ్య కూలబడును.) చంపావు! (రత్నాంగి కొంత కనికరముతో లేవదీసును.)

కొండు : ఒళ్ళంతా గాయాలు తగిలాయిగాని, నీ కరస్పర్శ తగలగానే అమృత నిష్యందనంలాగ ... (కుంటుతూ తెలుపు వేపు నడుచును. తెలుపుదగ్గిర నిలచి ధనంవేపు చూసి ధనం కాళ్ళ తన్నుకుపోతున్నావు. లేక నాతో ఒంటుకూడ్డం యిష్టం లేదుగాబోలు. నామట్టుకు కొత్తనీరూ పాతనీరూకూడా యేకంగా కొట్టుకుపోయినాయి. నా వుంగరం దొబ్బినందుకు లేడా దేవుడు? (అంటూ తెలుపు గడియలు తీసును.)

రత్నాం : (తానుకూడా తెలుపుదగ్గిరకివెళ్ళి తెలుపు తానే వేస్తూ) నిన్ను ఒక్కణ్ణో పైకివొదిలి, నే గదిలో వున్నానంటే పైని గొళ్ళెం వేసి కొంపకగ్గిపెట్టగలవు. గనక నిన్ను వీధిలోకి సాగనంపి వీధితలుపు ఘడియవేస్తాను (గదిపైన గొళ్ళెంవేసి కొంచెంభొట్లుతో పైకివెళ్ళును.)

(బోనిపెట్టి తలుపుమెత్తి కోమటి రంగన్న సెట్టి పైకివచ్చి సరుకులు పరీక్షించి, అందులోంచి వుంగరాలుతీసి చేతనిపెట్టుకుని కొన్ని కాసులు మొలను దోపుకొనును. యింతట్లో రత్నాంగి కాళ్ళ చప్పుడవును. సెట్టి మంచంమీద పడుకుని దుప్పటీ తీసి కప్పుకొనును.)

రత్నాం : (తలుపుతీసి గదిలో ప్రవేశించి సరుకులునేపు చూసి కాసులు పోగుచేసి) యేమిటీచిత్రం! కాసులు సగానికి సగం తగ్గిపోయినాయి? (నిలుచుని నాలుగువైపులా చూసును. మంచంమీద మనిషి వుండడం చూసి గతుక్కుమని రెండడుగులు వెనక్కువేసి ఆంజనేయ దండకం పఠిస్తూ "శ్రీ మన్మహా అంజనీగర్భ సంభూత సద్బ్రహ్మచారీ, కపీంద్రాదివంద్యా కిరీటోజ్వలద్రత్న"

(రత్నాంగి దుప్పటీ ముసుగు తీస్తూంది. గాఢనిద్రలో వున్నట్టు సెట్టి కదలడు. రత్నాంగి బాగా మనిషిని నఖశిఖపర్యంతం పరీక్షించి మొల దగ్గిర చెయ్యిపెట్టును.)

శెట్టి: (తటాలున రత్నాంగి తలపట్టుకుని) దొరికావు మరొగ్గను ... చెప్పు! అమ్మనారివా? అసిరమ్మనా? పీడనా? పిశాచానివా? ఆ! యేటీవాళకం? చెప్పు! నిశిరాత్రివేళ యిటొస్తావు అటొస్తావు...నీకేం! నేనాశ్చకవాఁ! పరాశ్చకవాఁ, ఓలమ్మ! యిదియేవ్రూరు! యేలోకం! నాకొంపలో నాపక్కమీద నేను పల్లక పడుకున్న ముండావాణ్ణి, అమాంతంగా యెత్తి తెచ్చి యిక్కడపడేసినావుగదా! గుండెలుబద్దలయి సవ్వనా? రామసానీ! నీకేటి కావాల? ఒక్కమాట చెప్పు! యేటపోతు కావాలా? నీరూపంచూస్తే నాకుభయం వేస్తున్నాది. కళ్లు మూసుకున్నాను. తల్లీ! రక్షించు!

రత్నాం: చదవవలస్ని పాఠంవంతా అయిందా, యింకా వుందా?

శెట్టి: అయితే, మనిషివే? యెవరమ్మా నువ్వు! చెప్పు నా యిల్లు చేక్కు తల్లీ! మావాళ్లు బెంగపెట్టుకుంటారు.... రత్నాంగివా? అయితే బతికాను. (నలుప్రక్కలా పరికించి) యిది రామసాని చీకటిగది కాదుకద? పిశాచమై పీక్కుతింటూంది! నన్ను తెచ్చి పడేసినట్టే నిన్నూ తెచ్చి పడేసిందా యేమిటి? యిక్కడుంటే మన్ని చంపేసి పోగలదు! రా! పైకిపోయి మంత్రగాడి కాళ్లట్టుకుని ప్రాణం బచాయించుకుందాం!

రత్నాం: తల వొదిలెయి!

శెట్టి: చూశావా నా సేతులు యెలా గజగజ వొణుకు

తున్నానయో? భయంచేత వళ్లు కంపం పట్టుకుంది. ... నావశవా, చేతులు వొదల్డానికి.

(రత్నాంగి వెళుగులాడి మొలదగ్గిరకి చెయ్యి పోనిచ్చును.)

శెట్టి: సెయ్యిమాత్రం మొలలోకి వెళ్ళనీయకు. దోపిడే? సానిబుద్ధిపోతుందా? పిశాచం ప్రేకుతిగటూవుంటే సరసానికి యాళా?

రత్నాం: వేళాకోళం మాని మొలనున్న కాసులు అక్కడ పెట్టు.

శెట్టి: యీవాళకం శెట్టిదగ్గిర పనికిరాదు. (లేచి నిలబడి రత్నాంగిని దూరానికి తోసి తలుపువేపు జరుగును.)

రత్నాం: దొంగ! దొంగ! మంజువాణీ (అని కేక వేసును.)

శెట్టి: నేనేం యెట్టికుట్టి బాపనాణ్ణనుకున్నావా యేమిటి? పిలువు! నీ యిష్టంవొచ్చినవాళ్ళని పిలువు. నాకు భయమనుకున్నావా (పెద్ద గొంతుకతో) నన్ను యీ సీకటిగదులోకి పిలిసి యీబంగారం మనం పంచుకు దొబ్బుదావంటే నేనొప్పుతానా? నీకాకావలిస్తే నువ్వుదొబ్బు. పోలీసోళ్ళ పట్టుకున్నప్పుడు నువ్వడ్డుతావా? రామసాస దెయ్యమై పీక పిసికితే నీడబ్బడ్డుతాదా? (తలుపు దగ్గిరకి దాసీలు మంజువాణీ నరహరిరావు గారు వచ్చి తట్టుదురు.)

శెట్టి: నాయెత్తుధనంపోస్తే యిలాంటి దొంగపని నేనుచెయ్యను. యింతద్రోహవా! పాపము బద్దలై ఆకాశమంత పిడుగు నెత్తిమీదపడదా! నాచెయ్యి వొదిలెయి. తలుపుతీసి నీ భవిష్యం నలుగురియదటా తీస్తాను.

రత్నాం: చేతులు పట్టుకొండ్డు! యేంచెయ్యను?

నరహరి: (తలుపుమోద చెయ్యి వేసి)యెవర్లోపల?

రత్నాం: శెట్టి.

మంజు: శెట్టా? యెలావొచ్చాడు?

శెట్టి: శెట్టి, యెలావచ్చాడా? రత్నం రమ్మని ప్రాణంతీసే వచ్చాను! బంగారం నాణెంచేసి ఖరీమకట్టాలి రమ్మంటే వొచ్చాను. దొంగపని చెయ్యమంటే నేనొడబడతానా? రామసాని సొమ్ము ఒక్క చిల్లికాసు ముట్టుకుంటె పిశాచై పీక పిసగదా? (తలుపుతీసుకు పైకిపోవడానికి ప్రయత్నిస్తూండగా)

రత్నాం: పట్టుకొండి! మొల్లో కాసులు ముడుచుకు పోతున్నాడు! అవిగో, వుంగరాలతోపాటు...

శెట్టి: యేటీమనిసి యికారం. (రత్నంమోదికి వంగి మొహందగ్గిర మొహంపెట్టి) నేం దొంగనా? నువ్వు దొంగవా? మాయింటావంటా ఆ మాటలేదు. ఆ మాట మళ్లీ అన్నావంటే చాలాదూరం యెళుతుంది. కోవటోళ్ళు! మా యిల్లంతా బంగారం! మా వొళ్ళంతా బంగారం!

నరహరి: శెట్టీ!

శెట్టి: సిత్తంబాబూ! పిశాచమంటే నాకుభయం, పోలీసోళ్లంటే నాకు భయం -- మరెవ్వళ్ళకీ లచ్చపెట్టను. (తిరిగి సాగి వెళ్ళుతాడు.)

నరహరి: నిలబడు!

శెట్టి : (వెళ్ళిపోతూ) భోగంద్దానియింట్లో ఒక్క-నిమిషం నిలబణ్ణు! అదంతా బాపనాళ్ళకు చెల్లుతుంది.

నరహరి : (పరిగెత్తి శెట్టి రెక్క-పట్టుకొని నిలబెట్టి) కాసులు వుంగ రాలు పెట్టు.

శెట్టి : సెయిముట్టుసరసంమాత్రం సెయకండి. మాటొస్తుంది!

నరహరి : యిస్తావా? యివ్వవా?

శెట్టి : దోపిడే!

నరహరి : ఆహా!

శెట్టి : యివ్వకుంటే యేటిసేస్తావు?

నరహరి : పిలకూడదీస్తాను.

శెట్టి : గవరుమెంటు బావుటా యెగురుతుండగా యెవడు పిలకట్టుకునేవాడు?

నరహరి : యిదుగో నేను (అని పిలకపట్టుకుని వంచును.)

శెట్టి : బాబ్బాబు! మీ మాట కెప్పుడయినా కోవటోడు అడ్డు సెప్పుతాడా? మీ శలవు! బాపనోరికి బంగారం యిచ్చుకుంటే పుణ్ణెం కదా! పితాళ్ళ స్వర్గానికి పోరా? ముండకాసులు మళ్ళీ ఆర్జించుకుంటాను. పుచ్చుకొండి! (కాసులు పుచ్చుకుని నరహరిరావు జుత్తు వదిలివేయును.)

నరహరి : దెబ్బకు దెయ్యం నెరుస్తుంది.

శెట్టి : బాబు! దెయ్యమంటే నాకు వొళ్లమాళ్ళి భయిం! మకొగ్గెయ్యండి; యీకొంపలోంచి దాటిపోతేబతుకుతాను. (గడపదిగుతూండగా)

రత్నాం : వుంగరాలో ?

నరహరి : వుంగరాలిచ్చి మరీవెళ్ళు !

శెట్టి : మీ శలవు ! మీ శలవు కడ్డా ? (వుంగరాలు తీస్తూ రెండడుగులు ముందుకేసి పరిగెత్తి పారిపోవును.)

(తెర)

అష్టమరంగము

(అక్కాభత్తుడి దుకాణం : అక్కాభత్తుడు, రామూర్తి ప్రవేశించును.)

అక్కా : ఇక 'రామూర్తి' అని పిలవకూడదు 'రామూర్తి పంతులుగారు' అని పిలవాలి.

రామ : యేదో పెద్ద ఉద్యోగాలు అయినప్పుడుగదా అలా పిలవడం !

అక్కా : అందాకా మామూలుగా పిలవొచ్చునా ?

రామ : యేం చదువు ? యేం ఉద్యోగాలు ?

అక్కా : యేం అలా అంటున్నారు ?

రామ : మాతండ్రి సంగతి బాగుందికాదు, ఆయనకి మంచి స్నేహితులయిన్నీ మీలాంటివాళ్ళు కూడదని చెప్పరు.

అక్కా : ఆయన యే కూడనిపనీ చెయ్యలేదే ! యేదో ఉపాయంవల్ల పదిరాళ్ళ సొమ్ము ఆర్జించుకుని సంసారం గడుపుకుంటున్నాడు !

రామ : ఎవడో పోళంగిరాజును యీవేళ యింటో దింపి పార్వతిని వాడికి ఉపచారం చెయ్యమని అప్పచెప్పాడు. యీ దౌర్జన్యం చూశారా ?

అక్కా : "భార్యా రూపవతీ శత్రుఃి" అన్నాడు. మొగుడున్న పెళ్ళామే సొగసుగావుంటే పయివాళ్ళు కన్నేస్తారుగదా, ఖాయిదా లేకుంటే సొగస్సైన వితంతు చెడిపోవడమనగా యెంతసేపు ?

రామ : మాతండ్రికి అలా గడ్డిపెట్టాదా ?

అక్కా : మీతండ్రికి గడ్డిపెడితే గడ్డయ్యేది, గట్టయ్యేది సాఫుగా తినేస్తాడు. అయినా, ఆయన ప్రతిబంధకం మీ ప్రయత్నానికి అడ్డవుతుందా యేమిటి ? పెళ్ళిమూర్తం యెప్పుడండి ?

రామ : ఎవరి పెళ్ళండి ?

అక్కా : ఎవరి పెళ్ళను కున్నారు ?

రామ : నా పెళ్ళి.

అక్కా : ఆ మాటే ! మీపెళ్లి ! పార్వతమ్మ పెళ్లిన్ని !

రామ : (నిశ్చాంతపోయి) యెవరు చెప్పారేమిటి ?

అక్కా : యెవరూ చెప్పలేదు ..... మీ మాటలవల్లా మీచర్యలవల్లా ఊహించాను. మరేం భయపడకండి. అది మహామంచిపని. మీ తండ్రి ఆదాలోవుంటే రత్నం లాంటిపిల్ల చెడిపోతుంది. యీమాట పొక్కేలోగా శీఘ్రంగా కానియ్యండి. నాచేతనయ్ని సహాయంచేస్తాను.

రామ : నిజంగాను ?

అక్కా : లింగంసాక్షి !

రామ : అయితే మా గురువు గిరీశంగార్ని తీసుకొస్తాను !

[తెర]

నవమరంగము

(మంజువాణి ఇల్లు. ఒక బల్లచుట్టూ కుర్చీలు. బల్లమీద గళాసులు విప్పిన సీసా; మంజువాణి మంచంమీదను; త్రివిక్రమరావు పంతులు యీజీ చెయిరుమీద మితిమీరి పడివుందురు.)

కొండు : (చప్పుడు కాకుండా బొటకనవ్రేళ్ళమీద నడచివచ్చి త్రివిక్రమ రావును కదిపి చూచును. తెలివిరాదు. ఆత్మగతం) జేబులో యేముందో. (చెయి జేబులో జొరిపి...మనీపర్సు తీసి...విప్పిచూచి) దీనిలో పెద్దకాసులు చాలా వున్నాయి. యివి వీరికి దక్కేవికావు. వివాహకార్యం కింద వినియోగపరిస్తే కొంత పుణ్యం అయ్నా వీడికి దక్కుతుంది. రెండు కాసులు మంజువాణికి యిచ్చేటందుకు యిందులోవుంచి యిదిగో మళ్లీ జేబులో పడేస్తాను. కడంవి కాకితం పొట్లాంకట్టి కందులజాడీలో లోతుగా కప్పివేస్తాను. (నిష్క్రమించును.)

త్రివిక్రమ : (నిద్రలో కాలుచాచగా సారాబుడ్డి నేలకిపడి చప్పుడవును. అంతట ఉలికిపడిలేచి మరివొక గళాసు పుచ్చుకుని) దీనికి డబ్బిచ్చి వెళుదాం ! (జేబులో మనీపర్సు తీసిజూచి నిశ్చాంతపోయి) ఆ ! రెండేనా వున్నాయి, కడంవి యెవరు దొబ్బారు? అది

మంచంమీాన వొళ్ళెరక్క పడేవున్నది! లేక నేను ఖర్చు పెట్టాన! లేకుంటే నా నెాళ్లు యెవరయినా చెపాయిం చేశారా? ..... యీా రెండుకాసులూా దీనికి యిచ్చేస్తే యింటికిజేరే సాధనమేమిటో? ..... ఒకటే సాధనం కనబడుతూంది. శాస్త్రుల్లుయింట్లో దాని శిగగోస్ని పాత్ర సామాను వొదిలివేసి సన్నంగా నలుగురుం జారిపోయి తెల్లారగట్ల రెయిలులో విశాఖపట్నం జేరుకుంటె అక్కడ రుణం చేసుకోవచ్చును. ఎవడూా మేలుకుండలేదుగద?

(తలుపు మెల్లగాతీసి వెళ్ళిపోవును.)

(తెర)

కొండుభట్టీయము

తృతీయాంకము

ప్రథమరంగము

[కేశవరాయుడుగారి చదువరగది: కేశవరాయుడుగారు దివాన్ బహద్దర్ రాజారాంగారు ప్రవేశించుదురు.]

కేశవ : బహుకాలానికి ! దయచేయండి !

రాజా : రిటయిరయ్నవాళ్ళంకామండీ, బ్రతుకుయొక్క-సాయంకాలంలో దేవుడికి దేశానికి సొఖరీ చెయ్యవలెననే అభిలాష కలిగి ద్వైవారాధనా, గ్రంథకాలక్షేపంతో కాలం వెళ్ళబుచ్చుచున్నాను. భగవద్గీత ఆచార్యులవారి వ్యాఖ్యాన సహితంగా ఆంధ్రీకరించినానుకద ! ఇప్పుడు ఉపనిషత్ భాష్యం తెనిగిస్తున్నాను. నాస్తికం ఇంగ్లీషు చదువుకున్న మనవారిలో యెక్కువగుచున్నది. పెద్దలు చిన్నలుకూడా అప్పటి ఐహికములందు మగ్నచిత్తులయి వుండడమేకాని, "వాట్ యేమ్ ఐ" "కోహం; నే నెవడను" నా దేవునియడల నాయడల నాతోటిపాటి జంతువులయడల నా డ్యూటీ యేమిటి, "వేర్ యామ్ఐ డిస్టింగ్" నే నేర్పోన జారుతున్నాను? అనే తలంపులు యేమి పాపమోకాని బుర్రలో జొరబడవు. ఆస్తికులయిన తాము ప్రధానోపాధ్యాయులయి యుండుటను యీ పట్టమున బొలురుమాత్రము యితర పట్టముల వారివలెకాక బుద్ధివంతులుగా నున్నారు.

కేశవ : దయచేత నన్ను పొగడుచున్నారుగాని నేను యంతటి వాడను, నే చేసే పననగా యెంతటిది?

రాజా : మీవంటి సత్పురుషులకు వినయము సదాభూషణ
మయే వుండును. దేశమున నుండునుండీయున్న పాసచింతా
ఆంగ్లేయ విద్యాలనలన కలిగిన నాస్తికతా, అనే మహా
మిసిసిపి, మిసోరి, ప్రవాహములకు బ్రహ్మసమాజమతమనేది
పెద్ద ఆనకట్టవలె ఆచరిస్తున్నాది. బ్రహ్మసమాజము
లోకములోనుండు మతము లన్నిటికన్నా రేషనల్; సన
బయినదే అయిననూ లోకమున అవస్థా భేదము,
రుచిభేదము కలిగివుండుటచేత ఏజాయమనుష్యులకు
ఆజాయను జ్ఞానోత్పత్తిధర్మోసదేశమూ చేయడము విధి
గనుక తాము తర్కమును బట్టి సూటిగాపోవు బుద్ధులకు
బ్రహ్మమతోపదేశము చేయుచున్నారు. నే నంటిరో,
హిందూమత గ్రంథములలో పురాణాదులు కేవల స్త్రీ
పామరజన బోధక ప్రయోజనములుగా తొలగించి పాశ్చా
త్యులు గూడా వేయినోళ్ళ బొగడు భగవద్గీతాది మహా
గ్రంథముల సాహాయ్యమున ఆర్యమతమునకు చిరకాల
మావరించిన త్రుప్పును గడగి ఆచార్య నిర్దిష్టకర్మ, వేదాంత
మార్గములను చమువరుల కంటికింపుగ గనపర్చ ప్రయత్నిస్తు
న్నాను.

కేశవ : యే రీతినయినా నాస్తికతా పాపము యడల భీతి,
పుణ్యాముయడల ఆసక్తి కలుగచెయ్యడం యిప్పుడు
మనదేశములో అత్యానశ్యకము లయినప్పటి మనవాళ్ళ
అవివేకానికి మేరలేకుండా వున్నది.

రాజా : పార్డన్ మీ! యేదో వక తరహా అంటే ఇంచుక నేను
తమ అభిప్రాయముతో భేదించవలసి వస్తుంది. క్షమించ

వలయును. యే రీతినైనా ఆస్తికత అంటే... యిదిగో చండాలుడు, యెనుపోతును, వేటవేసి మరిడమ్మకు పూజ చేస్తాడు. మనమునూ అట్టుల చేయగలమా? సంఘములో పై అంతసులవారమైన మనము రేషనల్ కైలిజను కలిగి వుండవలెను. అట్టిమతము క్రమక్రమంగా క్రిందివారికి దిగును....సవబునే, నేను పూజిస్తాను. ధియాసష్టిస్టు మతమువలె పేడా బెల్లం కలిపి మనవాళ్ళ సంతోషించడము కొరకు ప్రతి వెర్రిమొర్రివాతకు సందర్భమును కల్పించడమూ ప్రతి అవకతవక ఆచారముకు రహస్య సవబులూ, గుణములు కల్పించడము... యేమంటారు? తాము అట్టి వెర్రిమాయలు నమ్మజాలరే?

కేశవ: నిజమే!

రాజా: అట్టి ప్రవర్తన కలవారితో రాజీలెల్లను యెట్లుపాటించ తరమనవలయును? మత సంబంధమయ్యి అతర్కిత ఆచరణలో మనవాకిటలోనే కొండంత యిన్ కాన్సిస్టెన్సీ వున్నది. చూడండి, నాయుడుగారూ! మన మాధవయ్యగారున్నారు. వారి యోగ్యత, ఆంధ్రపాండిత్యమూ, కవితా సామర్థ్యము మన దేశమునకెల్ల నలంకార భూషితములయి యున్నవే. వారు బ్రహ్మసమాజ మతము నెన్నాళ్ళనుండియో అవలంబించి ఆ మతమునకు, మొనగాండ్లయి వున్నారు. విధవా వివాహాములు ఆచరించవలసి వచ్చినప్పుడు, రీజన్ కాగిన వారు బ్రహ్మ సమాజమునొక్క మార్గమువదలి హిందూ శాస్త్రప్రకారం ఆచరిస్తారు. అది యేమనవచ్చును?

కేశవ: నిజమే! గాని మాధవయ్యగారు సవబుమారిన పని చేసిననూ మన్నించడము శక్యముకాదు కాని, తాము విధవా వివాహమునకు ఘర్ గాని, యెగినెట్టుగాని వున్నట్టు కానరాదు! తమవంటి పండితులు ఆ రిఫారం విషయమయి చర్చించి యేదోవక నిశ్చయమును తీసుకువ్రండకపోతే...

రాజా: అన్నిపనులు అందరూ చెయ్యడము శక్యమా? మత సంస్కారము, అందుతో సంబంధించిన గ్రంథరచనా, నా బ్రతుకుకు విధానములుగా నిర్ణయించుకు వున్నాను. చేయవలసిన పనులు లోకములో మెండుకలవు. చేయచేకొనిన పని చాయశక్తుల జేయనగు. అందు విద్య అన్య వ్యాపార నిరోధి; జలస్ట్రైఫ్! ప్రస్తావన వశాత్తూ. విధవా వివాహముల మాట అంటినిగాని ఆ భారముగూడా వహించుటకు నా భుజములకు స్థైర్యము చాలదు. మాధవయ్యగారూ, తమలాంటివారూ పట్టియుండగా నా రిఫార్మ్‌కు మరియొకరి సహాయ్య మావశ్యకముకాదు. గాని నామనసునకు కలిగిన సందేహము నివారించుకో జాలక, మాధవయ్యగారి మతమునకు ఆచరణకుగల స్థైర్యము తాము సమన్వయించ గలుగుదురని అడిగితిని.

కేశవ: రాత్రింబవళ్ళు నేనిదే ఆలోచించుతాను. వారు వినరు; యేమిచెయ్యను. నేకూడా మోరల్ కరేజ్ లేనివాడిలా లోకానికి కనపడుతున్నాను. నాశత్రువులు నన్ను తరుచుగా వెక్కిరిస్తూవుంటారు.

రాజా: మాధవయ్యగారు గొప్ప గ్రంథకర్తలు, సంఘ సంస్కార నిర్వాహకులు; వారికి మనమందరము పూజ

చేయవలసినదే! వారిపేరట చంద్రకాంత శిలాప్రతిమ
వకటి నిలపనగు; గాని తెప్పుత్రోవను మనల నీడ్చుకపోయి
హాస్యాస్పదులనుగా చేసినప్పుడు నేనయిన నేమిచేతును?
పెళ్ళిచేసుకునే కుర్రవాడు బ్రహ్మసమాజ మతస్థుడైనప్పుడు
సమాజ మందిరములో సమాజ పద్ధతి ప్రకారం పెళ్ళి
చేయించుదును! మాధవయ్యగారేమి చేయుదురు?

కేశవ: తమరిచ్చిన సలహా బాగావున్నది. సంఘసంస్కార
సమాజంవారము చాలామందంతా బ్రహ్మసమాజము
వారమే! మేము నలుగురమూ కలిసి మా మత్రప్రకారం
వివాహము చెయ్యడమునకు నిశ్చయిస్తే మిగిలిన ముచ్చ
కాయ ముగ్గురూ యేమి చెయ్యగలరు? అందులో మా
స్కూలు కుర్రవాళ్లు మాపక్షము వుంటారుకద! ఓట్లు
మెజారిటీ యే మీటింగులోనయినా మాకే వస్తుంది!
యిటువైని మా నమ్మకముల ననుసరించి పనిచేసి
చూస్తాము. థేంక్యూ వెరీ మచ్ ఫర్ ది ఎడ్వైస్!

రాజా: నేను యెడ్వైసును యివ్వలేదు. ఇవ్వజాలినంతటి
వాడిని కాను. దిషారము విషయమై నేను తమకు యడ్వైసు
యేల? ఈ హంశము మన ప్రసంగములో ఉపమా
నముగా తెచ్చినాను. దీని మాటకేమి, తాము సభ
ప్రకారం నడిచేటప్పుడు లోకం అంతా మీపట్ల వుంటారు.
మనం అనుకుంటూవున్న ప్రస్తావన రెలిజన్ రేషనల్‌గా
వుండకుండే అన్యమతస్థులయొక్కా నాస్తికంయొక్కా థోకాకు
నిలవగలదా?

కేశవ : అవును.

రాజా : నేను యిప్పుడు తమ దర్శనానికి రావడము కారణ మేమిటంటే , తమతో ముచ్చటించడమనే సంతోష మలా వుండగా, ఆదివారం రోజున మా తోటలో నలుగురు స్నేహంమ్నకి టీపార్టీ యిస్తాను. ఆహ్వానము చేయుటకు వచ్చితిని.

కేశవ : చీటీవ్రాస్తే వస్తానే ! నాకోసం యెంతశ్రమ తీసు కున్నారు !

రాజా : తామును చూడడపు ఆనందమో, తమతో ముచ్చ టించుటవలన గలుగు జ్ఞానోత్పత్తియో? గుడ్‌బై ! (షేక్ హాండ్స్ చేసుకుందురు)

కేశవ : గుడ్‌బై !

(తెర)

ద్వితీయరంగము

(దివాన్ బహద్దర్ రాజారాంగారి కచేరీగది : రాజారాంగారు, గంగాధరశాస్త్రి ప్రవేశించును.)

రాజారాం : ఈ పటుపటాంగములో యెవరు గెలుస్తారంటారు?

శాస్త్రి : తాము దివాన్ బాహద్దర్లు, మాధవ అయ్యగారు రావుబాహద్దర్లు. ఇద్దరి తారతమ్యము కంపినీవారు యెంచే వుంచారు. తాము సార్థకనామములగు మంత్రులు. మాధవ అయ్యగారిది నైదీకపురస్తా. అందులో వేగినాటి సన్యాసం

ఆయ్నకు దేశాన్నిపట్టి అబ్బింది. గ్రంథాలయితే చాలా రాశారు.

రాజా : పండితులయిన మీరూ అలా అనడం ఆశ్చర్యముగా నున్నది. పిట్టకథలు, పిచికకథలు, లిట్లూగ్రంథములంటారో? ఇంగ్లీషులో సోలిడ్ బుక్ అంటారే, అనగా ఉద్గ్రంథము! అది మనము గ్రాస్తూన్నాము. మన భగవద్గీత ఆంధ్రభాషకు వజ్రకిరీటమని పేపరువాడు గ్రాశాడు ..... శైలిభేదం చూశారా? మాధవయ్యగారి గ్రాత ఊక! పేలపిండి! మాశైలి అలంకార భూయిష్టమై యుండును. వాక్యముల నడక సంగీత గమనము ననుకరించును. పామర జనులకు ఉత్కృష్ట వస్తుగుణ గ్రహణం వుండదు. మన గ్రంథములు యెంత బాగనుగా నచ్చొత్తించినను కొనువారు గానరారు. జమీందార్లు తమ యుద్యోగస్తుల మేలుకోరి కాపీ లధిక ముగాగొని, తాము వారికి పంచిపెట్టిన జమీందారీలు బాగగును. దేశములో జ్ఞానాభివృద్ధికి మార్గమగును. ఒక మాకు వెళ్ళి ఉద్యోగావస్థలో పూర్వపరిచితులయినవారిని చూడవలె. యెక్కడయినా మంచి సంస్థానంలో దివాన్గిరీకి కుదురుకుంటేనేకాని. అధికారంచేసే అలవాటుపోయి యేమీ తోచకుండా వున్నది.

గంగా : ప్రజలకి ఆ అదృష్టంపట్టాలికదా!

రాజా : దివాన్గిరీచేస్తే చెన్నపట్టపు వకీళ్లతో పలుకుబడికూడా వుంటుంది. కొన్నిలుమెంబరుపనికి సహాయభూతంగా వుంటాను. యీ జిల్లాలోనే కొంచెం ప్రజలని రంజింప

చెయ్యడానికి సంఘసంస్కారంలో మనంకూడా వేలు పెట్టి తేనేకాని, యిక్కడివాళ్ళు మనకు ఓట్లు యివ్వరు.

(ప్రవేశం నౌఖరు)

నౌఖరు: గిరీశం పంతులుగారు వచ్చారు.

రాజా: రమ్మను! (గంగాధరశాస్త్రితో) ఇతడు నా బాల్య స్నేహితులయిన యుగంధరరావుపంతులుగారి కొమారుడు. చిన్ననాటినుంచి యెరుగుదును. బి. ఏ. ప్యాసు అయినాడు. తండ్రి ఆర్జించిన ధనంపెట్టి బ్రతుకుతున్నాడు. ఇతనిని సంఘ సంస్కారమువారు కెప్తానుఅంటారు. సాహసోదార్యాలుగల మనిషి. కోటివిద్య లున్నాయి. నాటకా లాడుతాడు. పాడుతాడు. గారిఫీచేస్తాడు. దొర్లకి ఇతనంటేసరదా. తండ్రిచేసిన మొదటి వివాహంభార్య పోయింది. పిల్లలులేరు. తిరిగి వివాహంలేదు. చేసుకుంటే మరెవరయినాపిల్లను యిచ్చివుందురు. అర్ధరాత్రివేళ యెటువైపున పిలిచినా రెండువేలమంది వెనుకకూడుతారు. గుణయోగ్యతలున్నవిగావి, కొంచెం పెద్దపిన్న తారతమ్యంయెరిచి హాస్యరసంగా మాట్లాడుతాడు. తుంటరి ...అతను వచ్చేసరికి పుస్తకం చదువుతూ వుందామము. "భీష్మాత్ వాతః పవతే భీష్మాదేతి సూర్యః భీష్మాదగ్ని శ్చండశ్చ."

గిరీశం: (ప్రవేశించి) ఆ స్వరాన్ని యెందుకు సాగదీస్తున్నారు. శాస్త్రులుగారిచేత చదివించండి. మీరు అర్థం వ్రాయండి.

రాజా: (మెల్లిగా) డామిట్! అప్పుడే ఆరంభించాడు! బి.ఏ.,

ఆభాషలో ప్యాసుఐనాడు. మా వాడికి సంస్కృతంలో మంచి ప్రవేశం వుందండి. తండ్రి ఉపనిషత్తులుకూడా చెప్పించాడు.

గిరీశం: మా గ్రామములో ఒక కోమటుండేవాడు. ఆయన పురుషసూక్తం పారాయణచేస్తూ వుంటే నూతులో కప్పలు బుర్ర పైకెత్తి అరిచేవి.

గంగా: మండూకప్లుతం! వేదంలో స్వరంకూడా వుంది.

గిరీ: బ్రాహ్మలు సోమపానంచేసి వేదపారాయణచేస్తే తొలకరి కప్పల అరుపులా వుంటుందని రుగ్వేదంలో ఉపమానం కల్పించారు. తొలకరివాన కురిసినతరవాత రాత్రివేళ కప్పలు మేళంగట్టి తరహాతరహాలుగా గానం చేస్తూవుంటే అదివొక ఆనందంగా వుంటుంది!

రాజా: సీరియస్ సబ్జక్టులోనయినా హాస్యం విడనాడ జాలవు గదా రావుజీ!

గిరీ: మామగారు! గుడ్లగూబలా గాంభీర్యంగా కూర్చుంటాను; యేం శలవు?

రాజా: ఉపనిషద్వాక్యము పరిసమాప్తిచేసి మాటాడు కుందాము...శాస్త్రుల్లుగారు! అబ్బీ! నువ్వుకూడా విను, నీ బుద్ధిలో ఒరిజినాల్టీ వుంది. "భీషాస్మాత్ వాతః పవతే" అన్నాడు దేవునికి భయపడి వాయువు వీస్తుంది; సూర్యుడు ఉదయిస్తున్నాడు. అని యీ ప్రకారం చాలామంది తాత్పర్యం చెప్పుతారు. భయమనేది భగవంతునియందు, క్రౌర్యం కనపరుస్తుంది. భక్తివల్ల దేవతలు వారి వారి పనులు చేసినారంటే కొంత స్వారస్యంగా వుండును.

మా వాడు (గిరీశంవంక చూసి) భయంచేత చెయ్యమంటే యేపనీ చెయ్యడు. 'భీ' అనేమాటకు మరియేదయ్నా అర్థం చెప్పితే బాగుంటుంది. యూరోపియనులు వ్రాసిన డిక్షనరీలు చూడాలి.

గంగా: నేనుకూడా యేకాక్షర నిఘంటుచూసి కొన్ని అర్థాలు మనవి చేసుకుంటాను.

గిరీ: నేను, ఒరిజినల్ అనిమామగారుగాను శలవిచ్చారు గనుక నేనో కొత్తఅర్థం చెప్పుతాను. "మా"మీద "కా" యెక్కిస్తే భిక్షా అని అవుతుంది. ఆ పైని అర్థం బహుసులువుగావస్తుంది. గాలీ, సూర్యుడు వగయిరాలు ముష్టికోసం సంచారం చాస్తారని సమన్వయం అవుతుంది. "భిక్షా" అన్నది "భీ"అనే ధాతువులోనుంచి వచ్చిన పదంకాదు. అది యిండో ఆర్యన్ మాట! 'వ', 'బ',యోరభేదః అన్న సూత్ర ప్రకారం యింగ్లీషులో "విష్" అనే మోస్తరుగా తేలింది. విష్ అనగా యిచ్ఛ. ఇచ్ఛామాత్రం భోజనం. దేనికోసం ముష్టి అంటే భుక్తికోసం! "భుక్తి భిక్షుమీయవే" అని త్యాగరాయలు పాడలేదా? లోకంలోకూడా మనం చూడమా! గవర్నమెంటువారు యింత భిక్ష పడేస్తేగదా మామగారి వంటి గొప్పగొప్ప ఉద్యోగస్తులు నౌఖరీ చేస్తారు.

గంగా: వేదంలో అక్షరాలు మార్చడానికి వీలులేదండి.

గిరీ: అర్థము మార్చడానికి వీలుందండీ?

రాజా: శాస్త్రుల్లుగారూ! మీకు తెలియదండీ, మావాడు చెప్పింది చాలా సవబుగావుంది. యీవేళకి సమాప్తిచేతాం.

శాస్తుల్లుగారు మనలోవారే. మనం స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చును. రావుజీ! నీ హాస్యరసమునకు కొంచం కళ్లెంపట్టి ఒక అరనిమిషం సీరియస్‌గావుంటే చాలా ఒబ్లైజ్ అవుతాను.

గిరీ: మామగారి శెలవు శిరసావహించి గుడ్లగూబవలె బుద్ధిగా కూచుంటాను.

రాజా: యీ విధవావివాహం తాలూకు హికమత్తు యావత్తూ మిూక్యేప్తానుగారి చేతులోవున్నది గనుక, తూచాలుపోకుండా యావత్తూ పరిసమాప్తి అగునంతనే నమ్మకము నాకున్నది. నేను నిన్నటిదినం కేశవరావు నాయుడుగారితో మాట్లాడినాను. మాధవయ్యగారి రిదివరకు చేయుచున్న శాస్త్రోక్త పద్ధతి త్రోసి బ్రహ్మసమాజమతప్రకారం యిటువైపని విధవా వివాహములు చేయించుటకు వారిని గట్టిగా పుర్లెక్కించాను. నీసహాయంకూడావుంటే పార్వతమ్మవివాహం మన పట్టణంలో ఫట్టు. బ్రహ్మసమాజ విడ్డోమారేజిగా వుంటుంది. చేసుకునే కుర్రవాడు బ్రహ్మ సమాజ మతస్తుడు గనుక రేషనల్ కన్సమేషన్ అనేది మనము ప్రతిష్టించినవార మగుదుము.

గిరీ: సందేహము లేమయ్యా అడగవచ్చునా?

రాజా: అడగకపోతే యెటులను?

గిరీశం: ఇదివరకే వ్యవహారం జరిగిపోతూంది. నలుగురూ ఏకమత్యంగా రిఫారంపని చేసుకుపోతున్నారు. ఇప్పుడు నాయుడుని లేవదీశారు. మాధవయ్యగారికి తానుపట్టిన కుందేటికి మూడేకాళ్లు. ఇప్పుడు మిూరు చేసిన దోహదం

వల్ల వారుభయులు జుత్తూ జుత్తూ పట్టుకుంటారు. ఈ దేశంలో రిచారము అమాంతంగా రెండు ముక్కలవుతుంది. అదే నా అభిప్రాయం మామగారూ! శలవియ్యండి!

రాజా: (ఆత్మగతం) వీడు అసాధ్యస్పిండం. యితడి సహాయం లేనిదీ పనికాదు. మామ అని పిలవడం ఆరంభించాడు. యుగంధర రావ్రూ, నేనూ స్కూలులో చదువుకునే రోజులలో అన్నా, తమ్ముడూ అని పిలుచుకునేవారము. ఎదిగిన పిల్లలు గల తండ్రులను మామా అని పిలిస్తే మనస్సుకు కించిత్తు అనుమానం తగులుతుంది. యింట్లోచనువుగా తిరుగుతాడు. వద్దంటే బాగుండదు. ఎంతటివాడికైనా వీడినిచూస్తేసరదా. ప్రవర్తన చెడ్డదని వినలేదుగాని, వీడినాటకాలు, గారడీ చూడకుండా పిల్లని ఖాయిదాపెట్టాలి. వెధవపిల్లని మాత్రం యీవూళ్లో వుంచితే మాటదక్కదు. అన్నదగ్గరకు పంపించి వేతాము.

గిరీ: మామగారు! యేమిటి ఆలోచిస్తున్నారు?

రాజా: మరేమీలేదు, మీనాయినే యీ వ్యవహారంలో ప్రవేశిస్తే నీవు హాస్యాలు అడ్డులుమాని సహాయం చేతువు గద!

గిరీ: మా తండ్రి యే వ్యవహారంలో దిగినా ముందూ వెనకా చూడకుండా దిగేవాడు. తండ్రిగారు దిగినా నాకు తోచిన మాటలు చెప్పవలసినవాడనే.

రాజా: అయితే నీవంటి బుద్ధిమంతులు సంఘసంస్కారముకు మొనగాళ్లయి వుండిన్నీ బేసవబయిన మార్గాన్న పని

జరుగుతూ మనమంతా అన్యమతస్థులకు హాస్యాస్పదం కావడం నీకు మనస్కరించి యున్నదా? పెళ్లాడే కుర్రవాడు బ్రహ్మసమాజ మతస్థుడైనప్పుడు హిందూ శాస్త్రోక్తంగా పెళ్లి చెయ్యడం నీకు యుక్తమనే తోచిందా?

గిరీ: పెళ్లికూతురది యేమతమో ఆలోచించారా?

రాజా: మనలో స్త్రీలు అజ్ఞానులు; అస్వతంత్రులున్నూ. వాళ్లకి "గతానుగతికో లోకః" అన్నట్లు ఆచరణేగాని మత మంటూ వకటున్నదీ? క్రమంగా ఆపిల్ల భర్త మతం అవలంబిస్తుంది; ఇన్ యాటిసిపేషన్, మనం అందులో చేర్చవచ్చును.

గిరీ: కిరస్తానులు, తురకలూ, విధవావివాహం చేసుకుంటే హిందూసంఘ సంస్కారానికి ఎంతలాభమో బ్రహ్మసమాజం వారుచేస్తే అంతేలాభము. యింతకంటే సవరలు, కోదులు, గదబలు మొదలయిన కొండజాతుల ఆచారప్రకారం వివాహం కొంత వింతగానైనా వుంటుంది. వారలు సంతోషించడంకద మీకు కావాలసినది? కొండజాతుల ఆచారాలంటే తెల్లవాళ్ళు చెవికోసుకుంటారు. పేపర్లలో వ్రాసినా చదవతగివుంటుంది.

రాజా: (ఆత్మగతం) కర్ణపిశాచి వున్నవాళ్ళదగ్గిరకాని కీలుదాగవు. (ప్రకాశం) ఒక పాయింటు నీవు మరచిపోతున్నావు. హిందూ హిందూ అనేమాట తుడుపెట్టి సంఘసంస్కారమే ముఖ్యముగా ఆలోచించవలసి వుంటుంది. హిందూ అనే మాట చేర్చగానే మన ఉద్యమముల లాభము సంకుచితమవుతుంది. రాజకీయ వ్యవహారములలో అన్ని మతములవారమూ కలు

స్తున్నామా లేదా? యౌవ్వనవంతులైన వితంతువుల బ్రతుకు సుఖరహితము కాకుండా వుండడము సంఘ సంస్కారము యొక్క ముఖ్యోద్దేశముగదా. యేమతప్రకారమైతేనేమి? వారలు పెండ్లి చేసుకుని సుఖించుట, సంఘ సంస్కారము కాదా? బ్రహ్మసమాజ మతముకూడా హిందూమతము లలో నొకటని నా అభిప్రాయము. పుత్రప్రాయుడవు; కావలసిన వాడవుగనుక, నీతిసరామీద కించిత్తు సంఘసంస్కార రూపకమయిన లోకోపకారంలో దిగతలచితిని. నీకు భోజ్యపడడమునకు యిష్టము లేనియెడల యింతటితో విరమిస్తాను.

గిరీ : (ఆత్మగతం) బాణం గురిదాటిండె. మిగిలిపోనియ్యకూడదు. (ప్రకాశం) నేను చెయ్యబూనుకున్న సహాయము చేసి తీరుతాను. గిరీశం అన్నమాట తప్పినాడన్నమాట యీసర్కి పుట్టలేదు. భగవదనుగ్రహంవల్ల ముందయినా అలా అనుటకు అవకాశము కలుగకూడదు. వధూవరులను యిక్కడకు తెచ్చి దిగబెడతాను. గాని మామగారు పెట్టుతూవున్న బ్రహ్మసమాజ హిందూ వివాహ విధానముల కలహంలో నేను చెయిచేసుకోజాలను. సవబుకావలిస్తే నా స్వల్పానుభవమునుబట్టి చెప్పుతాను. ఎవడిమతం వాడికి సవబు. ఎదటివాడిమతం వాడికి బేసవబు. నిజమయిన సవబు స్వర్గంలోవుంటే వుండవచ్చును. మనిషికి మనసే సవబు. తత్వమాలోచిస్తే మనోవృత్తులు ముందు పసుగెత్తుతాయి. మాటకారి, సవబులు కలిపిస్తాడు. నిష్కల్మషమయిన మనస్సు, అవ్యాజమయిన భూతదయూవుంటే యే మతమయినా సమ్మతమే.

రాజా : మామా! నీమాటలు లేబరింతుల్లా కనపడుతాయి. మాటలనుబట్టి నీ మతం పోల్చడం శక్యంకాకుండావుంది. ఒకమాటు శాస్త్రంలో కర్రెత్తుతావు, మరచటి క్షణం శాస్త్రాన్ని తిరగదోసి సవబుకోసం కత్తితీస్తావు. ఆ నెంటనే లోకంలో సవబు లేదంటావు!

గిరీ : నామతం నాకే పోల్చడానికి దుస్తరంగా వుందను కుంటాను. మతం వుపాదివేసి కడతారనుకున్నారు కాబోలు మామగారు! యెండవేళ ఒకమతం, చల్లనివేళ ఒక మతం, కడుపు కాల్తూవున్నప్పుడు ఒకమతం, కడుపు నిండినప్పుడు ఒకమతం, అందులో అంబలి మతం, పప్పు నెయ్యి మతం, గోధుమకొట్టి మతం, మద్యమాంస మతం, యేరుకుతినే వాకపళ్ళ మతం, డబ్బిచ్చికొనే మామిడిపళ్ళ మతం, గడవడం గడవకపోవడాన్నిబట్టి అంతర్భేదాలుకలవు! అలిసివున్నప్పు డోమతం, వంటరిగావున్నప్పు డోమతం, అతివచెంతనున్నప్పుడోమతం! లంగరులేని నావలాగ మతం, మనస్సునొక్క శరీరమునొక్క స్థితినిపట్టి చెలిస్తూ వుంటుంది. కొన్ని వెర్రులుమాత్రం నాకు వున్నాయనుకుంటాను. మనసుకు మాటకు విడాకులయినప్పుడు, మాటునున్న మాట మార్కెట్టులో పెట్టాలనే పట్టులేని ఉత్సాహం ఒకటి; సూదంటురాయిని యినుమంటినట్లు మంచివాళ్ళు కనిపిస్తే వాళ్ళను అనుకొను స్వభావం రెండు; యెదిరించినవాడిమీద కయ్యానికి కాలుదువ్వడం మూడు; కష్టసాధ్యమైన పని తటస్థించి ఫలితం మంచిదని తోస్తే ముందు వెనుక చూడకుండా అందులో ఉరకడం

నాలుగు; లయిఫ్‌లోవుండే చమత్కారాలు వెలుక్కుంటూ పోవడం అయిను; తమవంటి పెద్దల శలవ్రప్రకారం నడుచుకోడం ఆయో మతం. అక్కడికి షణ్మతాలు స్థాపనయినాయి. ఇన్ని మతాలు ఒక్కచోటగూడితే ఒక తెన్ను యెలా వెళతాయి ?

రాజా : అందుచేతనే లోకం నువ్వు చెప్పినట్టల్లా వింటాము. అటువంటిమనిషివి నాబోంట్లుచెప్పినట్లు వినడమనేది వాత్సల్యసూచకం. ఆమాత్రం ఆసరా ఇచ్చావంటే నేనుకూడా సంఘసంస్కారానికి కించిత్ సహాయభూతుణ్ణి కాగలను. ప్రస్తుతాంశ మేమిటి ?

గిరీ : మీరు చేస్తానన్న ద్రవ్యసహాయము సెటిల్ కావలెను.

రాజా : రామూర్తికి మూడువందలరూపాయలు యిస్తా నన్నానే !

గిరీ : యెప్పుడు ?

రాజా : పెళ్ళిఅయిన తక్షణం !

గిరీ : బ్రహ్మసమాజమతప్రకారం వివాహంకాక శాస్త్రోక్తంగా అయితే ?

రాజా : బేసబుగాఅయిన పనిలో మనం సహాయభూతులం యెలా కాగలం ?

గిరీ : యే ప్రకారం జరిగినాసరే, ఇప్పుడు ఆ సొమ్ము చేతులో పడితేనే ముందు పనిజరగడం; లేకుంటే యిక్కడితో సమాప్తి.

రాజా : హౌడ్డు టర్న్స్ ! యు కెన్ ట్రస్టు మీ టు పే.

గిరీ : ఇమీడియట్ పేమెంటు విల్ ఆబ్జేవేటు ది నెససిటి ఫర్ ట్రస్టు; సమ్ మనీ హేజ్ టు గో యిన్ టు ది హెండ్స్ ఆఫ్ డైవర్స్ పెర్సన్స్ ఇన్క్లూడింగ్ ది బైడ్.

రాజా : కంసాలికూడానా?

గిరీ : లేదు !

రాజా : నీవు ప్రాజ్ఞుడవు! నీకు నేను బుద్ధి చెప్పవలసిన వాడిని కాను గాని, అనుభవాన్నిబట్టి చెప్పుతున్నాను. బ్రాహ్మణ సంఘసంస్కారంలో కంసాలివాడు అమాయకంగాను అనపేక్షగానూ కలుస్తాడంటే నమ్మవద్దు. యేదోవక ఘట్టి సామిద్రోహంచేసి మన పరువు తీస్తాడు.

గిరీ : నేను ఆ జాగ్రత్త పడగలను. అయినా జాగ్రత్త యీ వ్యవహారంలో అవసరంలేదు. మనం సంఘసంస్కారమని వీశడుమాట ఉపయోగించి, లోకాన్ని మూరెడెత్తు పెరిగించామని సంతోషిస్తున్నాం. కంసాలి, బాపనోళ్ళ కులం చెడుతున్నారుగదా అని ఆనందిస్తున్నాడు. అదినకటి మనకి సేఫ్ సైడ్ ! మరిబక శేమిటంటే రామూర్తి పెత్తండ్రి కొడుకు వెంకన్ననివున్నాడు. వాడియందు కంసాలికి పుత్ర ప్రేమ. ఆ వెంకన్నని తిన్నగా పెంచక వాడివంతు భూముల ఫలసాయంపెట్టి కొండుభొట్లు రామూర్తికి ఇంగ్లీషు చదువు చెప్పించాడని, మరికొన్ని కారణాలచేత కొండుభొట్లు మీద కోపం. తండ్రి రామూర్తికి మేనరికం కుదిర్చి వుంచాడు. ఈ విధవా వివాహం అయినట్టయినా మేనరికం తప్పిపోతుంది. ఆపిల్లని వెంకన్నకి పెళ్ళి చేయించాలని

అక్కాభర్తుడు కైరిచేస్తున్నాడు. గనుక భయపడ్డానికి అవసరం లేదనుకుంటాను.....పెళ్ళికి తర్లి మూడోనాడు రాత్రి యీవ్యూరికి పదకొండుమైళ్ళ దూరమునన్న చెరుకు వాడ సత్రంలో దిగుతారు. అప్పట్లో మీ గుర్రబ్బండీ సత్రం పెరటి గొబ్బరితోటలోవుంచి యీ కంసాలి హీక మత్ మీద వధూవరులను దాల్లోయెక్కించి రాత్రి వుండ గానే తమయింట్లో పెట్టాలి.

రాజా : కొంపతీసి మా యింటికే?

గంగా : (ఆత్మగతం) అమ్మగాకు, పంతులుగారికి, వధూవరులకు కూడా గోమయోదకస్నానం చీపురుగట్ట ప్రయోగంచేత ఉచ్చాటన వెంటనే చేస్తాను.

గిరీ : మీరు పబ్లీకుకు రాకూడదో? మామగారు యింతపిరికి అని నేను అనుకోలేదు!

రాజా : పిరికితనమా? యుద్ధానికి వెళ్ళమంటే వెళ్ళుతాను. సమయోచితమయిన జాగ్రత్తను పిరికితన మంటారా? కుర్రవాళ్ళబుద్ధి మిలమిల పరుగెత్తుతుంది. ముసలిబుర్రలు కొంచెం పస్తాయిస్తాయి. కార్యం సానుకూలం అయ్యే వరకూ పైకి రాకూడదు, వకటి; రెండవది, నా సహాయం కావలసినదిగాని, నాపేరు గొప్పకావడం నేను విలనగా యెంచను. మూడవది, మావంటివాళ్ళం సంఘంలో వుండి, మీ అభిప్రాయములను వ్యాపింపజేస్తే లాభంగాని, అంతా యేట్లోదిగితే లాభంలేదు. కొంతమంది మనవాళ్ళనిపించు కున్నవాళ్ళం గట్టుమీదవుంటే మనకేలాభం!

గిరీ : దానిపేరు ఇంగ్లీషులో క్రైమ్‌సర్వింగు అంటారు.

రాజా : మంచి అభిప్రాయములకు చెడ్డపేరు మహాసులభంగా యిస్తావు.

గిరీ : వధూవరులను మా యింట్లోపెట్టనా !

రాజా : (ఆత్మగతం) యితనియింట్లో పెడితే బట్టబయలవుతుంది. నలుగురూచేరి అంతా క్రెడిట్‌కోసం దేవులాడితే మన క్రెడిట్ సన్నగిలుతుంది. (ప్రకాశం) మీ యిల్లు సత్రవు. అక్కడ యేంజేసినా చిదంబరరహస్యం. ఈ వ్యవహారం మట్టుకు పెళ్ళిపీటలమీద ... లేదు కుర్చీలమీద కూర్చునే వరకూ వధూవరుల ఫలానావారని ఎవరికిన్నీ తెలియకూడదు. బ్రహ్మసమాజమతంప్రకారం పెళ్ళికావడమునకు ప్రయత్నం నేను చేసుకుంటాను. ఏదో వక విధవా వివాహం సిద్ధమైనదని నాయుడుగారితో చెప్పుతాను; గాని పేర్లు చెప్పను. తెలిసినదా ? బ్రహ్మసమాజపద్ధతివల్ల మరి ఒక ఉపయోగం కనిపెట్టాను. శాస్త్రప్రకారం అయితే మంచిముహూర్తం కనిపెట్టి పెళ్ళిచెయ్యాలి. మంచిముహూర్తందాకా వితంతువుని దాచివుంచడం దుర్లభం. ఈ లోగా బంధువులవల్ల చాలా తొందర కలుగుతుంది. బ్రహ్మసమాజం ప్రకారమయితే పిల్లవచ్చిన మర్నాడు సాయంత్రమే పెళ్ళి చేసివేయవచ్చును. నాకు తోచిన సలహా యేమిటంటే, మా బగీచాలో వధూవరులను ఆ రాత్రిపెట్టి .....

గిరీ : బాగుంది ! రూపాయిలో ?

రాజా : యివిగో ! (పెట్టెతీసి రూపాయిలిచ్చును)

గిరీ : ఛేంక్యూ. (నిష్క్రమించును.)

గంగా : (ఆత్మగతం) గాడిదకొడుకు ! యిన్నాళ్ళు ఆశ్రయించాను. నాకునెలకి యేడురాళ్ళు యిచ్చేటప్పటికి కళ్లనీళ్ళు పెడతాడు. యీ సెధవపెళ్ళికి మూడువందలు ఖర్చుపెడుతున్నాడు.

రాజా : శాస్త్రుల్లుగారూ! యీసంగతి మనవాళ్ళకితెలియనీకండీ. మీరు చెప్పాలి, నేను చెప్పాలి, మరి యెవరూ చెప్పరు.

గంగా : "ఘట్కర్ణాభిద్యతే మంత్రాని" అన్నాడు.

రాజా : గిరీశం చెప్పడు. లోగిట్లోవాళ్ళు ఆసమయంలో వుంటే మట్టుకు ఆబోరు దక్కదు. వాళ్ళు పుట్టింటికి పంపించమని సంవత్సరమై తొందరచేస్తున్నారు. ముహూర్తం ఈలోగానే కుదిర్చి, మీరు తీసుకునివెళ్ళి దిగబెట్టండి !

గంగా : మీరు విధవావివాహంలో కలుస్తే బహిష్కారం అవుతుందే !

రాజా : యింతేనా నామంత్రశక్తి శాస్త్రుల్లుగారు? చూశారూ బ్రహ్మసమాజమతంప్రకారం పెళ్ళి అయితే మనంచేసే సహాయసంపత్తివల్ల బాధకంలేదు. పెళ్ళిసమయంలో వెళ్ళి టిఫెన్ పుచ్చుకున్నా, కిరస్తానులు. తురకలవద్ద పుచ్చుకున్న ట్లేగాని అంతకన్న తప్పు పట్టడానికి అవకాశంలేదు. క్షీరం కలిసినందువల్ల కాఫ్యాదులు చెండాల హస్తంలోనుంచి ఆరగించవచ్చును.

గంగా : బోధపడ్డది !

(తెర)

తృతీయరంగము

(కంసాలి దుకాణం : అక్కాభత్తుడు, వెంకన్న ప్రవేశించును.)

అక్కా : వెంకన్నా ! పంతులు చెడిపోతున్నాడు. దాని శాస్త్రలు బహుఅక్రమంగా వున్నాయి. మీ బాబు మంత్రతాంగంవల్ల యవను బాగుపడ్డాడు ?

వెంక : మాబాబు యేంచేశాడు ?

అక్కా : యేం చెయ్యలేదు. సానిదానికి సరసుల్ని తార్చి డబ్బు సంపాదిస్తాడు. పంతులుకి రత్నంవంటి పతివ్రత అయిన భార్యావుండగా దీనిమాయలలో దింపేశాడు.

వెంక : పంతుల్ని మీరు బాగుచెయ్యరాదూ ?

అక్కా : మీ బాబుమంత్రతాంగంమీద మనబుద్ధి లెక్కవు. గాని పంతులు కంటిమసక వదలడానికి వకమంచు చెప్పితాను, చెయ్యి !

వెంక : నేను వైద్యుణ్ణికాను.

అక్కా : మందనగా వుపాయము ! ఈవేళ పంతులు తండ్రి తద్దినం. అంచేత మంజువాణియింటికి రాత్రి యీ సమయము చూసి కొండుభట్లు తోళ్ళసాయబుని మంజువాణి యింట్లో ప్రవేశపెట్టబోతున్నాడు. నువ్వు తిన్నగావెళ్ళి యీమాట, పంతులుగారితోచెప్పి పదకొండుఘంటల ప్రాంతాన పెరటిగోడ గెంతి అమాంతంగా లోపలికి వెళ్ళమను. నేను వీధిగుమ్మం తలుపు గొళ్ళెంపెట్టుతాను.

వెంక . తురకాడుంటే పంతులు కేమి?

అక్కా : చూస్తూగాని నీకే తెలుస్తుంది !

(తెర)

చతుర్థరంగము

[మంజువాణి యిల్లు : మంచంమీద కూర్చుని, హుక్కా పీలుస్తూ పాషాబుగారు, కింద తివాసిమీద కూర్చొని కొండుభొట్లు]

పాషా : క్యా! దేర్ హోతా జీ

కొండు : పోషక్ బనాతే మహారాజ్.

పాషా : రాత్ బూహుత్, హోగయి. థోడా వేదం బోలో జీ.

కొండు : (ఆత్మగతం) తురక వెధవ వేదం చదవమంటున్నాడు.

(ప్రకాశం) పాషాబుగారు వచ్చారు
మహాదొడ్డవారునై !
మడదుక్కలాగ పున్నారు,
గొడ్డుమాంసము తిందురు !
లెంపకాయ ఆచి కొట్తేను,
దవడపళ్లూడిపోవును ఇత్యమరః ॥
పాషాబుగారు వచ్చారు,
మహాదొడ్డవానునై !
మోటవా రేమిచేస్తారో
భయంవేయుచున్నది !
గంజాయిపీల్చు మార్గాన,
వొళ్ళు తెలియక యుందురో ఇత్యమరః ॥

దాసీ : (ప్రవేశించి కొండుభట్లు చెవిలో) సాయిబుకు తెనుగు వచ్చునా ?

కొండు : వక్క అక్షరంరాదు. రెండునెలలు కాలేదు ఢిల్లీ నుంచి వచ్చాడు.

సాహే : ఫిల్మీ క్యా బోల్తే జీ.

కొండు : ఫిల్మీ బద్మాకె ఆప్ భాయి బంధు కర్కె బోల్దియా.

సాహే : (లేచివచ్చి వెన్నుమీద గట్టిగా చరిచి) తు అచ్ఛా బొమ్మన్ హై.

కొండు : చచ్చానురోయి నీ అమ్మానిగతరగా.

మంజు : (తెరవతలనుంచి) సాయిబుని వెళ్లిపొమ్మను. వెధవ కసాయివాడిలా వున్నాడు. తోళ్లవాసన కొట్టుతున్నాడు.

సాహే : క్యా బోల్తే జి?

కొండు : పేట్మె దరద్ హై కర్కె బోల్తే.

సాహే : ఝూటా బాత్, దగాక ర్తెతో తుమ్కు-మార్తె (అని ముష్టి యెత్తును.)

కొండు : వాణ్ణి పొమ్మన్నమాట
చెప్పుజాలనువై ।
తుగకః కరకశ్చైవ
ధ్వావేతౌ మలమోచకౌ ।
తురకాడు కరక్కాయ
పేరుచెప్తే విరోచనం ।
నీవు రాకుంటె వీణ్ణుంచి
యింటికి మెల్లిగానువై ।
జారిపోతాను లేకుంటే
నాకిక్క డాబోరుదక్కదు ।

సాహే : కంచన్ క్యా నై ఆతే జీ?

కొండు : అభి ఆతే మహారాజ్!

మంజు : గదిలో కూచుని తలుపు గడియ వేసుకున్నాము లే,
నేనూ వెంకీని ! సాయిబుని పైకిగెంటెయ్యి; లేకుంటె వాడి
చేత తాపులుతిను !

కొండు : ధర్మంకాదిది మంజువాణి వినుమా ! (శ్లోకం వలె చదువు
తాడు)

దాగుంట, ధైర్యంబు నీ
వవలంబించియు పైకివచ్చి మరియున్ ।
ప్రాణంబు దక్కించుమా
లేకుంటే నిట దీపమార్పి మరియున్ ।
నీకొంప కగ్గిటుదున్
నీవు స్నీచెలికత్తెకూడ గదిలో
చిచ్చెట్టి చస్తారువై ॥

సాహే : బహుత్ అచ్ఛా గాతే జి (అని తిరిగి కొండుభట్లును తట్టును)

మంజు, వెంకి : యెవళ్ళిరో నీచిలోను ? (అని గొంతెత్తి అరచును)

సాహే : క్యా గడ్‌బడ్ జీ ?

కొండు : యే ఘర్‌మే ఏక్‌బడా బ్రహ్మ రాక్షసి కహాతే
బడాబొమ్మన్ సైతాన్ హై.

సాహే : సైతాన్ గియితాన్ మార్దేతే (అని కర్ర సవరించును)

పంతులు : (తల విరబోసుకుని చేతిలో లాఠీ పట్టుకుని కోపముతో)
ముండా ! మంజువాణి (అని తొందరగా ప్రవేశించును)
(కొండుభొట్లుని చూసి) వెధవ ఫకీరు వెధవ ! నువ్వుండేనా,
యీ దౌర్జన్యం చేస్తున్నాన్ను (అని కొండుభొట్లును కర్రతోకొట్టును)

సాహే : యే హై బొమ్మన్ సైతాన్ ?

కొండు : హైహా మహారాజ్.

సాహే : (కర్రతో రెండుదెబ్బలు పంతుల్ని కొట్టేసరికి పంతులు చతికిల బడును)

కొండు : (వీధితలుపు లోపల గడియతీసి తియ్యబోతే రాదు) యెవడో తలుపుగొళ్ళెం వేశాడురోయి! పెరటితోవని పోదామంటె అడ్డంగా తురకాడున్నాడు ! యిఖనేమి సాధనం (ఆత్మగతం) దీపం ఆర్పేస్తే పంతులు పారిపోతాడు. (దీపం ఆర్పేసి సాహేబుమీద, పంతులుమీద బిందెతో నీళ్ళు విసురును.)

సాహే: అరే! బహుత్ బడా సైతాన్ హై. యహాసె చల్జానా (వీధితలుపు తియ్యబోగా రాదు. తలుపు బలాత్కారంగా తీసి వెళ్ళిపోవును.)

(తెర)

పంచమరంగము

[అక్కాభత్తుడి యింటి అరుగు : వెంకన్న, కొండుభట్లు, అక్కాభత్తుడు ప్రవేశించును]

కొండు : సాయిబు పంతుల్ని చావగొట్టేడు.

అక్కా : యెక్కడ?

కొండు : మంజువాణి యింట్లో.

అక్కా : మీరెందుకున్నా రక్కడ !

కొండు : పంతులుగారింట్లో ఆడవాళ్ళకు పురాణం చెప్పి వస్తూండగా మంజువాణి యింట్లో గడబిడ అవుతూవుంటే తొంగిచూశాను.

అక్కా : అయితే యేం చెయ్యమంటావు? కనిష్టీబుల్ని పిల్చుకువెళ్ళదాం.

కొండు : వొద్దుబాబు! లేనిపోని అల్లరిచెయ్యకండి! తమరు దయచేసే చాలును.

అక్కా : తురకాడు నాకు దేహశుద్ధి చేస్తే?

కొండు : వెళ్ళిపోయినాడు!

అక్కా : కొండుభొట్లుగారు! లాంతరు తెండి, నేను చేతికర్ర పట్టుకువస్తాను.

(తెర)

షష్ఠమరంగము

[పంతులు మంచమును జారబడి జాపోయుచుండును; అక్కాభర్తుడు చేతికర్రయు, వెంకన్న, లాంతరును పట్టుకొని కొండుభొట్లు ప్రవేశించును]

అక్కా : యేమిటండి పంతులుగారు?

పంతులు : ఏమీ లేదండి ... ... శాస్త్రుల్లూ! వీడ్నెందుకు తీసుకొచ్చావు?

కొండు : సాయిబు మళ్ళావస్తాడ్లేమో అని భీతాహంచేత తీసుకొచ్చాను.

పంతులు : సాయిబు యింగువ అమ్మకానికికాదూ వచ్చాడు?

కొండు : వెధవ అందుకే వచ్చాననన్నాడు. (మెల్లిగా) సానివాళ్ళ మాయలు నాకేం తెలుసును.

అక్కా : ఎందుకట్టే చర్చ పంతులుగారు! యిక్కడవుంటారా? యింటికి వస్తారా?

పంతులు : యిహేందుకు యిక్కడ? యింటికి వెళ్ళిపోతాను!

మంజు : (పంతులు వెనుకనుంచి ప్రవేశించి) అక్కాభత్తుడుగారు మీరు వెళ్ళిపొండి!

పంతులు : (కుంటుతూ చేతకమ్మి తీసి) ఆ యింగువమ్మో తురకాడి కోసమేనా యీ ముస్తాబంతా? (అని కమ్మితో మంజువాణిని కొట్టును)

అక్కా : (పంతులు కొరడాచెయ్యి పట్టుకుని) శాంతించండి పంతులుగారు!

మంజు : (చేతిలో కొరడా లాగికొని రెండవ జెబ్బ తనచేత్తో పట్టుకొని) పంతులుగారు కారు వీరు! అమ్మవారు; ఆడవాళ్ళమీదికి శూరులు! సాయిబుదగ్గిర లేకపోయిం దీపౌరుషం! నేను వేశ్యను; నావృత్తిధర్మం నేమానను; మీయింటోవున్న సంసారి వేశ్యని ఖాయిదాపెట్టుకొండి!

పంతులు : యేమిటి పేలేవ్రూ! చూడు! (అని పెనుగులాడును)

కొండు : ఊఁ! (ఊరుకొప్మని మంజువాణికి సౌంజ్ఞచేయును.)

మంజు : పంతులుకి యింకా గీటణగలేదు. వెంకీ! యిక్కడే వీధిలో వుంటాడు తీసుకురా.

వెంకన్న : పిలవమన్నావా యేమిటి?

కొండు : వెధవాయ! వ్రూరుకోవోయి. సాయిబు మళ్ళీనస్తే చంపేస్తాడు. పంతులుగారు దయచెయ్యండి. (అని పంతులు చెయ్యిపట్టుకుని లాగును. పంతులు కొండుభట్లు గుమ్మము దాటు తూండగా చురచుర చూస్తూ మంజువాణి పంతులు వీపుమీద ఒక దెబ్బ, తిరిగిచూసిన కొండుభట్లు వీపుమీద ఒకదెబ్బ వేసును)

(తెర)

సప్తమరంగము

[కొండుభట్లు యిల్లు : అరుగుపొద బిచాణా పరుచుకుని కొండుభట్లు కూర్చుని వుంటాడు]

కొండు : (పొడుంపీల్చి) ఇవాళ యేమి ప్రమాదాలు వచ్చాయి. పంతులు కొట్టిన దెబ్బకి బొటబొట రక్తంకారింది... గాడిద కొడుకు... నిద్దరపోతే తురకాడు కల్లో వస్తాడేమో అని భయంగా వుంది. "రామం, స్కంధం, హనుమంతం, వైనతేయం, వృకోదరం, శయనే యస్మ్రేన్నిత్యం దుస్స్వప్నం తస్య నశ్యతి." (నలుదిక్కులా కలయజూచి పడుకొనును.)

(ప్రవేశం : సాహేబు)

సాహే : ఉఠో జి.

కొండు : (ఆత్మగతం) ఓర్నాయన సాయిబుకాబోలు !.....
నిజమా కలా ?

సాహే : ఉఠో జీ (అని గట్టిగా వెన్నుమీద చరుచును.)

కొండు : (లేచి) చంపేశావు !

సాహే : కంచన్ ఘుక్కా ఫిర్ చల్నా ఆవ్.

కొండు : ఆహా...హాహా...హా...ఖుదా వంద్ కంచన్ ఘుర్నే బడా బొమ్మన్ సైతాన్ హై హమ్మే డర్తే.

సాహే : కూచ్ ఫర్వా నహీ. బొమ్మన్ సైతాన్‌కు మార్ దేంగే.

కొండు : హమ్మే బొమ్మన్ హై కంచన్ ఘుర్కా చల్నా బొహుత్ దోష్ కర్కా అమార శాస్త్రమే హై.

సాహే : తుమ్‌కు కోన్‌సి శిఖాయ ?

కొండు : అమారా బాప్ శిఖాయ.

సాహే : ఆజ్‌తక్ ఆప్ కంచన్కూ ఘుర్ నై చేల్తే

కొండు : కంచన్‌కు ఘుక్కూ కభీ నై జాయెగ

సాహే : అయిసా తో తుమారీ దేవత్ సే ప్రమాణ్ కరో

కొండు : (ఆత్మగతం) ఘోరప్రమాణాలు చెయ్యమంటాడు. యవరిశక్యం ? కందులగూనలో కాసులు యెవడు వొదులుకోగలడు ? వీధిలో చడి అవుతూంది. ఓ కేక వేస్తునా !

సాహే : ప్రకార్ కరేతో గలా కాట్ దేంగే. (అని గొంతుకు చేత్తో పట్టుకొనును)

కొండు : (ఆత్మగతం) మనస్సులోమాట మనస్సులో వుండగానే పోలుస్తాడు. మనిషికాడు దెయ్యం అనుకుంటాను. (ప్రకాశం) యిదిగో! జండెం పకడ్కో శపథం కరేంగె! హం కంచన్కూ ఘుక్కూ నై జాయంగే. దేఖోజీ డర్తె హమ్కూ బుఖార్ ఆయ. (అని చెయ్యి చూపును)

సాహే : అచ్ఛా ! కభీ కంచన్కే ఘుక్కూ జాయేతో గల్లా కాటేగా. (అని నిష్క్రమించును)

కొండు : చలీవొణుకూ వచ్చాయిరా బాబూ !... పార్వతీ ! కుంపటితేవే ! కుంపటి కుంపటి కుంపటి...(అంటూ నిష్క్రమించును)

(తెర)

అష్టమరంగము

[కొండుభట్లు యిల్లు : రాత్రి భోజనంచేసి బట్టలు కట్టుకొని పైకి వచ్చి గుమ్మం అవతల నిలిచి]

కొండు: తురకాడిదెబ్బ పదిహేనురోజులు మంచం యెక్కించింది.....మంజువాణి ఫికర్లేము. ఇన్నాళ్లు ఆశ్రయించి యెంతో సహాయసంపత్తి చేసినాను. శాస్త్రులుగారికి యెలావుందని మాటవరసకయినా వర్తమానం పంపించలేదు. పంతులుకూడా అదేపద్ధతి అవలంబించాడు. మంజువాణ్ణి వదలివేసి ఏకపత్నీవ్రతుడయినాడుట! దెబ్బకి డెయ్యం వెరుస్తుందన్నాడు! ...గాడిదకొడుకు నన్ను కొట్టాడయ్యా! యీ సర్కి గాయం మానలేదు. వీళ్లు మా గడపలోకి రావద్దంటేమాత్రం, కందుల గూనలో కాసుంటికి కామమ్మ సరసాలకీ దూరమైపోతాం? మంజువాణికి యేమిటి అపకారం చేశాను. ఒక్క తుమ్మలపాలెంవాడు డబ్బియ్యకుండా వెళ్లిపోయినాడు అదొకటిన్నీ ..... సాయిబు కొంచం భయోత్పాతం చేశాడు. తలుపుకిమాత్రం కించిత్తు మరామత్తు తటస్థించి వుండవచ్చును. అయితే ఆఅల్లరి తురకాడు చేసిన దేహశుద్ధితోటి పంకులు ప్రాపకం పడిపోయిందని కోపంవుంటే వుండవచ్చును. పైపత్యంలో వున్నాను. యింకా దేహానికి జవసత్వంరాలేదు. తొందరపాటు మనిషి...కమ్మా తిరగేసిందంటే మళ్లా మంచం యెక్కాలి. కుజ్జువాడి పెళ్లి వ్యవధిలేదు. కందులగూనలో కాసులు చేతపడితేనేగాని పప్పుడకదు. యేమిటి సాధనం...మరేమిటీ లేదు. తిన్నగా వెళ్లడం, యెవరూ చూడకుండా లోపల్రవేశించి తటాలున

దీపం ఆర్పివెయ్యడం; కందుల గూనదగ్గిరకు ఒక్కడాటువేసి కాసులపొట్లాం సంధించుకుని ఆంజనేయులులాగ పైకిలంఘించడం...వెళదామా? తురకాడితో సానింటికి వెళ్లనని చెప్పానే...నెభవ చూడొచ్చాడా యేమిటి? వాడికదే తనుపా? గొడ్డును కోసుకు తినేవాడు! సర్వాంతర్యామా యేమిటి? తోళ్ళకొట్టు మేడతలుపు తాళంవేసివ్రంది. సాయిబు ఫూళ్ళోలేడు. ఆచుట్టుపట్ల యెంతోసేపు నిలబడ్డాను. హుక్కా పొగవాసన రవ్వంతయినా కనపడలేదు. "పర్వతో వహ్ని మస్తమాత్, ధూమాత్" అన్నాడు. ధూమం లేక పోతే అగ్నిలేదు. అషువలెనే హుక్కాధూమం లేదనేషటు వంటి కారణంచేత అగిరాముడనే సాయిబుగూడా నాసి యితి సిద్ధాంతః ("కబ్దార్ అని ఒక కేక వినబడును) ఓరిదేవుడో రోయి, నాయినా! తురకాడి గొంతుకలాగ వినపడుతూంది. ఫూళ్ళోలేని, తురకాడిమాట యిక్కడి కెలా వచ్చింది? 'వందేమాతరం' గుంటడెవడో కేక వేసెవ్రంటాడు. ...అంతే...అదే నిజంకాని వొళ్ళు...కొంచెం కంపరం పుచ్చుకుంది. శబ్దం విని భయపడితే మరేం పౌరుషం? శబ్దగుణం, ఆకాశం. ఆకాశం నిరవకాశం; శబ్దం వట్టిమిథ్య. మిథ్య...మిథ్య...మిథ్య...అనగా యేమీ లేదన్నమాట! (నాలుగడుగులు నడిచేసరికి కపర్దార్ అని తిరిగి వినబడును) మళ్ళీ వచ్చిందిరోయి ధ్వని! వణుకు పట్టుకుంది. అయితే ఏంచేతాం! యీ శబ్దానికి భయపడి రెండుమూడుపందలకూపాయల సొమ్ము వదులుకుంటానా! తురకాడు వస్తే యేంచేస్తాడు! యింగ్లీషుబావుటా చల్లగావుండాలిగాని! చెయి చేసుకున్నా

డంటే తురకాణ్ణి పోలీసువారికి వప్పచెప్పుతాను. "కబడ్డార్" అప్పుడు తెలుస్తుంది! యెందుకైనా మంచిది. ఆంజనేయ దండకం చదువుతూ ఒక్క విసురున వెళ్ళానంటే అన్ని భయాలూ పటాపంచలైపోతాయి...(శ్రీమన్మహా అంజనీ గర్భసంభూత సదాబ్రహ్మచారీ కపీంద్రాదివంద్యా కిరీటో జ్వలద్రత్న...(మంజువాణి యింటి గుమ్మందగ్గిర నిలిచి మెల్లగా తొంగి చూచి) సావిట్లో యెవరూ లేరు; సావిడి గదిలోనూ లేరు. (మెల్లగా దీపం ఆర్పేసరికి గభీమని వీధితలుపు గడియ వేసిన చప్పుడగును) చంపేశాడ్రోయి, సాయిబు!...మంజువాణీ! బ్రహ్మహత్య జరిగిపోతూంది!

మంజు: మళ్ళీ సాయిబుని తీసుకువచ్చావు? యిదిగో కందుల గూనవున్న గదిలోనికి వెళ్ళి గడియవేసుకుంటున్నాను. బ్రహ్మహత్య జరిగితే స్వయంకృతాపరాధంగాని పాపం మూదికాదు!

కొండు: తురకాడి కమ్మిచ్చెబ్బలు తప్పించుకోవడం కష్టంగా వుంది. బ్రహ్మహత్య జగిగిస్తే బ్రహ్మరాక్షసినై పీక్కుతింటాను.

మంజు: కంసాలి వీరనాభాచారిచేత మారణహోమం చేయిస్తాను.

కొండు: అంతటిదానవగుదువు. (ఆత్మగతం) కిందటిమాటులాగ కేకైనావేతునా, యెవరయినా వస్తారు!

మంజు: "ధర్మంకాదిది మంజువాణి వినుమా దాగుంట"

కొండు: నువ్వూవాడితో కలిశావు. సాహెబ్ అభీ ఛోడ్ తో కభీ ఫిర్ నై ఆయంగె.

సాహె : బొమ్మన్ బాత్ ఝూటా బాత్ (కళ్ళు చప్పుడు చేయును)

మంజు : దీపం యెందుకు ఆర్పేశావు. ఇదిగో దీపం తెస్తున్నాను. ధైర్యం అవలంబించండి.

కొండు : చీకట్లో కొరడా దెబ్బలు తప్పించుకొంటున్నాను. దీపం మాత్రం తేకు; ధర్మాత్ములారా లివి. వీధి తలుపు మట్టుకు తీసెయ్యి.

మంజు : (దీపం పట్టుకువచ్చి సాయిబు వైనకి నక్కి) శాస్త్రుల్లుగారు ! మంచంక్రిందనుంచి విజయం చెయ్యండి !

కొండు : సాయిబు, సైతానా ? నిజమైన మనిషా ?

మంజు : పైకివస్తే మాట స్పష్టమవ్వతుంది.

కొండు : సాహేబ్. సాహేబ్. కంచన్ ఘుర్కు కభీ నై జాయంగే.

సాహే : సాలా ! ఝూఠ్‌మే తుమ్ రహ్‌కర్ మేహెర్ చోడ్తేంగే.

కొండు : (ఆత్మగతం) వీడిదగ్గిర యష్టినీ వుందిరోయి నాయనా! అన్ని రహస్యాలూ వీడికి వెల్లడే. గూనలో కాసులు దొబ్బింది. ఈ గండం గడుస్తే డబ్బుమాట చూసుకుందాం. (ప్రకాశం) మహారాజ్ లీజియే ఆప్‌కా పాం పకడ్తే

సాహే : బొమ్మన్ పాం పకడ్తే

కొండు : సమయంవస్తే గాడిదకాళ్లు పట్టుకోమన్నాడు. ఏం చెయ్యను !

సాహే : అచ్చా గులామల్లీ దర్వాజా ఖోలో, దేఖ్‌కర్కే చెలో

కొండు : (చెవలపిల్లిలాగ మంచంకిందనుండి జరిగి కుప్పించును. పరుగెత్తుటలో గుమ్మం తగిలి జారిపడును.) కందులగూనా యెంత చేస్తివే?...

(తెర)

'కొండుభట్టీయము' వ్రాతప్రతి :

అముద్రిత భాగాలు

* ప్రథమాంకము

ద్వితీయరంగము

[మర్రివలస రెయిల్వేస్టేషను]

(రెయిలుబండీ యింటర్‌మీడియెటు క్లాసులో శంకరశాస్త్రి చుట్ట కాలుస్తూ కూచుని వుండును. కొండుభట్లు యింటర్‌మీడియెటుదగ్గిరకు వచ్చి కిటికీలోంచి తొంగిచూసి)

కొండుభట్లు : ప్రభువ్వారా?

శంకరశాస్త్రి : యేంకావాలి?

కొండు : (మొహాన్ని ఆనందం నటిస్తూ) ప్రభువ్వారి దయా, ప్రభువ్వారి దర్శనమూ, అంతకన్న మాబోట్లకేం కావాలి?

శంక : లోపలకి రండి.

కొండు : మా తలా ప్రభువ్వారు కూచునే బండిలో కూచోడానికి!

శంక : వషట్కారాలు మాని లోపలికి రావయ్యా

కొండు : ప్రభువ్వారి శలవైనతరువాత రాక తీరుతుందా (యెక్కి-కూచుని) "రామహరే! కృష్ణహరే! తవనామ వదామి సదా

---

* అచ్చుఅయిన ప్రతిలో యిది ద్వితీయాంకములోని షష్ఠమరంగము. అందు త్రివిక్రమరావూ, యింగు శంకరశాస్త్రి ఒకరే. మంజువాణిని గురించి వున్న యింతవిపులమైన భోగట్టా, అచ్చుప్రతిలో కానరాదు. సాహిత్య పరిశోధకులకు మహాకవి వ్రాసుకున్న ఈ 'నోట్సు' ఉపయుక్తం కాగలవనే అభిప్రాయంతో వాటిలో కొన్ని ప్రధానకథావిశేషాలను, గమనాన్నీ తెలిపే ముఖ్యభాగాలను యిందు పొందుపరుస్తున్నాము; అచ్చుప్రతిలోని త్రివిక్రమరావుకీ, ఈ నోట్సులో వున్న శంకరశాస్త్రికీ గల వ్యత్యాసమూ, ఆపాత్ర యెలా మారుతూ వచ్చిందీ చదువరులు గ్రహించగలరు.

మురహరే! కృష్ణ కేశవ వాసుదేవ గజేంద్రవంద్య దయా నిధే! కృష్ణ...చంచలాం" యిటునైపు వేంచేస్తున్నారు? యేదైనాకథ వుందా యేమిటండి?

శంక: కథకేవుంది. నేను మంచి అప్సరసలాంటి విధవనుగాని, బుద్ధిమంతురాలైన భోగందిగాని చొరికితే పెళ్లాడదలిచి వున్నాను. మీ అభిప్రాయమేమిటి?

కొండు: ఆ రెండుపద్ధతులూ మన శాస్త్రాలూ, పురాణాలూ వొప్పుకున్నవే. యెంతమంది పురుషులు అప్సరస్త్రీలను వరించి సంతానం పొందలేదు. ఆ సంతానం వంశకర్తలు కాలేదా?

శంక: మీరు యాజ్ఞికం చేయిస్తారా?

కొండు: ప్రభువ్వారిదయ అంటూవుండి యీ బీద బ్రాహ్మణి పోషిస్తే యాజ్ఞికం తప్పక చేస్తాను.

శంక: పురోహితుడు కుదిరాడు; యిహ వధువు కుదరవలసివుంది.

కొండు: అది కొంచెం చిక్కైన సంగతె. తమవంటి చదువు కున్నవారు కొందరు యీనాడు అప్సరస్త్రీలను పెళ్ళాడడ మును అభిలషించివున్నారు. తమరసికత, తమప్రాజ్ఞతా వెయ్యినోళ్ళ పొగడవలసివున్నది; గాని రూపసీ గుణవంతు రాలూఅయిన వేశ్యను పెళ్ళాడడానికి వొప్పించడంఅసాధ్యం. "మిక్కిలిదొక్కము లియ్యక చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ" అన్నాడు. కురూపులూ, దరిద్రులూ తలపడవచ్చు. తమవంటి రూపజితమన్మధులకు కోరిన స్త్రీ అంటే యెత్తుకు యెత్తు బంగారవించి కొనాలి.

శంక : యెక్కడైనా వుందా అలాటిమనిషి?

కొండు : ప్రభువ్వారి దగ్గిర దాచడం యెందుకూ? మావూళ్లో వుంది; ఒక వేశ్యకన్య. రంభా, ఊర్వశీ, తిలోత్తమా దానికి దిష్టి తీయడానికి పనికిరాము. పన్నెండేళ్ళు వొచ్చేదాకా నేనే పెంచి విద్యచెప్పి రామసానికి వప్పజెప్పాను.

శంక : మీరా పెంచారు.

కొండు: అహా అనగా అదినొక సత్యాన్రులపిల్ల. కరువు కాలంలో పోషించలేక తల్లి మాయింట దిగబెట్టి వెళ్లింది. మా యింటిఆవిడ ఆరుసంవత్సరములు దాన్ని తనకూతు ర్లాగ మాపిల్లలతోపాటు పెంచింది. యింతట్లో కళత్ర వియోగం సంభవించగానే యీపిల్ల యేస్థలంలోవుంటే దేదీప్యమానంగా ప్రకాశిస్తుందో, ఆస్థలంలో వుంచాలి గాని యెవరయ్నా దుక్కి-ముచ్చుకు. కట్టబెట్టడం దున్న పోతుకు పువ్వులదండ వెయ్యడం అని తలచి, రామసాని తరిస్పీదులో పెట్టాను. తమరుగాని ఒక్క-పూట మావూళ్లో దిగివుంటే ఆ చిన్నదాన్ని చూసి ఆనందింతురుగాని. ఆ భోగందానివంటిరూపసిని ప్రభువువారు యేనాడైనా యెక్క-డైనా చూసివుంటే నేను బుర్రగోరిగించుకు వెళ్లిపోతాను.

శంక : మీ వూరేవూరు?

కొండు : సీతారాంపురం.

శంక : సరే. గాని వేశ్యావివాహం శ్రేష్టమా, విధవా వివాహం శ్రేష్టమా?

కొండు : (పాడుం పీల్చి) గట్టిప్రశ్న అడిగారు. శ్రేష్టంఅంటే వేశ్యావివాహమే. యేమంటే వివాహమన్నది శృంగారం అనుభవించడానికి. ఆ శృంగారమనే విద్యను కూలంకషంగా నేర్చిన శ్రోత్రియులనుపెళ్ళాడడం శ్రేష్టంగాని, పాపం పుణ్యం యెరగని బాలవిధవల్ని పెళ్ళాడడం యేమి స్వారస్యం?

శంక : శాస్తులుగారూ! మొగలాయి రాజ్యానికి దివాన్గిరీ చేయగలిగిన బుద్ధి మీకుంది.

కొండు : తమవంటి ప్రభువుల ఆశ్రయంవల్ల యుక్తాయుక్త విచక్షణ కొంచెం నేర్చాను. అంతేగాని నేననగా యేపాటి వాణ్ణి. నేను మనవిచేసిన వేశ్యఅంటే...

శంక : యేంలాభం. పెళ్ళాడడానికి అంగీకరించదని మీరే శలవిస్తున్నారే.

కొండు : ఆమాట నిజం. బంగారాన్ని మలామాచేస్తే యేమో. శలనైతే ప్రయత్నంసాగిస్తాను. మంత్రానికి అసాధ్యవన్నది వుండగూడదు.

శంక : అంతసామ్ము విరజిమ్మనేల. అంతంత అసాధ్యం ప్రయత్నించనేల. తమదృష్టిలో గుణవతీ రూపవతీ అయిన విధవ యెవరూ లేరా?

కొండు : (ఆలోచించి) వుంది. అదిమాత్రం అనగానే అవుతుం దనుకున్నారా ప్రభువ్వారు? అదీ ద్రవ్యసాధ్యమే. ప్రభువ్వారు శలవిచ్చిన విషమపరతులు అలాంటివి.

శంక: నేనేం విషమషరతులు కోరలేదే!

కొండు: రూపం గుణం ఆవశ్యకంగద. బొడ్డూడని పిల్లలకీ, కుచూపులకీ పురుషసూక్త పారాయణ అయితేగాని కుదరదు గదా. యెదిగిన రూపవతి గుణవతిఅయ్ని పిల్లకు వేలకొద్దీ యిస్తేగాని కుదరదు. చూశారా సద్యోశ్లలం.

శంక: వెధవలికికూడా శుల్కమే.

కొండు: గుణవతి కావాలి, రూపవతి కావాలి అంటే ఆ మాట మనవిచేశాను. ఆ రెండూ వొదిలేస్తే మీచిత్తం. కన్ను గీటేసరికి వెంటబడే ముండలు వున్నారు.

శంక: నిజంగా గుణవంతురాలైన విధవ యెవరైనా మీ వూళ్లో కద్దా.

కొండు: కద్దు. మా బంధువురాలే వొకర్తెవుంది.

శంక: యెవరు?

కొండు: ప్రభువ్వారిదగ్గిర దాపరికం యెందుకు. నా మేన గోడలే వొక రత్నంలాంటి కన్యవుంది. నాతో మాబసకి దయచెయ్యండి. చిత్తగిత్తుగాని.

శంక: అవశ్యం.

ప్రథమాంకము

* చతుర్థ రంగము

(రెయిలు ట్రేషను)

(రెయిలు వెళ్ళిపోయినది. యిటూ అటూ ఒకరిద్దరు కళాసులు తిరుగుతుందురు. బెంచీమీద శంకరశాస్త్రి, రామమూర్తి కూచుందురు)

శంక : నన్నెరగనట్టు నటించు. రహస్యం భేదించకుండా నటించాలి.

రామ : యెందుకేమిటండి ?

శంక : మీతండ్రి అసాధ్యుడు. నిన్నుగురించి యెంతో విచారిస్తున్నాను.

రామ : ఆయనతో పరిచయం చేశారాయేమిటి ?

శంక : చేశాను. ప్రిన్సిపిల్ను బొత్తిగాలేవు.

రామ : అంచేతనే నేను సిగ్గుతో చచ్చిపోతున్నాను. తలుచుకుంటే కోపంవొస్తోంది. తెగించి దేశాలంట పోదామా అనిపిస్తోంది.

---

* ఈ రంగంలోవున్న వివరాలు అచ్చుప్రతిలో లేవు. శంకరశాస్త్రి సంఘ సంస్కరణోద్దేశంతో కొండుభట్లు అగ్రహారానికి వచ్చినట్లు ఊహించవచ్చును. అయితే దీనిని మహాకవి పూర్తిగా వ్రాయలేదు. ఉన్నదున్నట్లుగా, వ్రాసినంతవరకూ యీరంగాన్ని యిక్కడ అచ్చొత్తించాము. ఇదేరంగాన్ని ఆయన తిరిగి వ్రాయగా అందులో మరికొన్ని విశేషాలు వుండడంవలన దానిని కూడా సాహిత్యాభిమానులకు అందిస్తున్నాము. అందులో శంకరశాస్త్రి లోకసేవకొరకు నాటకరంగాన్ని ఆశ్రయించినట్లు చెప్పబడ్డది. నాటి పార్శి నాటకముల జట్టునుగురించి కొంత భోగట్టావున్నది.

శంక : నాతో యెన్నడూ చెప్పకపోతివే.

రామ : యేమని చెప్పడం. సిగ్గుచేత చెప్పలేదు.

శంక : ఒకరిలోపాలికి మనం సిగ్గుపడనేలా? చేతనయినంత వరకు మళ్ళిద్దాం. మళ్ళకపోతే కనికరిద్దాం. సిగ్గుతోనూ కోపంతోనూ పనిలేదు.

రామ : నామీద దయచేత మీరు అలాఅంటారు. లోకంలో తలయెత్తుకు యెలాతిరగను?

ప్రథమాంకము

చతుర్థరంగము

(రెయిలుస్టేషను)

[రెయిలు వెళ్ళిపోయినది. యిటూ అటూ ఒకరిద్దరు కళాసులు తిరుగుతుందురు. బెంచీమీద శంకరశాస్త్రి, రామమూర్తి కూచుందురు]

శంక : ఆయన మీ తండ్రిగారా?

రామ : ఔనని చెప్పడానికి సిగ్గుపడుతున్నాను.

శంక : సిగ్గుపడవలసిన అవసరం లేదు. నన్నెరగనట్లు నటించు. కారణం పెనకనించి చెబుతాను.

(సెట్టి ప్రవేశం)

సెట్టి : పంతులుగారూ! బండి కుదిర్చాను. దయచెయ్యండి.

శంక : రెయిలు సంచీ మా మనిషి పట్టుకుంటాడు. నేను నడుస్తాను.

సెట్టి : తమవంటి దొడ్డవారూ, ధనవంతులూ నడిస్తే మరి బళ్ళవాళ్ళు బతకడం యెలాగ?

శంక : అయితే బండివాడికి అద్దె యిచ్చేసి మనం నడుద్దాం.

నడక నాకు యిష్టం.

సెట్టి : (రామమూర్తిని చూసి) యిదుగో చిన్న శాస్త్రుల్లు ! మన యింటికి యీ పంతులోర్ని తీసుకెళ్ళమని అయ్య చెప్పాను.

శంక : నీతో చెబితే నీవే తీసికెళ్ళు.

సెట్టి : నిజమే; యెవరితో చెప్పినపని ఆరే సెయ్యాలి; అదే బుద్ధివంతుడి నచ్చనం. బాబూ ! మనం వెళదాం.

శంక : ఆఁ !

సెట్టి : (నాలుగడుగులు నడిచి మళ్ళీ వెనక్కి పరిగెత్తి వెళ్ళి ఒకమనిషి చెవిలో రహస్యం చెప్పి తిరిగి కలిసి నడుచును) బాబూ ! ఒక్క మాట శలవియ్యండి. సమిష్టికుటుంబం విభక్తమైపోయిం తరవాత అందులో ఓపుర్రాడు అప్పులుచేసి ఋణాలుచేస్తే తాతలు తండ్రులూ చమటోడ్చి ఆర్జించిన భూవులు అమ్మేస్తాడుగదా! యేటిన్యాయం?

శంక : నాకు 'లా' తెలియదు.

సెట్టి : పోనించి; బాబూ ! తమకు తెలియం దేమిటుంది తమ వంటి ఘనవైన ఉద్యోగస్థులు...

శంక : నేను ఉద్యోగస్థుణ్ణి కాను.

సెట్టి : తమలాంటి ప్రొపయిటర్లకి...

శంక : నేనేమీ ప్రొపయిటర్ని కాను.

సెట్టి : అనగా తమవంటి మొఖాసాదార్లకి... ఒకరి చేత్రికింద ఉద్యోగం చెయ్యడం అవసరవేటిటి !

శంక : నేను ఒక చేత్రికింద ఉద్యోగం చెయ్యలేను. లోకం అందరి చేత్రికిందా ఉద్యోగంచేసి సేవచేస్తున్నాను.

సెట్టి : జీతం యెంతబాబూ !

శంక : తప్పోపావలా, అర్ధరూపాయి, రూపాయీ, రెండు రూపాయిలూ.

సెట్టి : నాకేం బోధకాలేదు బాబూ!

శంక : నేను నాటకంకంపెనీ మేనేజర్ని. ఒక స్కూలు మేనేజర్ని. నాటకాలు ఆడుతాను. బడిచదువు చెబుతాను.

సెట్టి : పరీక్షయేమైనా ప్యాసైనారా !

శంక : యెప్పో ప్యాసైనాను.

సెట్టి : అబ్బోబ్బరి. యింగిలీషోడి అమ్మలో యేపని చేసినా బంగారం వొలుకుతుంది. అయ్యారు పనిచేస్తే వొందలు జీతాలు. యేటి! నాటకాల్రాడ్డివోళ్ళు పట్టాలు పట్టాలు దోచెయ్యడవే! ఆపార్శీనోళ్లు యేం తమషాచేస్తారు బాబూ! ఆడపిల్లల వేషాలు ఎంత గుముగుమ్ముగా వున్నాయనుకన్నారు! చిన్న శాస్త్రుల్లులాంటి కుర్రాళ్ళు వాళ్ళ వలలోబడ్డారు.

రామమూర్తి : నోరుమూయ్యి.

సెట్టి : బాబు ! సత్యంగానండి ; మా సిన్న శాస్త్రిలుగారు మా బుద్ధివంతలుగాని కొంచెం కొస యెర్రుంది.

రామ : నోరుమూయ్యి.

సెట్టి : బాబూ ఆ గుంటల్ని చూసి... గాని ఆ పారిసీవోళ్లు దేశవంతా జయించుకొచ్చినారు గాని ఈ వూళ్లో ఆళ్ళ గర్వం అణిగింది.

శంక : యెలాగో ?

సెట్టి : యెలాగనా బాబూ, ఈవూళ్లో కనకవల్లిఅని భోగం వుంది. దాన్ని చూసి...

77345

* ద్వితీయాంకము

ద్వితీయ రంగము

(తలుపు అవతలకు కనకవల్లి, రామూర్తి, శంకరశాస్త్రి ప్రవేశింతురు. శంకరశాస్త్రి పక్కను వొణుకుతూ కనకవల్లి నిలబడును.)

శంక : యెవరు లోపల?

రత్నం : శెట్టి?

కనక : శెట్టా! యెలావొచ్చాడు

శెట్టి : యెలావొచ్చాడా? రత్నం రమ్మని ప్రాణం తింటే వొచ్చాను.

---

* ఇది అచ్చుప్రతిలో ద్వితీయాంకము సప్తమరంగము లోనిది. అచ్చు ప్రతిలో మంజువాణి, చిత్తుప్రతిలో కనకవల్లి, యిద్దరూ వొకరే. మంజువాణి యింటగూరిన శెట్టి రత్నాంగికి పట్టుబడతాడు. అపుడు "తలుపు దగ్గిరకి దాసీలు, మంజువాణి, నరహరిరావు వచ్చి తట్టుదురు." చిత్తుప్రతిలో రామమూర్తి, శంకరశాస్త్రి, కనకవల్లి ప్రవేశించినట్లు వుంది. నరహరిరావు ప్రసక్తి చిత్తుప్రతిలోలేదు. అచ్చుప్రతిలో యిక్కడ మాత్రమే నరహరిరావు ప్రవేశం. శంకరశాస్త్రి పాత్ర (అచ్చుప్రతిలో త్రివిక్రమరావు) ను గురించిన వివరణకు, చిత్తుప్రతిలో గల కనకవల్లి, అచ్చుప్రతిలో మంజువాణిగా మారెనని తెలుపు టీకు యీ భోగట్టా యిక్కడ ప్రచురిస్తున్నాము. చిత్తుప్రతిలోవున్న యీ రంగంలోని మిగిలిన విషయాలూ, అచ్చుప్రతిలోవున్న యీ రంగంలోవున్న అంశములూ అన్నీ వొకటే. కనుక ఆ భాగములన్నీ ఇక్కడ అచ్చొత్తించలేదు.

బిలణీయము

ప్రధాన పాత్రలు

★

బిల్హణుడు	:	కవి; పండితుడు; కథానాయకుడు
కర్ణమహారాజు	:	అనహిల్లాపట్టణపు యేలిక
నానాపంత్	:	మంత్రి
నారాయణభట్టు	:	వైయాకరణుడు
కేశవభట్టు	:	తార్కికుడు
మాధవశర్మ	:	యామినీదేవికి విద్యాగురువు
కృష్ణస్వామి	:	కవి
రామశాస్త్రి	:	కవి
		విదూషకుడు

★

బిల్హణీయము

మొదటి అంకము

ఒకటవ సన్నివేశము

అనిహిల్లా పట్టణములో రాజు ఆస్థానము

[వైయాకరణుడు నారాయణభట్టును, బిల్హణుని మిత్రుడగు తార్కికుడు కేశవభట్టును ప్రవేశింతురు.]

నారాయణభట్టు : మహాభాష్యానికి ఇతని తండ్రి వ్రాసిన వ్యాఖ్యానం ప్రమాణంగా యెవరు వొప్పుతారండీ ! ఆలాగైతే, నాశిష్యులు వ్రాసిన వ్యాఖ్యానాలుకూడా ప్రమాణవే ! యేవంటారు ?

కేశవభట్టు : వాదానికి యుక్తిప్రధానంగాని, పుస్తకాలతో యేంపనండీ !

నారా : యుక్తిలో నీరససారసాలు కనిపెట్టే దాతేడండీ ? ప్రభువులు నూతన ప్రియులు. ఆశ్రయించుకున్న వాళ్ళను త్వరితత పరచడమూ, పరాయివాణ్ణి నెత్తికెక్కించుకోవడమూ వారికి నైజగుణం.

కేశ : గొంగళీలోతింటూ, వెంట్రుకలు లెక్కపెట్టడట ! యిప్పుడు, త్వరితత మనకు కొత్తగా వొచ్చిందాయేమిటండి ? భోజరాజు కాలంనుంచీ కవిత్వం విలవలపోచ్చింది; శాస్త్రాలు అడుగంటాయి. నాలుగు శ్లోకంముక్కలు అల్లుతారనేకదా, గామశాస్త్రిని కృష్ణస్వామిని రాజు యిప్పుడు మన అందరి నెత్తిమీదా కూచోబెట్టాడు.

నారా : వెధవ కవిత్వం ! నా శిష్యులు చెబుతారు అంతకన్న మెరుగ్గాను, పరిశీలించేవాడేడండీ ?

కేశ : గనక మనకు యిప్పుడు కొత్తగా వచ్చిన ఝూణతలేదని నామతం. బిల్హణుడికీ మీకూ స్నేహం కలుపుతాను, రండి !

నారా : ఐతే వాడికాళ్ళు పట్టుకోమంటారా యేవిటి ?

కేశ : ఏవీఁ, బిల్హణుడు, రామశాస్త్రి కృష్ణస్వామీ పాటి పండితుడూ, కవీ, కాడనా మీఅభిప్రాయం ?

నారా : ఆ పీనుగులకంకె, యెవడైనా నయవేఁ అని నా అభిప్రాయం.

కేశ : నేను చెప్పవచ్చినమాటా అదే. బిల్హణుడు మహాకవి, ప్రతిభావంతుడున్నూ. అప్పుడే రామశాస్త్రులుకీ, కృష్ణస్వామికీ కొనమళ్లించాడు. అది మనకో గొప్పలాభం కాదా ?

నారా : ఔనుగాని, మన కొనకూడా మళ్ళించే ప్రయత్నం చేస్తున్నాడే !

కేశ : మనకు కొనంటూ వొకటి వుంటేకదూ, మళ్ళించడానికి ! మీ,నా, అదృష్టాలు నాడే గిడసబారాయి, రాజు, మనశాస్త్రులు అక్కరచెయ్యడమే మానెను. మనం సభకు రాకపోయినా యేమైనారని తనుపేలేదు. మన పదవి సదక్షిణాకంగా ధారపోస్తే వొల్లడు బిల్హణుడు.

నారా : అవును, మన అవస్థ అలాగేవుంది.

కేశ : యీపాటి భాగ్యానికి అతగాడితో వృథావాదం మన కెందుకూ ? కలహం పెంచకండి. నిన్న మీరు ఉభయులూ

వాదిస్తూవున్న సమయంలో, రాజు ఉదయమంత్రిని రాచకార్యాలు ప్రశంసించుచుండెను. కనిపెట్టితిరా?

నారా : ఆలాగనండీ! అయితే నావాదవఁంతా వృథాయే? అవును. రాజు మెచ్చుతాడన్న ఆశ చాలాకాలమూయి వొదులుకున్నాను, గాని, జినచంద్రుడయినా మెచ్చుకున్నాడా?

కేశ : స్తంభాన్ని జారబడి నిద్రపోయినాడు.

నారా : ఆసి! వీడి బొడ్డుపొక్కా! పాండిత్యం కురిపిస్తాంటే యలా నిద్రపోయినాడయ్యా?

కేశ : ఇక్కడికి సంతుష్టి అయిందా?

నారా : అయితే ముందు యేం జేదాం?

కేశ : ఇట్టుపైని వాదం మానేసి బిల్హణుడు యేమన్నా మెచ్చుకుందాం.

నారా : ఓడిపోయినా వఁనుకొంటాడేమో?

కేశ : బిల్హణుడి యోగ్యత మీ రెరుగరు. ఎదటివాడి సత్తువ యెన్నే ఔదార్యం, పండితుల్లోకల్లా అతనియందే కలదు. నిజమైన విద్వత్తుకు జోహారు చేస్తాడు. అతను నైరులకు పిడుగు; స్నేహితులకు చందనము.

నారా : అయితే నాపాండిత్యం విషయమై అతగాడి అభిప్రాయం యెట్టిదో కనుక్కున్నారా?

కేశ : దిగ్దంతులం, మన పాండిత్యం విషయమై, ప్రాజ్ఞుడైన వాడికి మరో అభిప్రాయం యెలా కలుగుతుంది? ఆయన మనసులోమాట దాచేవ్యక్తికాడు. రేపో నేడో ఆయన

ముఖతః మీరేవింటారు. అదుగో మాధవశర్మ వస్తున్నాడు. మొహం మంగలంలావుంది.

[యామినీదేవికి విద్యాగురువు మాధవశర్మ ప్రవేశించును.]

మాధవ: రాజుకు మతిపోయింది.

నారా: యేవండోయి?

మాధ: యామినీదేవికి బిల్హణుడిచేత, విద్య చెప్పిస్తాడట?

నారా: మరి మీరో?

మాధ: కొత్తనీరొచ్చి పాతనీరు కొట్టుకుపోయింది.

నారా: యేం విద్య చెప్పిస్తారో?

మాధ: యేం విద్యో నాకేంకావాలి! త్రిణాతలో త్రిణాత, అతగాడు చదువు చెబుతూవుంటే నేనుకూడా వింటూ దగ్గిర కూచోవాలట! "విపులాచ పృథ్వీ" అన్నాడు, మరోరాజు కాళ్ళు పట్టుకుంచాను.

కేశ: బావా, తొందరపడకు. నీజీతం నిలుపుకాలేదు గద?

మాధ: లేదుగాని పువ్వులమ్మిన వ్రాళ్ళో కట్టెలమ్మవలసి వచ్చిందిగద?

కేశ: రాజుల యిష్టాయిష్టాలు, మనమా శాసించేవాళ్ళము? పండితుడన్న వాడికి, కాలుకాలిన పిల్లిలాగ దేశాలు తిరిగి కష్టజీవనం కల్పించుకోవడానికి బదులుగా, గొప్ప ఆస్థాన మందు ఉపాధికలగడం పెద్దఅదృష్టం కాదా? అది తన్నుకు పోనడం ఉచితంకాదు. మనరాజు రాజర్షి; యిట్టిరాజు యెన్ని రాజ్యాలు తిరిగినా మీకు దొరకడు.

మాధ: రాజర్షయితే యిలాటిఘోరం ఆచరిస్తాడండీ!

కేశ : ఘోరానికీ అఘోరానికీ మీరయినా యామినీదేవికి కలకాలం విద్య చెప్పేది లేదుగదా! రేపో నేడో ఆమెకు వివాహాన్నే విద్య కట్టడుతుంది. యీలోగా బిల్హణుడు నొల్లుకుపోయింది యేమీలేదు!

మాధ : యెవడిదాకా వొస్తేగాని వాడికి తెలియదు.

కేశ : యెవడైనా కాక తీరనిపనికి, తలవంచక తీరదు; రాజుకు యెవడు మాన్యుడైతే మనకు వాడే రాజు గనక బిల్హణుణ్ణి మంచి చేసుకోవడమే నీతి.

మాధ : మానభంగానికి కారణభూతుడైన శత్రువును, బతి మాలు కొమ్మన్నావు. మంచినీతే!

"రథకారో నిజాంభార్యాం
సజారాం శిరసాకరోత్" అన్న న్యాయంగా వుంది నీ సలహా!

కేశ : మనిషి దైవసృష్టి, శత్రుమిత్రులు మనుష్యసృష్టి.
"అయం బంధుః పరోవేతి గణనా లఘుచేతసామ్।
పుంసా ముదారచిత్తానాం వసుధైవకుటుంబకమ్॥"

మాధ : చాల్చాలు, నీ కుతర్కం. చాలించు.

[కవి కృష్ణస్వామి ప్రవేశించుట. మాధవశర్మ అతనికి యెదురుగా వెళ్ళి]

మాధ : విన్నారా?

కృష్ణ : చూచాయగా.

మాధ : [నారాయణభట్టుతో] చూశారా, అప్పుడేపూరందరికీ తెలిసింది. (కృష్ణస్వామితో) ఆ వృత్తరాదివాడు మీకంటే పెద్దకవిషండీ?

కృష్ణ : పెద్దకేంవుంది; అందరికంటే తాటిచెట్టు పెద్ద. కవిత్వం ఒకపాటిగా చెబుతాడు; గాని పండితుడు.

మాధ : పండితుడే కాగట్టండి! ఒకపాటి కవికాడు, మహాకవే అనండి. రాజప్రతికలకు తరతరాలనుంచి ఆస్థానం కనిపెట్టుకొని కాలం గడిపిన మీ, నా, బోటివారు విద్యాచెప్పడం భావ్యంగాని, శీలంయెట్టిదో, సాంప్రదాయం యెట్టిదో, తెలియని దిక్కుమాలిన పరదేశిని అంతఃపురంలో ప్రవేశ పెట్టడం ఉచితమేనా?

కృష్ణ : ఆమాట అన్నారు, ఒప్పుకున్నాను.

మాధ : (మెల్లగా) మాటవరసకు అనుకుందాం. బిల్హణుడు జారుడైతే?

కృష్ణ : మీపుట్టెం ములిగింది? రాజు అనుభవిస్తాడు.

మాధ : ఈలోగా యీ అవమానవంతా, నేను అనుభవించాలి గదండీ?

కృష్ణ : మానావమానాలు, వకడుయిస్తేనా వస్తవి? రాజుటండీ బుద్ధియొక్కా, విద్యయొక్కా విలువకొల్చేవాడు? లేకుంటే, ఆ రామశాస్త్రుల్లు సొట్టకవిత్వం మెచ్చుతాడు గదా, రాజు తెలివి యేమనిచెప్పను!

మాధ : అయితే యిప్పుడు మనం యేంజేయడం, మీ సలహా.

కృష్ణ : సలహా కేవ్వుంది? మాట్లాడక ఊరుకోవడవేసలహా.

మాధ : యీ అప్రతిష్ఠ సహించి యెలా వూరుకోవడం? నాలుగు మాసములు శలవు పుచ్చుకుని తీర్థయాత్రలు వెళుదునా?

కృష్ణ : వెళ్ళండి.

మాధ : (మెల్లగా) ఆహవమల్ల మహారాజు పట్టపుదేవి తపుచు వర్తమానం చేస్తూన్నారు. వస్తేనాలుగుగ్రామాలు అగ్రహారంగా దయచేయిస్తావఁన్నారు.

కృష్ణ : అలాగైతే, యింకా ఆలోచిస్తారేవిఁ ?

[వైయాకరణులు జినచంద్రుడును, గోవిందశాస్త్రియును ప్రవేశింతురు.]

జిన : పడపడవాగితే, యీరాజులు డంగైపోతారు. నాలుగు పంక్తులు వ్రాస్తే పస బయలుపడుతుంది. పత్రికావాదం పెట్టి, పత్రికలు కాశీకి పంపమనండీ, బలాబలాలు తెలుస్తాయి.

(కవి రామశాస్త్రి ప్రవేశించును)

గోవింద : అతగాడికి ఉపాసనాబలం వుందండీ. వాదన సమయంలో నాకు యెన్నోయుక్తులు స్ఫురిస్తాయి. వాక్స్తంభసఐమాట పైకిరాదు. మనిషిని గెలియడం శక్యంగాని, మంత్రాన్ని గెలియడ వెఁలాగ.

రామ : అంత పెనుప్రళయం అతగాడిలో యేమీ కానరాలేదే ?

మాధ : (రామశాస్త్రిని పక్కకు పిలిచి) యేనాటికి యేవొఁస్తుందో తెలియదు.

రామ : యిప్పుడే వొఁచ్చింది ?

మాధ : యీనాటికి యామినీదేవికి చదువ్రు చెప్పడానికి నేను తగాను కాను.

రామ : యేమండి ?

మాధ : యేమో, రాజుగారికే తెలియాలి. రేపటినుంచి బిల్హణుడిచేత విద్య చెప్పిస్తారష !

రామ : అలాగనా, ప్రభుచిత్తం మనవేఁ చెయ్యగలం ?

మాధ : అంచాతనే దేశాంతరం వెళ్ళడానికి ఆలోచించాను.

రామ : అట్టి ఆలోచన యెన్నడూ చెయ్యకండి. మీరు పిల్లల వాళ్ళు, యిల్లూ వాకిలీ, తోటా దొడ్డీ కల్పించుకున్నారు. యెక్కడికి వెళ్ళినా లోకం అంతా వక్కరీతిగానే వుంటుంది. మరివక రాజ్యంలో మాత్రం ధర్మం నాలుగుపాదాలా నడుస్తుందనుకున్నారా ? నెట్టికభ్రమ ! ఆకాడికి మనరాజ్యవేఁ నయం. రాజు సత్యసంధుడు. నిలబడి నిర్వహించడం నీతి గాని యెవడో డంబాచారి వచ్చాడని నొగలు విప్పివెయ్యడం పౌరుషవేఁనా ?

మాధ : నాలుగురోజులు జబ్బుపేరుపెట్టుకుని యింటవుండి సోదునా ?

రామ : రాజుపోల్చుకొని కార్పణ్యం వహించగలడు.

మాధ : అయితే యేంజేదాం ?

రామ : (మెల్లగా) యిసుంటారండి (నాలుగు అడుగులు యెడంగా వెళ్ళి) కపటస్నేహంచేసి వాడి లోతుపాతులు కనిపెట్టండి. కర్తవ్యం ముందుముందు ఆలోచించుకుందాం.

మాధ : మీ సలహా బాగుంది.

రామ : సాయంత్రం కలుసుకుమాట్లాడుదాం. యిప్పుడు యెడంగా వెళ్ళిపొండి. బిల్హణుడు వస్తున్నట్టుంది.

[బిల్హణుడును, పురోహితుడును ప్రవేశింతురు.]

బిల్హ : బ్రాహ్మణోత్తములకు నమస్కారము.

రామ : (నారాయణ శాస్త్రితో) చూశారా, బ్రాహ్మణోత్తము లంటాడుగాని పండితులనడు.

(బిల్హణుడు సభామంటపంలో నిలుచున్నవారిని చూపువిసురున పరికించి, నారాయణభట్టు దగ్గరకుపోయి కౌగలించుకొనును)

బిల్హ : పండితోత్తమా, మీరు పతంజలి అపరావతారము. మీవాగ్ధోరణి నిన్న నాకు అపూర్వకర్ణానందము చేసినది. నన్ను మెప్పించినయీ యాకరణి కిత్తునని నేప్రతిజ్ఞ చేసిన యీ రుద్రాక్షమాల మీకంఠము నలంకరించుగాక!

(తన మెడలోని బంగారుకట్టిన రుద్రాక్షమాల నారాయణభట్టు మెడను వేయును.)

నారా : వద్దు - వద్దు - వద్దు; నేం తగను. మీవంటి మహాను భావుల మెప్పే పదికోట్లు.

[రుద్రాక్షమాల చేతబట్టి తీయునటులు అభినయించుచు కేశవభట్టువంక చూచును. నలుగురు పండితులు చుట్టూ మూగుదురు.]

కేశ : మహాపండితుడు చేసిన సన్మానం ప్రభుసన్మానముకన్న దొడ్డది. ఉంపించండి.

బిల్హ : యీ అపూర్వమయినమాల రాజపండితులైన కర్ణ మహారాజు కంఠమును మున్ను అలంకరించెను. ఇప్పుడది పండితరాజు కంఠము నలంకరించినది.

రామ : (మాధవశర్మతో మెల్లగా) మహారాజిచ్చిన మాల భట్టు కిచ్చాడు. యేమి యితగాడి పొగరూ!

మాధ : (రామశాస్త్రితో) వీడు యెన్నాళ్ళో దక్కడు.

[పూజబ్రాహ్మణుడు ప్రవేశించి]

పూజ : మహాప్రభువువారు పూజాగృహానికి విజయంచేశారు.

(పండితులు బ్రాహ్మణుడివెంట పోదురు.)

రెండవరంగము

(కర్ణమహారాజు పూజామంటపము రాజు పూజచేయుచుండును. ఇరుపక్కలనూ పండితులును, ఉద్యోగస్థులును కూర్చునియుందురు.)

కర్ణమహారాజు : నిన్నటి వాదములో యెవరుగెల్చినట్లు?

కవిరామశాస్త్రి : గెలుచుటకూ, సీగుటకూ యేమున్నది మహారాజా!

కేశ : సత్యమే అన్నదాతా! పూర్వ పశ్చిమ సముద్రములకు వారయేమిటి? అసాధారణ ప్రతిభావంతులగు మహాపండితులచేత ఉత్పాదితమైన వాక్పరంపర భగదుత్పాదితమగు సృష్టిపరంపరవలెనే (చెయ్యి రామశాస్త్రివైపు తిప్పి) అస్మదాదులకు ఆశ్చర్యజనకమై యెన్న నశక్యమై యుండును. విష్ణ్వంశ సంభూతులగుటను, వారపారలు యేలినవారికే తెలియువలయును.

కర్ణ : రామశాస్త్రులుగారు యేమంటిరి?

రామశాస్త్రి : మహారాజా! కేశవ భట్టుగారు తార్కికులు గనుక వాదాదరమనస్కులు. మంచిదేకాని వివాదాంశము వస్తుతత్వమును గూర్చిగాక, పరవస్తు తత్వమునుగూర్చి కాక, ఒక వ్యాకరణ సూత్రమందు ఒక్కమాటకు వినియోగమున్నదా లేదా యనుకుశంక ననుసరించి యున్నప్పుడు, అట్టివాదము కాలము వెళ్ళపుచ్చునుగాని, తత్వాన్వేషణ

మునకు కానేరదు. సూత్రములు ఋషిప్రణీతములు. మార్ప బడనేరవు. గాన, వాదమునకు చరితార్థము తక్కువ. వినోదార్థము చేయు ప్రసంగములకు వీగుగెలుపు లెక్కడివి మహాప్రభో!

కేశ: వ్యాకరణము వేదాంగమై, శబ్దబ్రహ్మమును గూర్చిన శాస్త్రమైనపుడు చరితార్థము లేకుండుట యెటుల?

"అజ్ఞానాంధస్య లోకస్య జ్ఞానాంజనశలాకయా
చక్షురున్మీలితంయేన తస్మై పాణినయేనమః॥"

అనే శిక్షావాక్యము నిరర్థకముకానోపునా?

విదూషకుడు: వారి వ్యాకరణశాస్త్రము శబ్ద బ్రహ్మపరము. మీ తర్కశాస్త్రము అగ్ధబ్రహ్మపరము. అగ్ధబ్రహ్మనే అందరూ ఉపాశిస్తారు; శబ్దబ్రహ్మంతో సంతుష్టి తక్కువ. అగ్ధంమాట కొస్తే మంత్రి నానాపంతులు మహాపండితులు. మీరంతా నిరర్థకులే.

రామశాస్త్రి: స్వారస్యం బాగా తీశావూ.

మంత్రినానాపంత్: చుట్టూ తిరిగి ముక్తాయింపు నామీదే?

విదూ: నిజంచెబితే నిష్టూరం! "యస్యాస్తి విత్తం సనరః కులీనః స పండితః" అనలేదా?

రామ: అవును, కాకేమీ? అర్థశాస్త్రంలో నానామంత్రులు పండితులే!

విదూ: ఆమాటే నేనంటేహాస్యం; మీరంటే నిజం.

కర్ణమహా: నిజమనేది యేమిటో?

విదూ: మంత్రులాడే మాటలల్లా నిజం.

కర్ణమహా : వారు అబద్ధమాడినా నిజమౌతుందా ?

విదూ : సాగింది నిజం, సాగంది దబ్బర. మంత్రులనేమాట సాగుతుంది గనుక, వారనేమాటల్లా నిజమే. యింకా ప్రభువులమాటే సాగక తరుచు దబ్బరౌతుంది.

కవికృష్ణస్వామి : గౌతముడిది యేదోవినియోగంగల వాదం గాని, వ్యాకరణ వాదంలాగ నిరర్థకంకాదు.

కర్ణమహా : మంత్రివర్య ! గౌతములయెడల మనమేమో అపరాధము చేసినట్టుంది.

నానామంత్రి : మహాప్రభో, ప్రభువులకు ధనంకూడికచేస్తే అది అందరికీ అపరాధమే.

విదూ : యెన్ని అక్రమాలు చేసినా, మంత్రులకు యిది వకడాలు దొరికింది. నీతినిపుణుడైన మంత్రి, స్వప్రతిభవల్ల కొత్తమార్గాలు కల్పించి, ధనసంగ్రహం చెయ్యాలిగానీ. రాజునూ, రాజునాశ్రయించుకున్నవాళ్ళనూ యెండు చాపలవలె యిగరగట్టడమా ప్రయోజకత్వము ?

కవికృష్ణ : మరి వారిజాగ్రత ప్రభువులకు వ్యక్తం కావడ వెలాగ ?

విదూ : గనక ఆస్థానమందు కనిపెట్టుకునివున్నవాళ్ళకే, మొదట తాళం పట్టాలి. పయిన యెంతదూబర అయినా చింతలేదు.

కవికృష్ణ : మహాప్రభో, మన ఉద్యోగస్థులమీద గౌతముడు పద్యంచెప్పాడు. చిత్తగించతగివున్నది.

కర్ణమహా : యేదేదీ ?

గౌతముడు : వారిమహిమ "అతీతః పంథానం। వాఙ్మన
సయోఃి" అయినా "చకితమనిధత్తే" అన్నట్టు చెప్పాను.

క. దబ్బరలుం గొండెమ్ములు
మబ్బువలెంగ్రమ్మి మాయ మాటలతీపున్
నిబ్బరపు మొండితనమును
నబ్బురమగు విద్యలిచటి యధికారులకున్.

కృష్ణస్వామి : అక్షరలక్ష ణియ్యతగివుంది.

నానామంత్రి : హాస్యగాణ్ణి అయినా, హద్దుమీద వుంచాలి.

కర్ణమహా : (చిరునగవుతో) హద్దుమీరినమనిషి ఒక్కొక్కడు ఉంటేనేగాని, హద్దుయొక్క గుణాగుణములు తెలియవు. మనవలె ఉచ్చావస్థలో నున్నవారిని స్వేచ్ఛగా తిట్టగలిగిన వారిని వకరిని, అచ్చుబోసి వదిలితేనే గాని మనను గూర్చి లోకంయేమనేదీ మనకు తెలియబోదు. యేమంటారు ?

కృష్ణ : సత్యం! సత్యం ! పునస్సత్యం !

రామ : మహారాజా, ఉచ్చావస్థలో నున్న ప్రాజ్ఞులు మంచి చెడ్డలు యెరగకనా నుంచరిస్తారు ? మంచి చెడ్డలన్నవి అంత కన్న లోకులకు బాగా తెలియగలవు ?

విదూ : భర్తృహరి ప్రభువులను గూర్చి యేమో చెప్పాడు. రామశాస్త్రుల్లుగారికి విస్మృతి వచ్చినట్టుంది.

నానామంత్రి : తల్లితండ్రులు ప్రభువులను దిద్దాలి. మాబోటి అధికార్లను ప్రభువులు దిద్దాలి; గాని తిట్టి బతకనేర్చిన కపుపుకూటి బ్రాహ్మడా, మహాప్రభో తప్పొప్పులు కని పెట్టేవాడూ ? కొందరు మహానుభావులు యితగాడికి

వింములుపెట్టి, వారిపగలు యీవికటకవిద్వారా తీర్చు-
కుంటారు. అయినా, నౌకరుకు విచారంలేదు. ప్రభుసేవా
ప్రైవసేవలతో కాలం వెళ్ళబుచ్చేమనిషి దూషణ భూషణ
తిరస్కారములు సరకుగొనడు. మనవిచెయ్యవలశినమాట
ఒకటి వుండిపోయింది మహాప్రభో! మాతా మహారాణి
వారి శిలనైనది. మహారాజ కుమారికా వారికి విద్యా-
భ్యాసము ముగించవలసిన కాలము మీరినదని వారి అభి
ప్రాయము.

కర్ణమహా : అమ్మాజీ వారిఆజ్ఞ మనఅందరికీ శిరస్సునధార్యము.

కృష్ణస్వామి : (విదూషకునితో) యేమి వెన్నకుప్ప పరిశీలిస్తు
న్నావు?

విదూ : ఈదొడ్డసలహా, మాతా మహారాణీవారికి, యెనకు
మనవిచేసి యుందురోఅని.

కర్ణమహా : వెన్నకుప్ప చెప్పనా?

నాసామంత్రి : నేను మనవి చేశానని కాబోలు, యీప్రాహ్మడి
మాటల ధ్వని. శ్రీకృష్ణులు సాక్షి నేను మనవి చెయ్య-
లేదు.

కర్ణమహా : యెన్నడూ వొట్టువేసుకోకండి. వొట్టువేసుకోవడం
యితకులు మనమాట నమ్మరనికదా? నమ్మినా, నమ్మక
పోయినా, వొట్టు కార్యము లేదుగదా?

రామశాస్త్రి : సలహామాటకువస్తే, యీ విషయములో
ఒకరిసలహాకు యేమి అవకాశం కద్దు? మహారాజ
కుమారికావారికి విద్యాభ్యాసపు టీడు మీరినదని, ఒకరు

విన్నవించినగాని, మాతా మహారాణివారికి తెలియదు కాబోలును.

విదూ: కొందరు అధికార్లకు ఆశ్రయణమూ, పొగడ్తా రుచి. బిల్వాణుడు ఉద్యోగస్థులకు కైవారం చెయ్యడు. వారి నోట వచ్చిన మాటక్కల్లా అహా! హా! అని ఆశ్చర్యం నటించడు. వొచ్చిన ఉపద్రవం యిది.

కృష్ణస్వామి: నిజమైన పండితుడికి ప్రభువులయందే లక్ష్యం వుంటుందిగాని, ఉద్యోగస్థులయందు లక్ష్యం యేలవుండును?

రామ: ప్రభులక్ష్యమే లేని పండితులకు ఉద్యోగస్థుల లక్ష్య మెలా వుండును?

నానామంత్రి: బిల్వాణుడు ప్రభువులను కూడా లక్ష్యపెట్టడా? మహాప్రభువువారిని గూర్చి చులకనగా ప్రశంసించెనా? యేమిటి! అంత వాడూ అవును!

మాధ: ప్రశంస అని ప్రశంసకాదు. ప్రభువ్రలు చేసిన సన్మానాన్ని నిరాకరించారని కాబోలు రామశాస్త్రిగారి భావం.

కర్ణమహా: అదెలాగ?

కృష్ణ: మరేమీలేదు. యేలినవారు దయచేసిన రుద్రాక్ష మాల, పదిమంది పండితులలోనూ, నారాయణభట్టుగారి మెడను వేశారు (రామశాస్త్రితో) అదేకదండీ మీరనబోయే మాట?

కర్ణమహా: (కనుబొమలెగయ వోచనవేసి) అలాగనా స్వామీ!

కృష్ణస్వామి: నాకళ్ళతో చూశానులే.

నానామంత్రి: ప్రభువులు, వచ్చిన దాసరినల్లా మెచ్చి

హారాలూ, అందలాలూ, యిస్తూవుంటే, వాళ్ళు నిరసించడం ఆశ్చర్యమా!

విదూ : ప్రభువుల శలనైనప్పటికీ, ఒక కాచనైనా యివ్వకుండా మీరు కలకాలం తిప్పుతూవుంటే, ప్రభువులు వొళ్ళువొలిచి, హారాలూ, అంగదాలూ, యివ్వవలసి వొస్తుంది. యిదే మీలాటి మంత్రులు ప్రభువులకు చేసి కూడిక.

కర్ణమహా : మంత్రివర్య, బిల్హణకవి యిట్టిపని చేస్తారని మేము తలచి యుండలేదు.

నానామంత్రి : దేశదిమ్మరి! తరతరాలనుంచి కనిపెట్టుకున్న వాళ్ళకి వుంటాయిగాని యేలినవారి యెడల భక్తివిశ్వాసాలు, అట్టివాడికెలా వుంటాయి?

కృష్ణస్వామి : బుజ్జికు విలవ తక్కువ అనండి. స్వదేశిఅయితేనేం, పరదేశి అయితేనేం!

నానామంత్రి : కాకుంటే, తన తలేవిటి, ప్రభువులు తనకిచ్చిన అమూల్యమైన హారం, తానంటూ మరి వకపండితుడికి బహుమానం చెయ్యడవేవిటి?

కర్ణమహా : యింకా బిల్హణులచేత మహారాజకుమారికలకు చదువు చెప్పించవలెననుకుంటిమి. ఈయన ప్రవర్తనకు తగిన ప్రతిక్రియ యెద్ది?

విదూ : తన్ని తగిలినెయ్యడం.

నానామంత్రి : ఉచ్చాటన చెయ్యడమున్నూ అతనివద్దనున్న ధనము తీసికొని, ధర్మనినియోగము చెయ్యడమున్నూ ఉచితమని తలుస్తాను.

కేశవభట్టు : క్షమాపణానుకోరి, విన్నవిస్తును. మహారాజాధి
రాజా ! పండితుడు శిక్షాస్వాడు కాడు. "విద్వద్దండ మగౌర
వమే" అదిగాక నేరమన్నది ఒకటి స్థాపించవలసి...

కర్ణమహా : (కొంచెముకోపరసంగా) నేరంలేదనావిూఅభిప్రాయము?

కేశ : చిత్తం, చిత్తం, నేను యేమి మనవి చెయ్యగలను.

మాధవ : నేరమే కాకపోతే యెన్నడూ కోపవేరగని ప్రభువు
లకు కోపవెందుకు వచ్చేని ?

రామ : (మాధవశర్మతో మెల్లగా) ఊకుకొండి.

కర్ణమహా : మంత్రివర్య, ఈ బ్రాహ్మణ్ణి అరవైగడియల్లోగా
పట్టంలోనుంచి సాగనంపితే?

నానామంత్రి : చిత్తం. యేలికశాసనము యీ క్షణమందే
అమలు చేస్తాను. (పత్రికవ్రాసి పంపును)

కర్ణమహా : మంత్రివర్య, మహారాజకుమారికావారి
విద్యాభ్యాసము విషయమై మీ అభిప్రాయ మెట్టిది ?
మీరు అనుభవశాలులు, సాంప్రదాయజ్ఞులు.

నానామంత్రి : మా తాతమహారాణీవారి శలవు ఆ ప్రకారం అయి
నది. నేను యేమిచెయ్యగలను ?

కర్ణమహా : సంగీతసాహిత్యములూ, కొంతవరకు తర్క-
వ్యాకరణములూ, బావాజీవారు చెప్పించారు. అదంతా
మాధవశర్మగారి ఆశీర్వచనఫలంగాని, యీ విద్యలు
జ్ఞానసాధనములు. ప్రత్యేకం వీటియందు విలువతక్కువ.
భగవద్గీతను ఉపదేశించి మరీ విద్యాభ్యాసము విరమించ
డము ఉచితమని యిదివరకు అనుకునివుంటిమి.

నానామంత్రి : ఏలికలవాక్యములు గురూపదేశములు. విద్య అనగా ముక్తిసాధనమైన విద్యే. సందేహమేమిటి మహా ప్రభో!

కర్ణమహా : మహారాజకుమారిక భగవద్గీతను పఠించత్గ దనే మీ అభిప్రాయమా?

నానామంత్రి : చిత్తము. నా చిన్నతనంలో మాతల్లిగారు పఠిస్తూవుండగా నాకుకూడా గీతాశ్లోకములు కంఠోపాఠంగా వచ్చినవి. ప్రాజ్ఞుడనైనతరువాత వారణాసిలో గురు ముఖతః గీత ఉపదేశం అయినాను. దక్షిణయాత్రలు వెళ్లినప్పుడు కాంచీపురంలో లక్ష్మణాచార్యులవారివద్దకూడా గీతార్థం విన్నాను. నేను అజ్ఞుడనేగాని, నే మనవి చేసిన స్వారస్యాలు వారు చిత్తగించి ఆశ్చర్యపడేవారు. అదిఅల్లా అమ్మాజీ మహారాణీవారి శిక్షాప్రభావం మహాప్రభో!

కర్ణమహా : సందేహమేమి? సముద్రమునకైనా మేరకద్దుగాని, మనిషిబుద్ధికి మేర యెక్కడిదీ? వ్యాఖ్యానకర్తలూ, మన వంటి మనుష్యులేనా? గురువు బుద్ధికి పైన ఆ డవలెనని శిష్యుడు ప్రవర్తిస్తేనేగాని విద్య పెరగదు. అమ్మాజీవారికి భగవద్గీత యందు మంచిప్రవేశము కలదు. మీరు మనవిచేస్తే మహా రాజ కుమారికావారికి కూడా ఆ గ్రంథరాజమును చెప్పిం చుటకు వప్పుదురేమో!

నానామంత్రి : శలవయితే మనవిచేస్తాను.

కర్ణమహా : మీరు మనవిచేస్తే, వారు ఆమోదించడమునకు అభ్యంతరం వుండబోదు. గాని బిల్హణులు వెళ్లిపోతే యెవరిచేత ఉపదేశం చేయింతుము!

నానామంత్రి: మన పండితులు దిగ్దంతులు యవరైనా చెప్ప గలరు.

కర్ణమహా: లోకానుభవమూ, బోధకశాస్త్రకలవారు మీరు చెలచెప్పరాదు?

నానామంత్రి: ప్రభువుల శలనైతే, తప్పకుండా చెప్పుతాను. మాధవశర్మగారి సహాయం వుండనే వుంటుంది.

మాధవ: ఆహా.

కర్ణమహా: అయితే అమ్మాజీవారితో మనవిచేసి వస్తారా?

నానామంత్రి: చిత్తం. మనవిచేసి యిప్పుడే తిరిగీ హాజరవు తాను. (నిష్క్రమించును)

విదూ: యేమి చిత్రమైన లోకమూ!

కర్ణమహా: కొత్తచిత్రం యేమి కనబడ్డది?

విదూ: నేను ఒక్కణ్ణితప్ప లోకంలో మరియెవడికీ తన అవస్థతో సంతుష్టిలేదాయె?

కర్ణమహా: యెలాగో?

విదూ: పండితులకి ఉద్యోగాలు చెయ్యాలని తాపత్రయం. ఉద్యోగస్థులకు పండితులనిపించుకోవాలని తాపత్రయమూను.

కరమహా: మా మాటో?

విదూ: తమ మాట చెప్పనేల? అంతా యెరిగినదే! నాపదవి మీద మీరు కన్ను వేశారు.

కృష్ణ: మొదటికే తెచ్చావూ!

విదూ: రామశబ్దంరాని నానామంత్రిచేత గీత ఉపదేశం చేయించడానికి తమరు తలపడ్డప్పుడు నాబిసుదులు నేను

తమకు సమర్పించక తీరదుగదా? (మహారాజు విదూషకుడి చెవిలో రహస్యము చెప్పును. విదూషకుడు టొంకరినడకతో నిష్క్రమించును)

కృష్ణస్వామి : (మాధవశర్మతో చిన్నగొంతుకతో రహస్యమాడి, పైకి) "ముఖే హారావాప్తిం" అన్న శ్లోకముపిషయమై మాధవ శర్మగారు ఒక చిత్రకథ చెప్పుతున్నారు.

కర్ణమహా : యేమిటండి?

కృష్ణస్వామి : మరేమీ లేదు. ఆ శ్లోకం దాహలాధీశుడైన కర్ణమహారాజును ఉద్దేశించి చెప్పినదట.

కర్ణమహా : యెంగిలిశ్లోకమా మాకు సమర్పణ అయినది!

కృష్ణస్వామి : చాలామంది కవులమనేవారు, యెంగిలి శ్లోకాల వల్లనే ప్రతిష్ఠ సంపాదిస్తారు.

రామశాస్త్రి : పరదేశికి యేలినవారియందు భక్తి యెలా వుంటుంది?

కర్ణమహా : పేరు ఒకటయితే యిట్టి తారుమార్లకు అవకాశం వుంటుంది.

కేశవభట్టు : యేలినవారికి తెలియనిదిలేదు. ఆ శ్లోకము మట్టుకు మిక్కిలి విలవైనది. చాలాకాలము కిందటనే రచిత మయిన యడల, ప్రభువులయొక్కా, పండితులయొక్కా, కర్ణగోచరము కాకుండునా? బిల్హణకవి కొత్తశ్లోకం చెప్పే పాటి సామర్థ్యంలేనివాడు కాడు.

రామ : మంచి శ్లోకవన్నది తలచినప్పుడల్లా స్ఫురిస్తుందా?

(విదూషకుడు ప్రవేశించును.)

కర్ణమహా : ఈయన కాశ్మీర రాజుల ఆస్థానము యేలవిడచికో, యెవరిక్కైనా తెలుసునా?

రామ: మనవి చెయ్యడమునకు వీలులేని కారణము చెబు తాము.

కృష్ణ: తన్ని తగిలేశారని ఈ మాధవశర్మగారే చెప్పాము.

మాధవ: నేనా చెప్పాను! తప్పుగా వినివుందురు.

విదూ: ఈకవిత్వం మాధవప్రణీతవంటే, వుండాలి.

కర్ణమహా: (కృష్ణస్వామితో) యెందుకు ఉచ్చాటన ఐందో?

కృష్ణస్వామి: కారణవంటూ విశేషకారణవేమీ లేదు. రాజు గారు వుంచిన వేశ్యసౌందర్యమును చూచి మనసు నిలప బూనినారు కారట.

కర్ణమహా: ఐతే రసికులే.

విదూ: ఆమాటకొస్తే, యితరమహాకవుల తక్కువ యేమిటో!

కృష్ణమిశ్రి చెప్పినట్టు యెంతటి వాడికైనా...

శ్లో॥ సంతు విలోకన భాషణ
విలాస పరిహాసకేళి పరిరంభాః
స్మరణమపి కామినీనామ్
అలమిహ మనసో వికారాయ.

కర్ణమహా: అందరికీ తెచ్చారా!

కేశవభట్టు: క్షమాపణ మనవి చేసి ఒక్కసంగతి శ్రుతపర్చు కుంటాను. బిల్హణుడు మహాపండితుడు. దేశదేశములు తిరుగును. అట్టివాడిని అనాదరణ చేసినయెడల, అప కీర్తి సాటగలడు. పండితులు శిక్షాస్త్రాలుకారు. "విద్వద్దండ మగౌరవం" అన్నాడు. నేనం యెంతవరకూ వున్నదో, వాడు యెంతవరకుసమాధానం చెప్పుకోగలడో, ఆ తత్వా

న్వేషణంకూడా కర్తవ్యమేమో అని సందేహం కలుగు తూంది.

మాధవ : అయితే, తత్వాన్వేషణం చెయ్యనిదే ప్రభువులు శిక్ష విధించారనా, మీ అభిప్రాయం ?

రామ : విష్ణ్వంశసంభూతులగు మహాప్రభువులు, అన్వేషణం అంటూ వకటి చెయ్యవలెనా నిజమును ?

"సతాంహి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః॥"

విదూ : ఆ సిద్ధాంతం అందరిమెళ్లకీ వుది అల్లుకోవడవే. యిప్పుడు ఒహడి పీకకు తగిలిస్తే, రేపు మన పీకకే తగులు కోగల్దు. ఇవుగో నానామంత్రి వస్తున్నారు. నిద్రపోతూన్న వాళ్ళ పీకలు తెగ్గొయ్యడానికి యింత మహాపీరుషు మరి లోకంలో లేదు. ఆ ధర్మసందేహ వేదో ఆయన తీరుస్తారు.

(మంత్రి నానాపంత్ ప్రవేశించును.)

నానామంత్రి : మహాప్రభో ! మహారాజకుమారికావారికి భగవద్గీతలు ఉపదేశం చేయించడపు అభిలాష యేలినవారికి కలదని, (శ్రీ) మాతామహారాణీవారితో నవుకరు మనవి చెయ్యగా మిక్కిలి సంతోషముతో వారు ఆమోదించారు.

కర్ణమహా : మీరు మనవిచేసిన తరువాత మరివకలాగు యేల ఔను?

విదూ : షాంవిషం పావే తియ్యాలి.

(నానామంత్రి కోపముతో విదూషకునివైపు చూచును.)

కర్ణమహా : అతని మాటలు సరకు చెయ్యకండి.

విదూ : భగవద్గీత కాశీలోనూ, కాంచీపురంలోనూ అభ్యసించిన పంతులువారికి కోపంవెందుకు వుంటుంది? అయినా నిజమైన మాటకు కోపంవెందుకు ?

కర్ణమహా : నిజమనేది యెట్టిదో ?

విదూ : అనుదినం భగవద్గీత పారాయణంమట్టుకు చేస్తూవుంటే ఆడే అబద్ధాలల్లా నిజవౌతాయి. యిది వక శుష్కక్రియ.

నానామంత్రి : యేమిటీ యీ మాటలకి అర్థం ?

కర్ణమహా : విదూషకుడి మాటలకు అర్థం ఆలోచిస్తా రేమిటి ?

కృష్ణస్వామి : కొందఱికే అతగాడి మాటలు ఆలోచించినకొద్దీ అర్థాలిస్తాయి.

నానామంత్రి : వెట్టికి వెయ్యర్థాలు.

విదూ : కేశవభట్టుగారిని ఒక వెట్టిధర్మసందేహం బాధిస్తూంది. ఆయన వెట్టి తీర్చి, తరవాత నావెట్టికి నైద్యం చేతుగాని.

(కర్ణమహారాజు కనుబొమలెత్తి కేశవభట్టును చూచును)

కేశవ : నిజం విచారించి మరీ శిక్షవిధించటం ధర్మశాస్త్ర పద్ధతేమోయని సర్వజ్ఞులున్నా, ధర్మస్వరూపులున్నా అయిన యేలికల సమక్షమంచు ఎంతో భయంతో మనవి చేసుకుంటున్నాను.

కర్ణమహా : యెంతమాటంటిరి; భయమేల? నేను రాజునైనను, కించజ్ఞుడను; రాజునౌటనే కించజ్ఞుడను అని అనవచ్చును. పండితులు, ప్రాజ్ఞులు వారివారి నమ్మకములను నాయెదట ముచ్చటించుటకు వెరచిరేని, నేను రాజ్యమునకు అక్కడనే కానే ?

కేశ : రాజాధిరాజ ! పండితరాజను శబ్దము. యేలినవారికే చెల్లెను. గ్రంథములు నెత్తిని మోయుటకు అస్మదాదులము కూడా మహాపండితులమే. అయితే, మోతచేటుగాని, వాటి గంధము ఆత్మలకు అంటక, చదువులు ఒకతెన్నూ చర్యలు మరివకతెన్నూ అయి కామలోభాదులచే జ్ఞానాంధులలైన మాబోట్లకు, పండితశబ్దము యెట్లుచెల్లును? లోకము పరిత్యజించి అడవుల్లో తపస్సుచేసే మునులకయినా లొంగని క్రోధాదులను నిర్జించిన యేలినవారే పండితులుగాని, ఈర్ష్యతీర్చుకొనుటకుగాను నిజమును కప్పి, ధర్మమును దాచి, అల్పమైన ఐహిక లాభముల నపేక్షించే మేమా పండితులము మహారాజా ?

కృష్ణ : ఈ ముక్కలేమో యెవరికీ తెలియనట్లు ఉపన్యసిస్తూన్నాము. రెండుకళ్ళతోనూ చూశామయ్యా అని ఘోషిస్తూవుంటే, అట్టి బలవత్తరమైన సాక్ష్యాన్ని మీపండిత దూషణ యేలాకొట్టగలదో, నాకు బోధపడకుండావున్నది. ఛాందసానికిన్నీ రాజ్యతంత్రానికిన్నీ చాలాదూరం వుంది.

నానామంత్రి : నాతో, దోపే వొప్పుకుంటేనే ! "ఆ తావళమనేది తాతాజీ మహారాజావారు నేపాళంమహారాజుల వద్ద సంపాదించాము. దీనితో అగ్జునుడు జపం చేసేవాడని ప్రతీతికూడా కద్దు. శివపూజాకాలమంపు మహాప్రభువాము, నమస్కరించి, కళ్ళనద్దుకుని మరీఛరించేవాము. మీయందు వుండే అసమాన గౌరవముచేత మీకిది అనుగ్రహపూర్వకముగా దయచేశాము. అది యెందుకు వక ఆస్థానపండితుడికి బహుమానంగా యిచ్చావయ్యా" అని

నే నడిగితే, యేవఁన్నాడంటే, "యీ కుళ్లుతావళానికి యీ దేశంలో కాబట్టి యింత మాన్యత కలిగింది, మా దేశంలో ప్రతి తుప్పునిండా ఏకముఖ రుద్రాక్షలే. తెగించి నాకు యింతబహుమానం చేసినందుకు మీ రాజు బెంగ బెట్టుకోలేదుగదా?" అని నిర్మొహమాటంగా అన్నాడు. నా కంటూ ఆ మాటతో వొళ్ళు నీరు విడిచిపోయింది.

విదూ: యెప్పుడు యీ ప్రసంగం జరిగిందో?

నానామంత్రి: నీ ప్రశ్నలకు సమాధానాలు నీలాటివాళ్ళే చెబుతారు.

కర్ణమహా: చిత్రం, కొందరికి యెలకంటే బెదురు; కొందరికి పిల్లంటే బెదురు; నానామంత్రిగారికి గౌతములంటే భేము.

నానామంత్రి: ఆమాట శలవివ్వనద్దు మహాప్రభో! యేలిన వాడూ అమ్మాజీవాడూతప్ప లోకంలో నాకు బ్రహ్మ భయం లేదు.

విదూ: యముడి భయవే లేనివాడికి, బ్రహ్మభయం యెలా వుంటుంది!

కృష్ణ: వారు చెబుతూవున్న సాక్ష్యం అబద్ధవో నిజవో మీకూ వినరాదూ?

కర్ణమహా: తరువాతండి?

నానామంత్రి: తరవాతేవొచ్చి, మళ్లీ అన్నాను "నారాయణ భట్టుగారి విద్యను మహారాజులు తగినట్టు గౌరవించ నట్టునూన్నా, యీ విషయంలో మహారాజుల లోపమును మీరు యెత్తిపొడిచి సవరణ చేసినట్టునూన్నా లోకానికి అర్థం

కాగలదు. మహారాజులు శాంతులని, యీలాటి నిరాదరణ చెయ్యరాదు"అని వేయివిధాల అతని మేలుకోరి, బోధచేస్తే "రాజులకేం తెలుస్తుంది విద్యల విలువ? రాజులు విద్యా ఘూకా" లన్నాడు.

విదూ : యీపాటికి బిల్హణుడు వూరి పొలిమేరదాటివుంటాడు. యెన్నిగోతాలు కోసినా ప్రతిబంధకంలేదు.

నానామంత్రి : అలా అనేట్టయితే, యిప్పుడు ఆయన్ని పిలి పించండి. యీ ఆస్థానమందు రుజువిప్పిస్తాను.

విదూ : అదుగో నారాయణభట్టుతో కలిసి ఆయనే వస్తు న్నారు. మీరు తలచేటప్పటికి బిల్హణుడు ఆకాశాన్నించి వూడిపడ్డట్టుంది. కాయసిద్ధుంది కాబోలు.

(నానామంత్రి వెనుకవైపు నిశ్శాంతపోయి చూచును. అలా చూచు చుండగా కర్ణమహారాజు స్వర్ణపేటికలోని రుద్రాక్షమాల తీసి ధరించును.)

నానామంత్రి : వైదికులు హద్దుమీద వుండరు. ఉచ్చాటనా శాసనమైనప్పటికి యెలా తోసుకువస్తున్నాడో! (ఉత్సాహ ముతో) అదిగో నారాయణభట్టుగారిమెడలో రుద్రాక్షమాల!

విదూ : ఆచిత్రవేంజూస్తారు, ఈ చిత్రం చూడండి. యిదుగో ప్రభువుల మెడలో ప్రభువుల రుద్రాక్షమాల!

(నానామంత్రి ఆశ్చర్యముతో మహారాజువైపుచూసి తిరిగి నారాయణ భట్టు కంఠమును పరికించుచున్న సమయములో బిల్హణుడు దగ్గరకాగానే మహారాజు నిలుచుండును. అందరూ నిలుతురు. అదిచూచి యెందుకో పోల్చు కోలేక, నానామంత్రి కూడా నిలుచును.)

కేళ : బోధపడ్డది "యీ హారము రాజపండితుడైన కర్ణ మహారాజు కంఠమును అలంకరించినది" అని బిల్హణకవులు

అన్నపుడు దాహళాధీశుడగు కర్ణుని ఉద్దేశించి చెప్పివుందురు.
కానలేకపోతిమి.

విదూ: యింతసేపటికి తర్కం పనిచేసింది.

కృష్ణస్వామి: అదిటండీ. అయితే మనమందరమూ బిల్వాణులకు అపరాధం చెప్పుకోవలసి వుంటుంది.

కేశ: చుక్కానికి న్యాయంగా పోతుంది స్వామిగారి మనస్సు. కలుషంలేదు.

కృష్ణ: పండితుడికి కలుషంవుంటే, మరి పండితుడేవిటండీ. ఆ మహారాజును చూసైనా నేర్చుకోవద్దా?

కర్ణమహా: (బిల్వాణ నారాయణభట్టులతో) దయచెయ్యండి. దగ్గరగా కూచోండి. (అందరును యవరి స్థలములయందు వాసు కూర్చుందురు.)

నానామంత్రి: (మాధవశర్మచెవిలో) నామాటలుగానీ వినివుండరుగద?

విదూ: అప్పుడు చాలాదూరంగా వున్నారు; వినివుండరు.
కర్ణపిశాచి వుంటే తప్ప.

కృష్ణ: నీకు వున్నట్టుంది కర్ణపిశాచి. యెక్కడలేని రహస్యాలు యెక్కలాగుతావు.

కర్ణమహా: (బిల్వాణుని ఉద్దేశించి) కవివర్య! అజ్ఞానానికి అంజనం యేమిటి?

బిల్వా: రాజపదవికి నైసర్గికమైన మహాంధకారమును తొలగించి, నిశ్చలమైన జ్ఞానోదయమువల్ల అరిషడ్వర్గమును తలచూపనివ్వకుండా తరిమిన, తమవంటి సత్పురుషుల సహవాసమే అజ్ఞానాంజనము మహారాజా! పండితసామాన్యమునకు విద్యన్నది జ్ఞానసాధకం కాక మాత్సర్యహేతువై యేయుండును.

విదూ : నానామంత్రిగారి అభిప్రాయమూ అదే. వారుమాట్లకు సాధనం లేకుండానే సాధ్యం సాధించారు.

కర్ణమహా : జ్ఞానాలోకమునకు ఉత్పత్తిస్థానము సూరులు. ఆ సూరుల సంసర్గంవల్ల నృపనామక పాషాణములకుకూడా కాంతిఆపాదన జౌతుంది. నాకుగల స్వల్పజ్ఞానము అమ్మాజీ వారిశిక్షవల్లనూ, మహాపండితుల సహవాసమువల్లనే కలిగినది. స్వామి మాకు బాల్యగురువులు. యిప్పుడు తాము అందరూ మాకు గురువులే. (మంత్రితో) మంత్రివర్యా, రేపటినుంచి బిల్హణకవులు మహారాజకుమారికావారికి గీతోపదేశం చెయ్యడముకు అభ్యంతరమేమీ ?

నానా : అభ్యంతరం అనగా అభ్యంతరం యెందుకుంటుంది మహాప్రభో !

కర్ణమహా : అయితే అమ్మాజీవారితో విన్నవించి వస్తాము. (లేచును. అందరు లేచుచుండగా) కూచోండి పెద్దలకు శ్రమయేల ? (నిష్క్రమించును. పండితులు చెదిరి గుంపులుగుంపులుగా మాటాడుదురు.)

నానామంత్రి : (మాధవశర్మతో) అడ్డంగా తిరిగిందే !

మాధవశర్మ : అదే నేను యోచిస్తున్నాను. ప్రవాహానికి యెదురీది ప్రయోజనం లేదు.

నానామంత్రి : అయితే వాడితో కలిసిపోతానంటారా యేమిటి?

మాధవ : ఆడుకొమ్మా, పట్టుకొమ్మా కనపడనప్పుడు యేం జేయను ?

నానా : మీరు భయపడక నిలబడిమాత్రం వుండండి, వీడికి ఉచ్చాటన మంత్రం మహారాణీవారితోటి వుపదేశం చేస్తాను.

చూడండీ, ఆస్వామి, వాడిలో యెంత ఆసక్తినో ముచ్చటిస్తున్నాడో! మనవాళ్ళలో కట్టులేదు.

మాధవ : పండితులు కుక్కల్లాగ కొట్లాడబట్టేకదండీ, పరాయి వాళ్ళు డబ్బు తన్నుకుపోతున్నారు! (బిల్హణుడున్న తావునకు వెళ్లును.)

నానా : (రామశాస్త్రితో) అస్త్రం అడ్డదిరిగిందండీ.

రామశాస్త్రి : తాము కొంచం అతి ఆచరిస్తారు.

నానామంత్రి : యేంచేయను, శాస్త్రులుగారూ? భగవంతుడు తీక్షణమైనబుద్ధిని యిచ్చాడు. అది విడవడదంటే, పట్టడానికి నాకే అసాధ్యమై పోతుంది. యిహ వూరుకుందునా?

రామ : తాము ఊరుకుంటే యేలాగ? బిల్హణుడు కుమారికావారిదగ్గర ఆనుకున్నాడంటే వారిని కలశమహారాజుకు వివాహం చేసే ప్రక్రియ నడిపిస్తాడు. ధారాపతినిగూర్చి మనం యిన్నాళ్ళాయి చేసినప్రయత్నం విఫలమౌతుంది.

నానా : చూశారా మొన్న కాశ్మీరరాజుతండ్రి అనంత భూపాలుణ్ణి, రాజుయెదుట భట్టువాళ్లా యెలా పొగిడాడో!

రామ : దానికి ప్రతిక్రియ అమ్మాజీవారి దగ్గిర తాము కల్పించాలి.

నానా : రాజు అసాధ్యుడుగద!

(బిల్హణుడు నానామంత్రి వద్దకువచ్చును.)

బిల్హ : (నానామంత్రితో) తాము పంపిన ద్రాక్షఫలముల వంటి ఫలములు మాదేశం విడిచిన తరవాత తినలేదు. పంపిన మీ దయకు చాలా సంతోషించాను.

కృష్ణస్వామి : (ఒకపాటి మెల్లగా, గాని వినబడేటట్టు) ముడ్డికాల్చి, మూతికి వెన్న రాసేవాడు, యింతవాడు మరిపుట్టబోడు.

నానా : (బిల్హాణుని దూరముగా కొనిపోయి) పండితులలో యెంత ఓర్వలేనివాళ్ళయినా వుంటారు. వీళ్ళ నెవ్వరినీ నమ్మకండి. అందులో మాధవశర్మ బహుదుర్మార్గుడు. యామినీదేవికి మీరు విద్య చెప్పబోతారని, ముక్కంటా, నోటంటా యేడుస్తున్నాడు. ఎప్పుడో మీమీద నిందయేదో తీసుకొస్తాడు. జాగ్రతమీద వుండండి !

(బిల్హాణుడు తన మొలలోనున్న చురికను చూపించును.)

నానా : మా నాయనగారికీ మీ నాయనగారికీ చాలా స్నేహం ఉండేది. తమకు తెలిసిందోలేదో మా తండ్రిగారు జ్యేష్ఠ కలశుల గుణవర్ణన తరుచుగా చేస్తూవుండేవారు. వాడు రెండుపర్యాయములు కాశ్మీరాస్థానమునకు రాయబారిగా వెళ్ళారు. అప్పట్లో తెచ్చినదే మా తోటలోని ద్రాక్ష.

బిల్హ : అలాచెప్పండి. అందుచేతనే ఆస్వాదుకలిగింది.

నానా : యిటుపైని అనుదినం తమకు పళ్ళుపంపి మరీ అమ్మాజీ వారికి పంపుతాను. మన తండ్రులు స్నేహితులైనందుకు యీనాటికి తిరిగి మనంకూడా స్నేహితులం కావడము కేవలము భగవత్సంకల్పంగాని ఒండు కానేరదు.

బిల్హ : కృతార్థుడను. స్నేహంయొక్క విలువన్నది దేశదేశాలు తిరిగే మాబోటి పండితులకే తెలుసును.

నానా : యిక్కడ వున్నంతకాలం మీకు'యే సహాయం కావల సినా అరమరలేక, యీమిత్రుడివల్ల పుచ్చుకొండి. అమ్మాజీ

వారి ఆగ్రహం మీాయందువున్నప్పటికీ నాప్రాణం వున్నంత వరకు, మీాకు అడ్డుపడతాను.

బిల్హా : నావిషయంమై ఒకరికి హాని రాకూడదు. యేమి ఆ ఆగ్రహాకారణము?

నానా : మహారాజకుమారికా వారికి తాము విద్య చెబుతా రనే.

బిల్హా: మహారాజావారి మనస్సు మళ్లించలేరో?

నానా : వారిక్రోధం అనివార్యం.

బిల్హా : తమసలహా యేవిఁటి?

నానా : యేం చెప్పను? యెప్పటికైనా వారివల్ల మీాకుహాని వుంది. రాజులక్రోధాలు మహాచెడ్డవి. దేశం విడిచి వెళ్ళి పోవడం వక ఆలోచన. మీాకు యెక్కడికి వెళ్లినా, రారాజులు నెత్తిని పెట్టుకుంటారు గాని మీారు వెళ్లిపోతే ఆ దురదృష్టం ముఖ్యంగా నాది. కుమారికావారితో పాటు నేనుకూడా తమవద్ద భగవద్గీతలు నేర్చవలె ననుకున్నాను.

బిల్హా : నావల్ల భగవద్గీతలు వింటే, మీారు ఉద్యోగం మానుకొంటారు. మహారాజ కుమారికావారు వివాహం మాని, సంసారం పరిత్యజిస్తారు.

నానా : నేను నాలుగుయేళ్లాయి ఉద్యోగం చాలించుకుని, భగవంతుడి సేవలో కాలంవెళ్ళబుచ్చుదామనుకుంటున్నాను. నేను ఉద్యోగంలో వుంటేనే గాని రాజ్యానికి ఆపాటం వస్తుందేమో అని మహారాణీవారైతేనేమి, మహారాజు అయితేనేమి నన్ను నిర్బంధిస్తున్నారు.

బిల్హ : మీయందు మాతా మహారాణీవారికి అంత వాత్స
ల్యత ఉండగా నాకు హానిరాకుండా మీరు వారిని మళ్ళించ
లేరో ?

నానా : మహాపండితులూ, మహాకవులూ ! తమకు నేను
జెప్పవలసిన ధర్మాలు కలవా ? రాజులు తాచుపాములు!
పట్టుదలేగాని లాభనష్టాలు గణించరు.

(నగరునుంచి ఆభరణ భూషితులగు స్త్రీలు బంగారు పళ్ళెరములలో సంక్రందన తాంబూలములూ పచ్చలహారమూ తెచ్చి నమస్కరించి బిల్హణునికి సమర్పింతురు.)

ఒకతె : అమ్మాజీ మహారాణీవారు తాము వారికి అంకితముగా
రచించిన గీతమునకు సంతోషించి వారు ధరించే ఈ పచ్చల
హారము తమకు దయచేయించిరి. ధరించి సముఖముగకు
రండి.

(బిల్హణుడితో నిష్క్రమింతురు)

నానా : (రామశాస్త్రిలు, మాధవశర్మ ఉన్నచోటికివచ్చి వారలతో)
ప్రభువులు ఒకమాటమీదను నిలిచివుండరు.

మాధవ : శకం తిరిగింది.

రామ : చక్రం యెప్పుడూ తిరుగుతూనే వుంటుంది. మరో
తిరుగులో, మీదు క్రిందికి దిగుతుంది. విచారమేలా ?

(తెర)

★

బిల్హణీయము

రెండవ అంకము

(నారాయణభట్టు యింటిసావిడి: నారాయణభట్టూ, శిష్యుడు వామనశర్మ ప్రవేశింతురు.)

నారా : అరనైమేళ్లు దాటి, యిప్పుడు కవిత్వం నేర్చుకోవాలంటే, యెలా సాధ్యవౌతుంది? రాజుకు కవిత్వం పిచ్చి, ఘట్టిగా పట్టుకుంది....యీ కవిత్వవన్నదానికి వోకతోవా, తెనూ్న, సవబూ, సందర్భవూ కానరాదు. యేదీ బిల్హణుడు చెప్పిన పద్యంలో మొదటి వాక్యం చదువూ.

శిష్య : (చదువును) "అంకం కేపి శశంకిరే జలనిధేఃపంకం।" చంద్రుళ్లో కళంకమును, కొంతమంది సముద్రంలో బురదగా భావించారు.

నారా : కొంతమంది మనుష్యులు, చంద్రుళ్లో వుండుకున్నషువంటి మచ్చయేదైతే వున్నదో దాన్ని సముద్రపు బురద అనుకున్నారని కదూ, కవి అభిప్రాయం? యే వెట్టివాడైనా యెన్నడైనా, అలా అనుకుంటార్రా? బిల్హణుడు మహా పండితుడేగాని, కవిత్వంలో దిగగానే, అసత్యం కల్పించాడు. యేవంటావ్?

శిష్య : ఔనండి.

నారా: ఇక పద్యం యెలాఅల్లాడో చూదాం..."అంకం" అనే ఒకమాటతీసుకున్నాడు. దానికి అనుప్రాసార్థం "పంకం"అనే

మాటొకటి యెత్తాడు.....అటుపైని "ఆ అంకానికీ, ఈ పంకానికీ, యెలాగయా అతకడం?" అని ఆలోచించి, యేం యెత్తుయెత్తాడంకే, పంకంసముద్రంలో వుంటుందిగదా, చంద్రుడున్నా సముద్రంలోనే పుట్టాడుగదా, ఆపుట్టడంలో బురద యేమాత్రమైనా వొంటికి అంటకుండా వుంచ్చుందా అని యోచించి, అంకపంకాలకి లంకె వేశాడు. అంతేకదూ?

శిష్య : అంతేనండి.

నారా : సరేగాని, బురదంటూ వొకవేళ తగిల్నా, యెవడ యినా కడుక్కోగ్రడా ? యిదంతా అసందర్భం. చాలా కానవస్తోంది.

శిష్య : అవునండి.

నారా : అయితే మనకూ కూడా వొక ప్రాసముక్క చూచి పెట్టు; శ్లోకం అల్లుదాం.

శిష్య : 'శంఖు' బాగుందండి.

నారా : బాగుంది. అయితే శంఖానికీ చంద్రుడికీ, యెలాగరా అతకడం?

శిష్య : యెలాగనా అండి, తెలుపు గనుక ఉపమానంచేదాం.

నారా : అంకం వొకటి తగలమతూవుందికదూ! శంఖానికి కళంకమేదీ?

శిష్య : కొంచెం మసిపూస్తే కళంకం సాధ్యపడుతుందండి.

నారా : ఓరీ, మూర్ఖుడా! శంఖం పనికిరాదు. మరోమాట చూడు.

శిష్య : శంకా?

నారా : శంకా?...శంకా?...శంకా... కళంకానికి శంకెలా తగిలించడంరా? ఆఁ, కుదిరింది, రాయి. (నారాయణభట్టు చెప్పాడు; శిష్యుడు రాయును.)

"అంకం కిమితి శశాంకే।
కథమిహ న్యూనాం విజాయతే శంకా॥"

"శశాంకుడిలోవున్న మచ్చ యేమిటని మనుషులకు శంక యెలాగు పుట్టగలదు?"

మహాబాగా వొచ్చిందిరా, శ్లోకం; యేవఁంటావు.

శిష్య : బాగానే వుందండి.

నారా : మహా, మహా, అనాలి. వొట్టి బాగుండడంకాదు. మహా బాగుందను. మొట్టమొదటికే తాళంపట్టాం. అనగా, శంకకే శంక తగిలించావఁన్న మాట. యీపద్యం చూస్తే, రాజు డంగైపోతాడు. వోమూల శశాంకుడని తానేఅంటూ యింకా అంకవన్నది, యేమిటీ, అని యెంత బుద్ధితక్కువ మనిషైనా అడుగుతాడా?

శిష్య : (నవ్వు ఆపుకుంటూ) యెవ్వడూ అడగడండి. ఉత్తరార్థం శలవియ్యరా?

నారా : యింకా ఉత్తరార్థంకూడా వుందిట్రా? యేమిసాధనం; చెప్పవలసిన అభిప్రాయం అంతా చెప్పేశాంగదా?

శిష్య : 'శంకర' అనే మరోమాట తీసుకుని శంకరుడి శిరస్సు మీద చంద్రుడు వున్నాడు గనక, యేదైనా వోహ కల్పన యెత్తితే సరండి.

నారా : అసలు శంకనే కొట్టిపారేశింతరువాత, మరి కల్పనకి

జూగా వొకటి వుంచావా? ఇక తోవ కనపడదే...కన పడదే...ఆహా దొరికింది, రాయి!

(నారాయణభట్టు చెప్పును, శిష్యుడు రాయును)

"అంకం కిమితి శశాంకే
కథాపి న్యూనాం నజాయతే శంకా॥"

"శశాంకుడిలో అంకంయేమిటి? అనే శంక నదులకు ఎన్నడూ కలుగనేరదు" ...ప్రశ్నోత్తరంగా వొచ్చిందిరా! యే మంటావ్?

శిష్యు: (నవ్వు ఆచుకొనను, ముఖం పక్కకు తిప్పి) బొనండి.

నారా: అట్టిశంక యెన్నడూ పుట్టనేరదని ప్రథమార్ధంలో ప్రశ్నకు సమాధానం మాబాగా కుదిరిందిరా. యేదీ పద్యం కలిపి చదువు.

శిష్యు: (చదువుతూ)

"అంకం కిమితి శశాంకే
కథమిహ న్యూనాం విజాయతే శంకా॥"

నారా: తగలేశావురా, బంగారంలాంటి పద్యం! కొంచెం రాగ వరసపెట్టి యూడవరాదూ?

శిష్యు: (రాగవరసతో) అంకం కిమితి శశాంకే (ఆ పైని చదవజాలక విరగబడి నవ్వును.)

నారా: యెందుకునవ్వుతావు? ఓరిపాడగట్టా! పద్యం బాగుంటె కాదంటావా యేమిటి? (నానామంత్రి ప్రవేశించును.) వ్రూకుకో! వ్రూకుకో! నానామంత్రొస్తున్నాను. ఆ పత్రం దాచెయ్యి.
(గురు శిష్యులు నిలుతురు)

నానా : యేవిటంట్రోయి, శిష్యుడిచేత రాయిస్తున్నారు?
(శిష్యుడితో) యేమి అబ్బాయీ! కనబడ్డవే మానేశావూ?

నారా : యేమీలేదండి. గ్రంథం రాయిస్తున్నాను.

నానా : (శిష్యుడితో) యేవీ ఆరాసింది చదువూ.
(శిష్యుడు తలగోక్కుంటూ గురువ్వేపు చూచును.)

నానా : (శిష్యుడిచేతులో పత్రం లాక్కుని చదువును. తలయెత్తి నారాయణ భట్టుతో) యవరు చెప్పారండీ యీ శ్లోకం?

నారా : మా శిష్యుడూ

శిష్య : యింతకన్న బాగా చెప్పగలనండి.

నారా : యేడిశావ్వూకో.

నానా : శ్లోకం మట్టుకు మహాబాగావుందండి.

నారా : బాగుందంటావా? నాకు అలాగేతోచింది.

నానా : బాగుండడవంటే ఆలాగా యిలాగా అనుకున్నారా యేవిటి? బిల్వాణుడి పద్యాన్ని పగలగొట్టారే!

నారా : మాశిష్యులు చెప్పమని పీక్కుతింటే యేదో చెప్పి చూడావని చెప్పాను.

నానా : తర్కం కురిసించిపోతిరే. యిఖ బిల్వాణుడు తలదాచుకోవాలి.

నారా : పద్యం అంత ప్రశస్తంగావుందని శలవిస్తారా?

నానా : 'శలవియ్యడం' కాదు 'మనవి' అనండి. మీశిష్యకోటిలోవాణ్ణి, ఆమాట మరిచిపోకండి. ఆ శ్లోక ప్రాశస్త్యానికి, అవధి అంటూ వుందండి? మీరే కవిత్వం చెప్పడం ప్రారంభిస్తే, ఈ కపీశ్వరులంతా సూర్యుడిముందర చుక్కల్లాగ చకాపికలై పోరా?

నారా : శాస్త్రాలు చదువుకున్న మా బోట్లకి కవిత్వం చెప్పడంవన్నది, తక్కువ పనికాదండీ ?

నానా : ఈ రోజుల్లో తక్కువ విద్యలక్కీ, తక్కువ మనుష్యులకీ యెక్కువ విలువ. "రాజద్రోహీ! తులువా!" అని, కాశ్మీరం నుంచి, అక్కడి రాజులు వెళ్ళగొట్టిన, యీ బిల్హణుడికి మహాప్రాజ్ఞులైన మన మహారాజులే, మీ అందరికంటే యెక్కువగౌరవం చేస్తున్నారు, కారా!

నారా : బిల్హణులను కాశ్మీరంనుంచి వెళ్ళగొట్టారండీ!

నానా : కూచోండి, చెబుతాను (శిష్యుడితో) అబ్బాయీ! మీరు కొంతసేపు అనతలకువెళ్ళి చదువుకోండి, చదువు వంటి వస్తువలేదు.

(శిష్యుని వెళ్ళమని గురువు సంజ్ఞచేయును. శిష్యుడు వెళ్ళును. నానా యణభట్టు నానామంత్రి కూచుందురు)

నానా : విన్నారా, కలశమహారాజు వొకవేశ్యను వుంచారు. ఆవేశ్యమీద బిల్హణుడు ఒక ప్రబంధంచెప్పగా, కలశమహారాజు సంతోషించి, బిల్హణుడికి ఆవేశ్యదగ్గిర ప్రవేశం కలుగజేశారు. యీ రాజులకి దయపుడితే, చెయ్యతగిన మర్యాదా, చెయ్యదగని మర్యాదా, కానరు. ఆపైని జరగవలసిన పనియేదో జరిగింది; దాంతో యీ తుంటరికవికి ఉద్వాసన అయింది.

నారా : యింత విద్వాంసుడుగదా, అలాజరిగి వుంటుందండీ ? పండితుడన్నవాడు శూద్రులవలె నీచవృత్తులకు దిగడు. కట్టుక ఎవరో యీ కథ కల్పించివుంటారని నా మతం.

నానా : మీకు లోకం తెలియదు. అట్టి సంశయమే మీకుంటే

యీ రంకు శ్లోకం చదివి నిజానిజాలు కనిపెట్టండి. దస్తూరీ యెవరిదో పోల్చారా? (పత్రం వొకటి చేతికి యిచ్చును.)

నారా: యేమిటండిది? దస్తూరి బిల్హణులదే అనుకుంటాను. (చదువును)

"అలమతి చపలత్వా త్స్వప్నమాయోపనుత్వా
త్వరిణతి విరసత్వా త్సంగమేనాంగనాయాః
ఇతి యది శతకృత్వ స్తత్వ మాలోచయామ
స్తదపి న హరిణాక్ష్యం విస్మర త్యంతరాత్మా"

ఈ కవిత్వమూ, శృంగారం అన్నవి యెంతటి పండితుడికైనా, కళంకం తేకమానవు. అందుచాతనే మా తండ్రిగారు కవిత్వం చెప్పబోయేవుసుమా, చెడతావని శలవిచ్చేవారు. నే చెప్పినశ్లోకం చింపెయ్యండి.

నానా: యిది చింపవలసిన శ్లోకంకాదు. మహారాణీవారికి చూపిస్తాను. బిల్హణుణ్ణి కొట్టగలిగినపాటి కవి, మన ఆస్థానంలో వొకరంటూ వున్నారుగదా అని వారు యెంతో సంతోషిస్తారు. ఈమూలంగా మీపైని మహారాణీవారికి కలిగిన ఆగ్రహం కొంత మళ్ళగలదు.

నారా: నామీదే ఆగ్రహం! యేం, నాయనా! యేం నాయనా! యెన్నడూ యేపాపం యెరగనే!

నానా: మీఅంత అమాయకమైన బ్రాహ్మణ్ణి నేను ఎక్కడా చూడలేదు. వూరందరికీ తెలిసినమాటైనా మీకు తెలియదు.

నారా: నావంటి బీదబ్రాహ్మడియందు ఆగ్రహానికి కారణ మేమిటి నాయనా?

నానా : ఒకకారణం, స్త్రీలోలుడైన ఈ బిల్హణుడి సహవాసం చేస్తున్నారనే! రెండోకారణం, మీరు ఈ ఆస్థానంలో పండితులయిపుండీన్నీ. భిక్షాటనంచేసే పరదేశ పండితుడివల్ల బహుమానం పరిగ్రహించడం, ఆ పరిగ్రహించిన తావళం మెడనివేసుకొని నిర్భయంగా తిరగడం! నేనంటూ, యెంగోదూరం మీ యోగ్యత, శ్రీవారి సమక్షంలో మనవి చెయ్యబట్టి, మీకు అట్టే హాని లేకుండా సరిపోయినది.

నారా : పిల్లలవాళ్లో, మహారాజా, నాకొక హాసిరాకుండా కాపాడండి. నాకు లాక్ష్యం లేదియదు. అయితే ఈ తావళం అతగాడికి పంపివేదునా?

నానా : అదికాదు కర్తవ్యం. మీకు సమ్మతమైతే, నేనొక ఉపాయం చేస్తాను. రుద్రాక్షలు ప్రతిబైరాగిదగ్గిరా దొరుకుతాయి. వాటికి విలువేమిటి! బంగారం యేమాత్రం వుంటుందో?

నారా : ఇరవైతులాలు వుంటుందని, మాయింటి ఆవిడ అంది.

నానా : చూశారా, మొగవాళ్ళకంటె, ఆడవాళ్ళకి యెక్కువ బుద్ధి వుంది. "క్షణశః కణశశ్చైవ విద్యా మర్థం చ సాధయేత్" అన్నాడు. యీతావళం యెప్పటికైనా మీకు దక్కేదికాదు, గనుక, ఆ యిరవైతులాలమీదా మరి నాలుగు తులాలువేసి, ఆ విలువగల కాసులు యిస్తాను; అవి పుచ్చుకొని అక్కగారికి ఒక కాసులపేరు చేయించండి. రండి; అక్కగారితో ఆమాట నేను స్వయంగా మనవి చేస్తాను. (ఇద్దరును యింటిలోకి వెళ్తారు)

(కేశవభట్టు ప్రవేశించి, యిటుఅటూ చూచి, యెవరినీ కానక ఒక మూల కూచుని పుస్తకపత్రాలు తిరగవేస్తూ వుండును. కొంతసేపటికి రుద్రాక్షతావళమూ, ఒక పత్రమూ పట్టుకుని, నానామంత్రిన్నీ, సంతోషంగల ముఖంతో నారాయణభట్టున్నూ ప్రవేశింతురు. వీరు, మూల కూచున్న కేశవభట్టును చూడరు.)

నానా : యిటుపైని బిల్వాణుడితో కలియకండి. మాట్లాడ్డం కూడా తప్పించుకోండి. రుద్రాక్ష తావళం యేమైపోయిందని యవరడిగినా, పోయిందనండి. రాజడిగితే అమ్మేశాననండి.

కేశవభట్టు : (ముందుకువచ్చి నిలిచి) యీ అబద్ధాలు ఆడవలసిన అవసరం యేమిటండి ?

నానా : మరేంలేదు. నారాయణభట్టు ధనికులుకాదు. పిల్లల వాళ్ళు. అక్కగారి వంటను అట్టే హంగులేదు. అందుచేత, యీ రుద్రాక్షతావళం విక్రయించి, ఆ సొమ్ముపెట్టి బంగారం కోసమని నాకు అక్కగారి శలవుకాగా, కాసులు తెచ్చి యిప్పుడే దాఖలు చేశాను.

కేశ : కావొచ్చును. కాని బిల్వాణులతో కలియకపోవడానికీ, మాట్లాడకపోవడానికీ కారణమేముండునో కొంచెం శలవు దయచేయిస్తారా ?

నారా : వేశ్యమాట మీకు తెలియలేదు కాబోలు ?

కేశ : వేశ్యమాట యేమిటండి ?

నారా : బిల్వాణులు, కలశమహారాజులు వుంచిన వేశ్యతో స్నేహం లావుచేశారట. అందుచేతనే వారు దేశంనుంచి తోలివేశారట.

కేశ : యే దుష్ట యీకల్పన కల్పించాడండీ ! (నారాయణభట్టు నానామంత్రివేపు చూసి వూరుకొనును.)

కేశ : (నానామంత్రితో) తమరు యిప్పుడు దయచేయించినన్ని కాసులు నేను తమకు దాఖలుచేస్తాను. భట్టుగారికి నేను చాలాసొమ్ము బాకీవున్నాను. ద్రుద్రాక్ష తావళంయొక్క విలువ అన్నది ఆ బంగారంలో లేదండి, ఆమాల అమూల్యమైనది; అది యిలా దయచెయ్యండి, వారికంఠమందు తిరిగి వుంచుతాను.

నానా : అలాగయితే నేనే వుంచుతాను. (మాల నారాయణభట్టు మెడ వుంచబోవును)

కేశ : తమ కంత్రశమెందుకూ? నేనే వుంచుతాను. (కేశవభట్టు మాలను పట్టుకుని తాను వుంచ ప్రయత్నించును)

నానా : నేను వుంచితే తప్పా !

కేశ : తమకు తగిలించవలసిన సూత్రం యెప్పుడో ఒకప్పుడు మా అందరికీ వుండనేవుంది.

(కేశవభట్టూ, నానామంత్రీ తావళంతో పెనుగులాడుతూ ఉండగా తావళం తెగుననే భయంచేత, నారాయణభట్టుకూడా తావళము పట్టుకొనును. యింతలో బిల్హణుడు ప్రవేశించును. ముగ్గురూ పట్టువొదలగా, తావళమూ, నానామంత్రి చేతి పత్రమూ, నారాయణభట్టు చేతి పత్రమూ, నేల పడును)

బిల్హణుడు : (తావళమును, పత్రములను యెత్తి) యేమిటీమరంతం ? ఈ పండితాగ్రేసరుడికి యెట్టి పాటువచ్చినది ! ఈ ఉత్కృష్ట మాలకు యెట్టిపాటు వచ్చినది ! (ఒకపత్రము చదివి) ఇది నానా

మంత్రిగారి కవిత్వం కానోపును. (రెండవ పత్రం చూసి, ఆశ్చర్య పడి) యిది యిక్కడి కేలావచ్చింది?

కేశ : యేమిటండి ఆపత్రం?

బిల్వా : (ప్రత్యుత్తర మియ్యక) యిక్కడ కేలావచ్చెను, యీ పత్రం?

నారా : చెప్పవద్దని నానామంత్రిగారు, నాచేత ఘోరమైన ప్రమాణం చేయించారు.

నానా : (బిల్వాణుడి చేతులు తన చేతులతో పట్టుకొని) క్షమధ్వం! క్షమధ్వం!

బిల్వా : "క్షమధ్వం" యేమిటి?

నానా : నావల్ల గట్టి పొరపాటు వచ్చింది. క్షమించండి. తమ వంటి మహాపండితులకు, ఆగ్రహావన్నది వుండదు. యీ శ్లోకం కాశ్మీర మహారాజులు వుంచిన వేశ్యను ఉద్దేశించి తాము రచించినారని తమశిష్యుడొకడు తెచ్చి నాకు చూపించాడు. దాంతో నాకు అనుమానం కలిగినమాట సత్యం. అనుమానంకలిగి తమతో సంబంధం యొదులు కొమ్మని, నారాయణ భట్టుగారితో నేను చెప్పినమాటా సత్యమే. వారిమంచి కోరి ఆలాచెప్పాను. అంతేగాని మీకు అపకారం చేదామని కించిత్తుఅయినా నాఅభిప్రాయంకాదు. ఆ సోమనాథుడు సాక్షి. అబద్ధవాడితే నానెత్తిమీాద ఆకాశవంత పిడుగుపడిపోవాలి. తమవంటి మహానుభావుల విషయమై క్షుద్రులు చెప్పినమాటలు నమ్మడం బహు పొరపాటు. కేశవభట్టుగాను యీవేశ్యకథ అంతా శుద్ధ

అబద్ధవఁని యిప్పుడే శలవియ్యగా, "యెంతటి కబుర్లయినా పుట్టించే దుర్మార్గులు వుంటార"ని ఆశ్చర్యపడ్డాను. వారి మాటంటే నాకు చాలాగుబుతు.. క్షమధ్వం అని తిరిగీ ప్రార్థిస్తున్నాను.

బిల్హ : (కొంతతడవు ఆలోచించి, తావళము నారాయణభట్టు మెడను తగిలించి) నేను వెళ్ళిపోయినదాకా అయినా, యిది మెడని వుండనియ్యండి. ఆతరవాత యెలాగా మీకు దక్కదు. అప్పట్లో యీదుష్టమంత్రికి యీ మహాహారమును అర్పించి ప్రాణం కాపాడుకోండి. శూరాగ్రేసరుడైన దాహలాధీశుని కంఠంనుంచి దుష్టాగ్రేసరుడైన యీకుమంత్రి కంఠమునకా! దీనికి యేకాలానికి యేఅవస్థ వస్తుందో కానలేం. (నానా మంత్రి దగ్గరకువెళ్ళి ముఖంమోద ముఖం వుంచి) నామూలముగా యీ అమాయకుడైన బ్రాహ్మడికి అపకారం చెయ్యకండి. మీయందు నాకు ఆగ్రహంలేదు. మీ కుట్రకల్లా లక్ష్యం నేను యీదేశం విడిచివెళ్ళడవేగదా? మీరు అట్టే శ్రమ పడకండి. వెంటనే వెళ్ళతలచినాను. ఆహా యేమిదేశం! యేమి మనుష్యులు! (నిష్క్రమించును)

నానా : యీ కళంకం లేకుండావుంటే, యింతవాడు మరి లేడు.

నారా : ఆ వార్త అబద్ధవఁన్నా రే?

నానా : అలా అనకపోతే, మొహంయదట యేవఁన్ను ?

కేశ : అయ్యా, ఒక మనవి! తమ ఆగ్రహం మా వుభయుల యెడలా ప్రసరింపచెయ్యమని తాము వరం అనుగ్రహిస్తేనే,

యీ దేశంలో వుంటాం. లేకుంటే, దేశాంతరం పోతాం. మేము అల్పులం. తాము ఆస్థానంలో చాలివున్నారు. వ్యవహారస్థితి యెప్పుడు యేకీభవిని. వుడుమో తెలియదు. యీతావళం తాము వుపసంహరించండి. యీసంగతి మేం యెవరితోనూ చెప్పం. మేం పండితులం; అనేది వొక మాటా, జేసేదీ ఒకపనీ కానేరదు. మా మా స్వభావాలు కూడా, యీ పాటి తాము కానే వుంటారు.

నానా : రామా రామా! తావళం నా క్కావాలనుకున్నారా యేవిటి? అక్క-గారు ముచ్చటపడ్డారుకదా అని కాసులు తెచ్చాను. మీ వుభయులకీ నా కంఠంలో ప్రాణం వుండగా హానిరాకూడదు. మీ నాయనగారికీ మా నాయనగారికీ ఉండే స్నేహానైనా ఆలోచించుకోనా? పండితులంటే నాకు ప్రాణం కాదా? నేను శుష్క జంయునుణ్ణి అనుకున్నారా యేవిటి? అక్క-దగ్గర శలవుపుచ్చుకొని వెళతాను. మీ యోగ్యత వేరే నాతో చెప్పాలా?

(తెర)

★

1501

బిల్హణీయము : అముద్రితభాగము

బిల్హణీయము

* రెండవ అ'ంకము

స్థలము

, అనిహిల్ల పట్టణమునకు కొంచముదూరంలో సరస్వతీ నదీతీరమందు కాశ్మీరరాజపుత్రులు వలసవచ్చి విడిసిన పేట. ఒక ఉద్యానవనము మధ్య ఆ కాశ్మీరుల యజమానిన్నీ, కాశ్మీర మహారాజులకు బంధువునూ, ఒకప్పుడు కాశ్మీర రాజ్యములో సామంతరాజునూ అయిన చంద్రవర్మ అనే రాజుయొక్క భవనము. తోట మిక్కిలి రమ్యమైనది.

చంద్రవర్మనూకుడు, విద్వాంసుడు, లోకానుభవము కలవాడు. మహమ్మదు ఘజినీ సోమనాథక్షేత్రమును కొట్టి నప్పుడు ఈయన కుమారుడు ఇంద్రవర్మ, యుద్ధంలో మృతి పొందెను. ఇంద్రవర్మకు రణశింహుడను పంకొమ్మిదియేళ్ళ ప్రాయంగల ఒక కుమారుడును, పదహారేళ్ళ ప్రాయము గల కుమార్తెయును కలరు.

చంద్రవర్మగారి భవనమునకు సామీప్యములో ఆ యుద్యానవనములోనే ఒక కొలనువద్దన ద్రాక్షతీగలల్లిన మంటపములో చిత్రాసనమువీడ జమిలిస్తంభములకు చేర్చిన దిండును చారబడి బిల్హణుడును, యెదట మరివక చిన్న చిత్రాసనమువీడ రణసింహుడు కూచునియుందురు.

---

* ఇది అప్పారాయకవి చిత్తుప్రతిలోని భాగం. మతము, కవిత్వ తత్వములను గూర్చిన విచారణ యిందుకలదు. ఇది సాహితీపరులకు ఉపకరించ గలదని యీ సంపుటిలో సంతరించాము.

బిల్హణుడు : (పత్రము చేతపట్టి చదువును)

అస్యాశ్చర్య మయస్య మన్త్రిగతయ: స్వైరం తరంగై రపి.
జ్ఞాయన్తేనవిధేరివాతికుటిలా వైదగ్ధ్యసీమా భువ:
శ్రూయన్తే ప్రతిభూభృతాం వసతయ స్సంగత్తరంగావళీ
విశ్వోత్ఖేల ఖురాగ్రఖణ్డితమణి క్ష్మోణీతలా: కేవలమ్॥

రణసింహుడు ; ఆహా ! యేమిశ్లోకం !

బిల్హ : కుమార, ఇది వినండి.

వాత్సల్యం నవహత్యపత్యవిషయే వ్యాక్షిప్యతే న క్షణం
డాక్షిణ్యేన సమూహితే నవవధూ వర్గేపి ధీరాశయ:
నిష్ణాతా: కుటిలేన యా ధ్వని చరన్నాచారపూతా:ప్రభో:
దుస్సాధ్యా నపి సాధయత్యభిమతా నర్థాన్న సాధ్యానపి॥

రణ : తమవంటి మహాకవులవల్ల కృతి పొందడముచేత అమాత్య సంపత్కులు జన్మ సఫలమైనది. ఆ మహాపురుషుడు అసమాన ప్రతిభావంతుడు, దయాళుడు, ప్రభువిశ్వాసపాత్రుడు. మరిన్నీ యీరాజ్యానికి కాలగతిచేత వలసవచ్చిన మమ్మును కాపాడుతున్న పరమమిత్రుడు. తమ పొగడ్తకు తగినవాడే గాని జైనుడుకాకుంటే యెంతో బాగుండును కదా అని అనుకుంటాను.

బిల్హ : (చిరునవ్వు నవ్వి) ప్రభువు నమ్మినబంటయి, మిమ్మల్ని కాపాడుతున్న మిత్రుడైతే, లోకోపకారధురీణుడైన యప్పుడు, ఆయన మతం మీకు యెక్కడ అడ్డువచ్చెను కుమారా ?

రణ : సకలసద్గుణసంపన్నుడుగదా, మతంగూడా మంచిదైతే,

చంద్రుడికి కళంకం లేనట్లు వుండును గదా అని నా మనస్సున కొరత.

బిల్వా : కుమార, నిజమైన జ్ఞానమును సాధించవలెననే అభిలాషగల మీ బోటి పండితులకు పరమతములయందు అసూయ వుండకూడదు. ఈ భూప్రపంచమందు లెక్కలేని మత్తాలు వున్నవి. అన్ని పేరెక్కిన మతములలోనూ పండితులూ, సత్పురుషులూ కలరు. అన్ని పేరెక్కిన మతముల లోనూ సంసారమును తరించే సాధనములు కలవు. ఆ యా సాధనములను అవలంబించి ప్రాజ్ఞులు ధర్మమార్గానువర్తులై, సదా లోకోపకారపరీణులై ఆయా మతములకు వన్నె తెత్తురు. అందుకు అమాత్య సంపత్కరులే దృష్టాంతము. అప్రాజ్ఞులు ఆత్మలాభమునే అపేక్షించుచు అట్టి లాభము సమకూడుటకు వంకరతోవల నడచి, తామసులై పరులను పీడించుచు జీవికలేని జపతపాదులను చేయుచు లోకమును దేవ్రడినికూడ మభ్యపరుప యత్నింతురు. అట్టివాడు నానా మంత్రి. పేరుగల మతమల్లా సత్ప్రవర్తనను, భూతదయను ముఖ్యములని సాటుతున్నవి. వైదికమతములకన్న బౌద్ధ, జైన మతములలోనే వీటికి ప్రాముఖ్యతలావు. సత్ప్రవర్తనఅనేది ఆత్మకు కవచము. భూతదయ అనే ఉపాసన ప్రత్యక్షస్వర్గమై సద్యోతానందదాయకము. నిర్వ్యాజమైన యీగుణములతో మేళనలేని జపతపాదులు వ్యర్థములు. మనస్సునొక్క దుర్వ్రత్తులను మళ్ళించడం అల్పబుద్ధులకు సాధ్యంకాదు. ముక్కుబిగించుకు కూచొనుట ప్రతికొంగకూ సాధ్యమే. గాన వైదికుడైన నానామంత్రికన్న, జైనుడైన సంపత్కరులే

శిష్టు. నాలుగుదేశాలూ తిరిగి నాలుగుదేశాలవారితోడనూ అన్నదమ్ములవలె బతికినవాళ్ళకు మతాభిమానాలు మాసిపోతాయి. బుద్ధికి సంకెళ్ళు విడిపోతాయి.

రణ : జైనులు వేదబాహ్యులుగదా అని.

బిల్హ : ఆమాటకువస్తే మన దర్శనాలు అన్నీ వేదప్రామాణ్యమును సర్గ్గా వొప్పుకున్నవా? వొప్పుకున్నవి మాత్రం వక్కరీతిని వొప్పుకున్నవా?

రణ : (యోచన నటించి) అవును నిజమేనండి.

బిల్హ : మరి యేలా వేదములనుగూర్చి అభిమానము? అన్ని మతాలవారూ వొప్పుకునే శబ్దప్రమాణము వక్కటే నాకు కనపడుతున్నది. అందులో నాకంటే మీరే పండితులై వుంటారు.

రణ : యే విద్యలోనైనా తమ పాదములవద్ద శుశ్రూషచేసి, అభ్యసించడముకు అప్పుడనుగాని, తమయెదుట నేను పండితపదవాచ్యుడను యెన్నడూ కానేరను.

బిల్హ : నే చెప్పవచ్చిన సర్వమతసమ్మతమైన శబ్దప్రమాణమనేది ఇట్టిది అని చెప్పడముకు శక్యముకాని ఆనందమును కలుగజేసే విలాసవతీ సంబంధి శబ్దప్రపంచం. (తల తడిమి) ఒకొక్కవెంట్రుక నెరుస్తున్నది గనుక ఆ శబ్దప్రపంచము విషయంలో బధిరత అప్పుడే మమ్మలను ఆవహిస్తున్నది.

రణ : పూర్ణ యౌవ్వనముయొక్క శృంగార రసగ్రహణశక్తి, వార్ధక్యముయొక్క జ్ఞానసంపత్తి, ఆరెండు అవస్థలకూ సహ

1564

జమ్ములైన దోషములు అంటకుండా, మహాకవులయందు సదా కలిగివుంటవి.

హేలాభ్యస్త సమస్త శాస్త్రగహనః సాహిత్యపాథోనిధి
క్రీడాలోడన పండితః ప్రియతమః శృంగారిణీనామ్ గిరామ్॥

అని కర్ణమహారాజు యెవరిని గురించి చెప్పగలిగారు? వస్తుప్రపంచములో జనసామాన్యమునకు గోచరముకాని రామణీయకమును కనిపెట్టకలిగినవారు కవులే కదా!

బిల్వా : కుమారా, యింత పరిజ్ఞానమూ, గుణసంపత్తీ కల మీరు పండితులు కాకపోతే యింక యెవరు పండితులు. సత్యమే; స్వర్గనరకము లనేవి యీ లోకంలోనే వున్నవి. చూడనేర్చినవాడికి ప్రతిదేశంలోనూ కలవు; నందనవనాలు, దేవతా స్త్రీలూ, మహర్షులూ. అట్టి భూలోకమందుగల ఆ స్వర్గరామణీయకమును కావ్యములుగా సర్వజనవేద్యము చేసినాడనికదా కాళిదాసును నేను మెచ్చుకుంటాను. ఊర్వసి పురూరవుడి కన్నులు మూయుటకు దొంగ తనముగా వెనుకపాటున వచ్చినపుడు ఆమె అండెలయొక్క అణగీ అణగని చడియొక్క సొగసు కవులలోకల్లా కాళిదాసుకదా గ్రహించెను. "గూఢం నూపుర శబ్దమాత్ర మపి మే కాంతం శ్రుతౌ పాతయేత్" కవిత్వంలో ధ్వని అన్నది ఆ అండెల చడిలాగు వుండవలె. చూడండి కుమారా, నేను చెప్పిన శబ్దప్రమాణమును కాళిదాసేగదా నిర్వచనం చేశాడు.

"సామన్తసకాళిమణిరఞ్జితపాదపీఠ
మేకాతపత్ర మవనేర్న తథా ప్రభుత్వమ్,
అన్యాస్సఖే చరణయో రహ మద్యకాన్త
మాజ్ఞాకరత్వ మవిలంఘ్య యథాకృతార్థ్ధి"

ప్రియురాలి ఆజ్ఞకు చక్రవర్తులు బద్ధులు. ఇతరులమాట చెప్పనేలా.

*

బిల్హా : అస్యాశ్చర్యమయస్య మన్త్రిగతయుః స్వైరంతరంగైరపి।
జ్ఞాయన్తే నవిధేరివాతికుటిలా నైదగ్ప్రసీమా భువః।
శ్రూయన్తే ప్రతిభూభృతాం వసతయ స్సంగస్తరంగావళీ।
విశ్వోత్పత్తిల ఖురాగ్రఖణ్డితమణి క్ష్మోణీతలాశ్చ కేవలమ్.

రణ : ఆహా యేమిశ్లోకం గుర్రాజా!

బిల్హా : కుమార, ఇది వినండి.

వాత్సల్యం నవహత్యపత్యవిషయే వ్యాక్షిప్యతే న క్షణం।
దాక్షిణ్యేన సమీహితే నవవధూ వర్గేపి ధీరాశయ।
నిష్ణాతత్వ కుటిలేన యా ధ్వని చరన్నాచారపూతత్వ ప్రభో
దుస్సాధ్యానపి సాధయ త్యభిమతా సర్థాన్ను నాధ్యానపి.

రణ : మహామాత్య సంపత్కరుడు మీవంటి మహాకవివల్ల కృతిపొందడం; యేమి అదృష్టవంతుడు. మనకు ఆప్తుడు తమ పొగడ్తకు తగినవాడేగాని క్షైనుడు కాకుండావుంటే బాగుండును.

---

* ఇది ద్వాత్రప్రతిలోని రెండవ అంకములోని రంగము: చంద్రవర్మ భవన సామీప్యమున ఉద్యానవనములో కొలనువద్దున కూర్చున్న బిల్హాణ రణసింహుల సంభాషణము; దీనికి ముందు అచ్చొత్తించిన ద్వాత్రప్రతిలోని భాగమునకును, దీనికిని స్వల్పభేదము కలదు. యామినీదేవిని రణసింహుడు ప్రేమించినట్లు, అతని ప్రేమభావము యిందుసూచితము. యామినీదేవివిషయమందు పొడమిన రణసింహుని ప్రేమ యెట్లు పర్యవసించునో ఊహింపలేము. కాని, యీ కథాబీజము నాటికమునకు ప్రధానమువలె కనబడుతున్నది. సంస్కృత మూలమునలేని కథాకల్పనలకు మహాకవి యీ నాటికమున కాపించిరి. అట్టి కల్పనలలో యిది ముఖ్యమైనది. నాటికమున కిది ఆయువుపట్టు

బిల్వా : (చిరునవ్వు నవ్వి) కుమార ! నిజమైన జ్ఞానమును సాధించ వలెనన్న పండితుడికి పరమతములయెడల అసూయ వుండ కూడదు. యీ భూప్రపంచమందు లెక్కలేని మతాలు వున్నవి. అన్నిమతాలలోను ప్రతిభావంతులు, మహాపండి తులూ కలరు. మన మతమే నిజమూ పరమతములన్ని అబద్ధమూ అనుట అజ్ఞత. యే దేశంలో, యే మతంలో యేమేమి మేలువుంటే అదల్లా గ్రహించదగినదే. నాలుగు దేశాలూ తిరిగి నాలుగుమతాలవాళ్లతోనూ అన్నతమ్ముల్లాగ బతికినవాళ్ళకి మతాభిమానాలు మాసిపోతాయి. బుద్ధికి సంకెళ్ళు విడిపోతాయి. నైదిక మతావలంబియై రోజూ రెండుఝాములు మథంవేసి జపతపాలుచేసే నానా మంత్రి ప్రవర్తనకు, జైనుడై వేదబాహ్యుడైన సంపత్కరుడి ప్రవర్తనకు కలభేదము చూస్తిరిగదా ! నానామంత్రి తనకు తెలుసునని, గర్వించే ఆ భగవద్గీతలోనే తొమ్మిదవ అధ్యా యంలో దేవప్రకృతి, రాక్షసప్రకృతి వర్ణింపబడియున్నవి. అందులో నైదికుడైన నానామంత్రియందు ఆదిరాక్షస గుణములు మూర్తీభవించివున్నవి. జైనుడైన సంపత్కుమా రుడియందు దేవగుణాలు వున్నవి. గీతిలోకల్లా విలనైన శ్లోకాలు ఆ అధ్యాయంలో వున్నాయి. ఇవి మనసును పట్టినవాడు తన్నూన్న, లోకాన్నూకూడా జయిస్తాడు.

రణ : అయితే వేదములు ప్రమాణములు కావా ?

బిల్వా : మనదర్శనములు మాత్రం అన్నీ వేదప్రమాణం అంగీ కరించాయా, వక్రీతిని అంగీకరించాయా. అన్ని మతాలూ వొప్పుకునే శబ్దప్రమాణము నాకు ఒక్కటే కనబడుతున్నది.

రణ : ఏమిటండి అది.

బిల్హా : యూవ్వనులైన మీరెకుగరా, కుమారా ?

రణ : పోల్చలేకుండావున్నాను.

బిల్హా : విలాసరతులతో సంబంధించిన శబ్దజాలం. ఆ శబ్ద ప్రమాణం సృష్ట్యాదినుండి అన్నిమతాలవారూ శిరసా వహించుకుంటున్నారు. ఆ ప్రమాణంయొక్క బలం నిన్నటి రోజునే నాకు వ్యక్తమయింది.

రణ : (అయిష్టముతో ముఖమున కనపర్చి తరవాత చిరునవ్వు నవ్వును.)

బిల్హా : కుమారా ! గురువుమీద శిష్యులకు అలకపొడమిందా ? ఏమి యీ బ్రాహ్మడు మహారాజ కుమారికల శృంగారం విషయమును ప్రలాపంచేస్తున్నాడా అని కావచ్చు. తరవాత, ఇంతపండితుడు * అయినాడా అని నవ్వువచ్చినదా ? అయితే బిల్హణుడు కవిశేఖరు డన్నమాట మరచితిరి కుమారా! కవి అంటే యెవడు. వస్తుప్రపంచమునందు యితరులు చూడలేని సొగసులు చూసేవాడు. యితరులకు ఆవేద్యమైన రసమును అనుభవించేవాడు. కాళిదాసును యీ విషయంలో యెంతైనా మెచ్చవలసివున్నది. ప్రియురాలు, దొంగతనంగా ప్రియుడి వెనకపాటున కనుమూయుటకు వచ్చేటపుడు, ఆమె అందెలయొక్క అణగిఅణగిన చడిసొగసు కవుల్లోకల్లా అతనే గ్రహించాడు! గూఢం నూపుర శబ్దమాత్ర మపి మేకాంత వచోపాతయేత్.

---

* ఇచ్చట ప్రాతప్రతిలో యే శబ్దము ప్రయోగింపబడలేదు. ఒట్టి ఖాళీజాగా వదలివేయబడినది.

కవిత్వంలో ధ్వని ఆ అందెలచడిలా వుండాలి. ప్రియురాలి శబ్దప్రామాణ్యం మళ్ళీ కాళిదాసే చెప్పాడు.

సామన్త మౌళి మణిరఞ్జిత పాదపీఠ
మేకాతపత్రమవనేర్న ఖిలా ప్రభుత్వమ్
అస్యాస్సఖే చరణయో రహ మవ్యకాన్త
మాజ్ఞాకరత్వ మధిగమ్య యథాకృతార్థః.

పాదములయొక్క ఆజ్ఞాకరుడు కావడం అత్యుత్కృష్ట పదవి అన్నాడు. ఒకక్క విలాసినియొక్క వాక్కులయందు ఈశ్వరుడు అనిర్వచనీయమైన రామణీయకత ఉంచాడు. ఎనుకటికి మా దేశంలో ఒక దరద్దేశపు స్త్రీని చూచాను. దానిమాటలు విని విని చెవికి మత్తెక్కి ఆ స్థలంనుంచి లేచి రావడం కష్టమైంది. మహారాజ కుమారికావారి వాగ్మాధుర్యము, ఆ మాధుర్యమును చెయ్యెత్తి మీరియున్నది. అదుగో మళ్ళీ కుమారా! బ్రహ్మ ముడి వడ్డది. రాజప్రకృతియొక్క రమ్యతను యెన్నటకు యీ బ్రహ్మడి తల తగునా అనికదూ. సంతోషమే. పైకి అండమేకదూ తప్పూ. మాటలయొక్క మంజులత విని చెవి ఆనందించినది. ఆనందించినది అని పైకి అనడంలో నాతప్పయేమి. చంద్ర మండలము ఆకాశమందు వున్నది. దానికాంతికి కళ్ళు మూసుకొమ్మంటే యెవడిశక్యము. కానీ పదిహేను రోజులాయె నేను గీత చెబుతున్నాను. ఇన్నాళ్ళూ వారు మౌనమవలంబించారు. నిన్ననే మాటాడారు. వారు మాటాడడ గానే ఆ మాటలయొక్క, ఆనందంయొక్క భావము. వేదాంతశాస్త్రవేద్యమై శబ్దజాలములో కప్పబడి యొక్కడా

కానరానప్పటికీ యెప్పుడో లభ్యమౌతుందని, యీ జన్మ మట్టుకు వృథాఅనీ అట్లు బ్రహ్మానందముయొక్క అభావము కనపడి ఆహా యెందుకు యీ పుస్తకాలు? ఇవి వున్నా యనే ఆనందం యెక్కడా కనపడదు. ఈమె మాటలు వినడమే బ్రహ్మానందం. ఈమె వాక్కులయందే అత్యంత మైన శబ్దప్రమాణము అని నిశ్చయించాను.

రణ : మీ కల్పనాచాతురికి సంతోషించాను.

బిల్వా : యేమి కల్పనాచాతురి. ఆ వాజ్మాధురి వర్ణన శబ్ద ముకు పట్టుపడనిదే. అభూతోపమ.

రణ : వారిని చూస్తిరా!

బిల్వా : చూడలేదు. చూడడమేలా? దేవుణ్ణి చూస్తున్నామా? వాడి మహిమ ప్రపంచమంతటినూ చూసి ఆశ్చర్య పడుతున్నాముకామా? మనిషిని చూడకుండా మాటల వల్ల సమ్మోహమును పొందుతూవుండుటలో ఒక అనిర్వచ నీయమయిన సొగసు వున్నది. మరివక చమత్కారము చెబుతాను. తరుచు స్త్రీవ్యక్తులలో అంగమునకు అనురూప మైన అంగసౌష్టవము ఉండుట కష్టము. స్త్రీ నడుచుకు పోతూవుంటే, ఆ నడకా, అంగములూ అతి రమ్యముగా కనపడుతాయి. ముఖంచూస్తే జాడా విరిగిపోతుంది. గనక దేవుణ్ణి చూడకుండా సృష్టివైచిత్రిని చూచి ఆనందించినట్లే ఆమెను చూడకుండా ఆమె మాటలలో మగ్నమైపోవడం మాబోటి కవులకు బ్రహ్మానందము.

రణ : (నిష్పృహను సూచించి, విచారరసముకల నవ్వునవ్వి) వాజ్మాధురిని మించిన రూపసౌందర్యము ఆమెకు కలదు.

బిల్హ : * కుమారా, మీరెలా చూస్తిరి.

రణ : ఒకమారు మదనపాలుల కుమార్తె చంద్రలేఖా, మహా రాజపుత్రికయును యీ వనము చూచుటకు వచ్చి యుండిరి. నేను వారిరాక చూచి ఒక కుంజరమున దాగుంటిని. చెలికత్తెలు పొదనుండి పొదకు వేటాడి పట్టుకొని ఆమె యెదటవుంచిరి. ఆమె తమ తల్లిగారికి నన్ను కనపర్చినారు. వారుకూడా దయ కనపర్చినారు. అప్పటినుండి కమలములు కోసి తీసుకుపోనాజ్ఞ ఆయెను. అట్లు నెలరోజులు తీసుకువెళ్లితిని. మాధవశర్మగారు దగ్గరవుండగా నేను వెళ్ళుటకలదు. ఆమె పాఠములు చదువునప్పుడు దగ్గరవుండేవాడను. శ్లోకములు రచించేవాళ్ళము. ఇలా నెలరోజులు అయిన తరవాత మాతాతగారు వచ్చినారు. †మరి నేను వెళ్ళలేదు. యీ వనంలో వారు విహరించడం తరుచుకద్దు. అట్టి సమయంలో నేను యీ యింట్లోవచ్చి దాగొనమని అజ్ఞ.

బిల్హ : ఆమె పెద్దపులికారే? నాకు బోధపడ్డది. మీమనస్సు ఆమెయందు లగ్నమాయెను, కాబోలు. యిప్పటి అవస్థను బట్టి మీ ప్రేమను రాజకుటుంబమువారు నిరాకరించిన అవమానము వచ్చుననికాబోలు.

---

* ఈ వాక్యము ముందు ఒక వాక్యము వ్రాయబడి కొట్టివేయబడ్డది. ఆవాక్యము యిది. "అలాగైతే అంతకన్న చూడకూడదు."

† ఇక్కడ వ్రాతప్రతిలో వ్రాసి కొట్టివేయబడ్డ వాక్యములు. "వెళ్ళడం మానితిని. నన్ను కాశ్మీరం పంపితిమని మాతాతగారు వర్తమానం చేశారు."

* నాటక కథా విభాగము

బిల్హణుడు యిక తాను తాను కానని యీ రంగమున వ్యక్తీకరించును. చూపులు చెదరుసన్నలు కనుబొమ్మముందు వొక జగన్మోహనావతారము తారసిల్లినప్పుడు, యెట్టి పురుషవ్యక్తినైనను నిగ్రహించుకొనుట, యెన్ని పొసగును? విష్ణువు, జగన్మోహినీ రూపము దాల్చి యెదట అవ్వసించేసరికి జితేంద్రియుడైన శివుని ధైర్యము సడలినది కాదా!

నాయిక, రాజులను గురించి బిల్హణుని అడుగును.

బిల్హణుడు, రణసింహునిపేరు చెప్పకుండా, ఆమె చెంత అతని ప్రస్తావ తెచ్చును. "రాజులను వరిణయమాడుటవల్ల స్త్రీలకు ఘనతవచ్చేమాట నిజమే; గాని ఆనందము మాటకు కలుగనేరదు. సాధారణంగా రాజులకు ఎంతోమంది సవత్తులూ, ఉంపుడుకత్తెలూ వుంటారు. రాజపత్ని అగుటవల్ల వచ్చే గొప్ప, కలిగే ఉన్నతస్థితి మిక్కుటమే; అయితే సౌఖ్యమన్నది మాత్రం కొరవడుతుంది. గొప్పతనాన్ని మనం కొరుక్కుతింటామా?"

ఆమె: అది బ్రాహ్మణుల దృష్టి.

బిల్హ: ఇది సవబయిన తార్కికదృష్టి. కొందరు రాజకుటుంబీకులు కొంతకాలం యేలుబడిచేస్తారు. మరికొంతకాలా

---

* ఇది యే అంకమో, యేరంగమో తెలియదు కాని, మహాకవి వ్రాయ తలపెట్టిన కథాభాగం. తాము నాటకీయముగ రచించుటకుముందు, మహాకవి, ఆంగ్లమున వ్రాసి అట్టిపెట్టుకున్న కథావృత్తాంతమిది. దీనిని నాటకరంగముగ తీర్చిదిద్దిరో, లేరో, సరి అట్లాగ రచించివుంచిన వ్రాతప్రతులు పోయినవేమో మనకు తెలియదు.

నకు రాజ్యాలను పోగొట్టుకుంటాము. రాజకుటుంబాల ఉద్ధతీ పతనమూ రెండూ సహజమైనవే. రాజ్యం పోగొట్టుకున్న ప్రుడు వచ్చే దుఃఖం అతిభారమైనది. ఈ దుఃఖాన్ని మీరు ఆచుకోవలెకదా! మామూలు మనుషులకే సుఖం లావు. సామ్రాజ్యభారమేవీఁ మీదపడకుండా నొత్తిగిలివుంటూ గుణసంపన్నుడూ, ప్రాజ్ఞుడూ అయిన యువకుడు ప్రేమాస్పదుడు. అన్నిటినీమించిన పవిత్రమైన నిండు ప్రేమ హృదయంగల రాజకుమారుని ప్రేమించడం శ్రేష్ఠము.

ఆమె : అలాంటి రాజపుత్రుడు నిజంగా వున్నాడా?

బిల్హ : ఆఁ! వున్నాడు.

ఆమె : యెక్కడ?

బిల్హ : చెప్పనందుకు మన్నించండి.

"నేత్రోపాసన" యిత్యాది శ్లోకములను పఠిస్తూ బిల్హణుడు మాటలు మరిపిస్తాడు.

రణసింహుని ప్రస్తి మాటిమాటికీ, తెచ్చిపెడుతూ వుంటే, ఆమె 'అతను యెవరని' కెట్టించి కెట్టించి అడుగుతూ వుంటుంది.

తన ఆశ్చర్యోపశమనమునకై రాచనగరు వొదిలి, బిల్హణుడు వెళ్ళిపోవ్రను. ఇపుడు అతను మధురాసవమునకు బాగా అలవాటుపడ్డాడు. రాజకుమారికతో మనసువిప్పి ప్రసంగిస్తాడు, బిల్హణుడు నగరు వదలి వెళిపోతున్నాడన్న వర్తమానము తెలిసి రణసింహుడు తన పరిజనులను వెంటతీసుకొని దారిలో అతనిని కలుస్తాడు. దారిమధ్య సోమనాథ్వద్ద కవినీ అతని బృందమునూ

దుండగులు అడ్డగిస్తారు. నాయకుడు రణసింహుడు వారిని తరిమివేసి బిల్హణుని కాపాడతాడు. బిల్హణుడు సముద్రంపై ప్రయాణం చేసి వెళ్లిపోతాడు.

వెళ్లిపోతూ బిల్హణుడు ఒక ఉత్తరము నాయికకు రాసి రణసింహునిచేతికి యిస్తాడు. కలత నిదురనుంచి తను లేచి వెళ్ళిపోతున్నాననీ, ఆమె ప్రేమను తాను స్వీకరించజాలననీ, తాను ఆమెచెంత యిన్నాళ్ళూ చెబుతూవస్తోన్న రాజకుమారుని ప్రేమించమనీ, ఆ రాజకుమారుడు మరెవడో కాదనీ, అతనే రణసింహుడనీ చూమినీదేవికి బిల్హణుని లేఖ.

77345

BCL

Kondu Bhatteeyamu & Bilhaneeyamu **Rs. 1-(**

త్వరలో వెలువడనున్న మహాకవి గురజాడరచనలు

మహాకవి డైరీలు : లేఖలు

తమ సమకాలిక సామాజిక జీవితంపై, సాహిత్యంపై, లలితకళలపై, విద్యా విధానంపై మహాకవి గురజాడ వెలువరించిన అభిప్రాయాలను, సిద్ధాంతాలను తెలియచేసే సంపుటి. ఆనాటి తెలుగు జీవితాన్ని ప్రతిబింబించే దర్పణం. కావ్యరచనకు ముందు, 'గురజాడ వాల్మీకి' కావించిన సాహిత్య పరిశోధనను, వివిధ విషయ పరిశీలనను తెలిపే సంపుటి.

★

ముత్యాల సరాలు

(సుభద్ర, నీలగిరి పాటలు, మిణుగురులు)

ఇది మహాకవి కవితా సంపుటి. దేశభక్తి, లవణరాజు కల, పూర్ణమ్మ మొదలైన గీతాలే కాక, గురజాడ రచించిన నీలగిరి పాటలు, 'మిణుగురులు' అనే చిన్నపిల్లల గీతములు, 'సుభద్ర' పద్యకావ్యం యీ సంపుటిలో పొందు పరచబడినవి.

★

ప్రతులకు

విశాలాంధ్ర ప్రచురణాలయం,

బకింగ్‌హామ్‌పేట : : విజయవాడ-2.

PRINTED AT SWATANTRA ART PRINTERS, VIJAYAWADA.

మువము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	PJSC119B170
పుస్తకం పేరు	కొండుభట్టీయము బాల్కీయము
తారీఖు	21 May 2024
ముందు అట్ట	NO
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	187
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	YES 92, 94, 95 ,150,152,94A
లేని పేజీలు	NO
తయారు చేసినది	Chandra Kumari
పేజీలు విడదీసినది	Nagalakshmi
స్కాన్ చేసినది	Arun
పరీక్ష చేసినది	PRIYANKA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good